



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 130 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | ఆదివారం 01 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-




## సైకిల్ కి ఓటేశారు..
# అభివృద్ధికి చోటిచ్చారు..

- ప్రజా సంక్షేమమే కూటమికి పరమావధి
- అభివృద్ధి కార్యక్రమాలకు కుప్పమే ప్రయోగశాల
- 2026లో రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టు అమలు
- ల్యాండ్ టైట్లింగ్ లాంటి నల్లచట్టం తెచ్చి గొప్పచట్టం అని చెప్పుకుంటున్నారు
- నివాసం నుంచి ప్రజావేదిక వరకూ ఇ-సైకిల్ తో ర్యాలీగా వచ్చిన సీఎం
- 24 గంటల్లో 5555 ఇ-సైకిళ్ల పంపిణీతో కుప్పానికి గిన్నీస్ రికార్డు
- కుప్పంలో పేదల సేవలో కార్యక్రమం ప్రజావేదికలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గత ఎన్నికల్లో సైకిల్ కు ఓటేసి ప్రజలు అభివృద్ధికి చోటిచ్చారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గం గుడిపల్లె మండలం బెగ్గిలపల్లెలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. బెగ్గిలపల్లెలో ముగ్గురు లబ్దిదారుల నివాసాలకు వెళ్లిన సీఎం మునెమ్మ అనే వృద్ధురాలికి వృద్ధాప్య పింఛను, చిన్న తాయమ్మ అనే మహిళకు వితంతు పింఛను, వెంకట రామప్ప అనే లబ్ధిదారుకు వృద్ధాప్య పింఛను అందించారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆ గ్రామానికి వెళ్లే మార్గంలో తనను చూసేందుకు తరలి వచ్చిన మహిళలకు సీఎం చంద్రబాబు అప్యాయంగా పలకరించారు. గ్రామస్థుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అంతకుముందు బెగ్గిలపల్లె మండల పరిషత్ పాఠశాల విద్యార్థులతో సీఎం ముచ్చటించారు. అనంతరం పేదల సేవలో ప్రజా వేదిక బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. దేశంలోని ఏ రాష్ట్రమూ ఇవ్వనంత సంక్షేమాన్ని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అందిస్తున్నామని సీఎం వివరించారు. ప్రతీ నెలా రూ. 2730 కోట్ల మేర పెన్షన్ల రూపంలో లబ్ధిదారులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు. పొరుగున తమిళనాడులో నెలకు రూ. 315 కోట్లు, కర్ణాటకలో రూ. 392 కోట్లు మిగతా .. 2లో..

అమెరికా చెప్పే ప్రతిదానికి
## భారత్ తలాడించదు
### యూఎస్ రిటైర్డ్ కల్నల్



**విశ్వం వాయిస్ న్యూస్ :** గత కొంతకాలంగా భారత్–అమెరికాల మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ చర్చలపై అమెరికా రిటైర్డ్ కల్నల్, రక్షణ రంగ నిపుణుడు డగ్లస్ మక్‌గ్రెగర్ స్పందించారు. వాణిజ్య ఒప్పందాల కోసం అమెరికా చెప్పే ప్రతిదానికి భారత్ మిగతా .. 2లో..

ఏప్రిల్ 30 నాటికి..
## అయోధ్య రామాలయ పనులు పూర్తి



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తర్‌ప్రదేశ్ అయోధ్యలోని రామాలయ నిర్మాణానికి చెందిన మిగిలిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఏప్రిల్ 30 నాటికి నిర్మాణ పనులు పూర్తవుతాయని ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా మిగతా .. 2లో..

చట్ట ప్రకారం
## నోటీసు ఇవ్వలేదు..
### జూబ్లీహిల్స్ ఏసీపీకి కేసీఆర్ లేఖ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు ఇచ్చిన నోటీసులు అక్రమమని, రాజ్యాంగ ఉల్లంఘన అని భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ అన్నారు. అయినప్పటికీ మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్షనేతగా, బాధ్యత గల పౌరుడిగా ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో విచారణకు అందుబాటులో ఉంటానని తెలిపారు. నోటీసులు ఇచ్చే విషయంలో సిట్ అధికారులు వ్యవహరించిన తీరు చట్టాలకు వ్యతిరేకమని, సుప్రీంకోర్టు తీర్పులను తుంగలో తొక్కారని మండిపడ్డారు. అధికారులకు నోటీసు ఇచ్చే అధికారమే లేదని, రాజ్యాంగ హక్కులను కాలరాయడమేనని మిగతా .. 2లో..

కేజీహెచ్ సిబ్బంది నిర్లక్ష్యంతో
## నా బిడ్డను కోల్పోయాను

- బాధ్యులైన వైద్యులు, సిబ్బందిపై విచారణ జరిపి చర్యలు తీసుకోండి
- విశాఖ విమానాశ్రయంలో పవన్ కళ్యాణ్‌కి మహిళ వినతి
- మహిళ ఫిర్యాదుపై తక్షణం స్పందించిన ఉప ముఖ్యమంత్రివర్యులు
- సోమవారం బాధిత కుటుంబాన్ని సచివాలయంలోని కార్యాలయానికి దగ్గరుండి తీసుకురావాలని అధికారులకు ఆదేశం



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నం కేజీహెచ్ వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా కారణంగా గర్భంలోనే తన శిశువు మృతి చెందిందని ఓ మహిళ చేసిన ఫిర్యా దుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ తక్షణం స్పందించారు. బాధిత మహిళను కుటుంబంతో సహా సోమవారం రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయానికి వెంటబెట్టుకుని తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. బాధిత మహిళతోపాటు ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి గర్భస్థ శిశువు మృతికి సంబంధించి వివరాలు తెలుసుకుంటారు. శుక్రవారం రాత్రి విశాఖ పర్యటనముగించుకుని తిరుగు ప్రయాణంలో ఉండగా విమానాశ్రయంలో పట్నాల ఉమాదేవి అనే మహిళ మిగతా .. 2లో..

పేదలను దృష్టిలో పెట్టుకొని
## బడ్జెట్ రూపొందించాలి
### రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది. గురువారం ఏకంగా 92 మార్క్‌ను తాకి, సరికొత్త జీవనకాల కనిష్ఠానికి చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రూపాయి విలువ ఇంత క్షీణిస్తున్నప్పటికీ దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు, రూపాయి రేటు డాలర్‌కు 63 ఉండగా, ఇప్పుడు ప్రస్తుతం 92 అయ్యిందన్నారు. అయినప్పటికీ దీనిపై మిగతా .. 2లో..

## అంబటి అసభ్య వ్యాఖ్యలు..
### ఎస్పీకి తెదేపా నేతల ఫిర్యాదు



**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల లడ్డూ నెయ్యి కల్తీపై గుంటూరులో తెదేపా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ.. కాసేపు ఉద్రిక్తతకు కారణమైంది. గోరంట్లలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద మహాపాపం పేరుతో తెదేపా నేతలు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీ తొలగించాలని, లేకపోతే తామే తొలగిస్తామని వైకాపా నేత అంబటి రాంబాబు శుక్రవారం చెప్పారు. ఈ క్రమంలో ఇవాళ ఉదయం గోరంట్ల వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అంబటి ఫ్లెక్సీ వద్దకు వస్తామని ప్రకటించారు. విషయం తెలుసుకున్న తెదేపా నాయకులు, కార్యకర్తలు ఫ్లెక్సీ వద్దకు భారీగా చేరుకున్నారు. గొడవ జరిగే అవకాశం ఉందని భావించిన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీ వద్దకు రావొద్దని అంబటికి పోలీసులు సూచించారు. అయితే, ఆలయంలో పూజల తర్వాత అంబటి ఆ మార్గంలో వెళ్తుండగా తెదేపా శ్రేణులు అడ్డుకు న్నాయి. అంబటి కారు దిగేందుకు ప్రయత్నించగా.. పోలీసులు వారించారు. ఆగ్రహంతో ఊగిపోయిన అంబటి రాంబాబు.. ముఖ్యమంత్రి చంద్రబాబునుతీవ్ర అసభ్య పదజాలంతో మిగతా .. 2లో..

అంబటి గురించి మాట్లాడాలంటేనే
## సిగ్గు అనిపిస్తోంది
### హోం మంత్రి అనిత



**అనకాపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రిపై అసభ్య వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి అంబటి రాంబాబుపై ఏపీ హోం మంత్రి అనిత ఫైర్ అయ్యారు. "వైకాపా నాయకులు దిగజారి రాజకీయం చేస్తున్నారు. సీఎం గురించి అంబటి అత్యంత నీచంగా మాట్లాడారు. రాష్ట్రంలో విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు. పోలీసులను కూడా అత్యంత దారుణంగా దూషించారు. అంబటి లాంటి వారి గురించి మాట్లాడాలంటేనే సిగ్గు అనిపిస్తోంది. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు తెదేపా నేత పట్టాభి ఓ చిన్న మాట అన్నందుకు తెదేపా కార్యాలయంపై దాడి చేశారు. నిబద్ధత మిగతా .. 2లో..

ప్రతి డివిజన్, ప్రతి వార్డూ గెలుపు
## మనకు ముఖ్యమే
### తెలంగాణా రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఆన్‌లైన్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో తదుపరి మిగతా .. 2లో..

## అంబటి రాంబాబు ఇంటి వద్ద ఉద్రిక్తత..
### క్షమాపణ చెప్పాలని డిమాండ్



**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబుపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వైకాపా నేత అంబటి రాంబాబుపై తెదేపా శ్రేణులు భగ్గుమన్నాయి. బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ తెదేపా కార్యకర్తలు గుంటూరు నవభారత్ నగర్‌లోని మిగతా .. 2లో..

## అంతర్జాతీయ ఎర్ర చందనం స్మగ్లర్ ముజామిల్ అరెస్ట్



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటక రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ మొహమ్మద్ ముజామిల్‌ను ఏపీ ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు, మిగతా .. 2లో..

## బిల్‌గేట్స్‌కు ఆ వ్యాధి..
### ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో సంచలన ఆరోపణలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం దర్యాప్తునకు సంబంధించి 30 లక్షల పేజీలను అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌కు సంబంధించిన ఓ విషయం వెలుగులోకి వచ్చింది. గేట్స్ రష్యన్ మహిళలతో లైంగిక సంబంధాలు నెరిపాడని.. అందువల్లే ఆయన సుఖవ్యాధుల బారిన పడ్డారని మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## సైకిల్‌కు ఓటేశారు...
# అభివృద్ధికి చోటిచ్చారు

పెన్షన్లు నిమిత్తం ఖర్చు చేస్తున్నారని సీఎం అన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఏపీలో పేదలకు ఏ స్థాయిలో పెన్షన్ అందచేస్తున్నామనేది గుర్తించాలన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని అన్నారు. ఎంత మంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం పథకం వర్తింప చేశామన్నారు. దీపం-2.0 పథకం కింద గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని వివరించారు. అన్ని రంగాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం కల్పించింది టీడీపీనే అని అన్నారు. ఆస్తిలో సమాన హక్కు ఎన్టీఆర్ కల్పిస్తే తాను 33 శాతం రిజర్వేషన్లను ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో అమలు చేసినట్టు వివరించారు. త్వరలో చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు రానున్నాయన్నారు. సమీప భవిష్యత్తులో మహిళలు ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులుగా ఎదుగుతారని అన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ ద్వారా లక్ష మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేసే లక్ష్యాన్ని మరింత పెంచుతామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డ్వాక్రా సంఘాల్లోని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం ఆకాంక్షించారు.

**అభివృద్ధి కార్యక్రమాలకు కుప్పం ఓ ప్రయోగశాల**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు కుప్పం నియోజకవర్గమే ఓ ప్రయోగశాల అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అక్కడ అమలు చేసి విజయవంతమైన మోడళ్లను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసి విజయం సాధిస్తున్నామని తెలిపారు. కుప్పంలో పైలట్ గా ప్రారంభించి విజయవంతమైన డిజిటల్ హెల్త్ రికార్డుల ప్రాజెక్టు సంజీవనిని ఈ ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని సీఎం అన్నారు. మెరుగైన వైద్యాన్ని సేలవను ప్రజల ఇంటి వద్దకే అందుబాటులోకి తెచ్చేలా ఈ సంజీవని ప్రాజెక్టు అమలు చేయాలని నిర్ణయించినట్టు స్పష్టం చేశారు. ఫోన్ల ద్వారా వైద్యుల అప్పాయింట్మెంట్లు, నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఈ ప్రాజెక్టు ఉపకరిస్తుందన్నారు. సోలార్ రూఫ్ టాప్ ద్వారా ప్రజలకు విద్యుత్ భారం తగ్గేలా చూస్తున్నామని.. కుప్పం నియోజకవర్గంలో ఈ ప్రాజెక్టును సమర్థంగా అమలు చేస్తామన్నారు. హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకువచ్చి రైతులకు నీళ్లు అందించామని సీఎం అన్నారు. నియోజకవర్గంలో వర్షపు నీటిని కూడా సద్వినియోగం చేసుకునేలా లింక్ కెనాల్స్, చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని వివరించారు. కుప్పంలోని యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రూ. 7088 కోట్ల పెట్టుబడులతో 16 పరిశ్రమలు వచ్చాయని వీటి ద్వారా 34 వేల పైచిలుకు మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 70 వేల మందికి ఉపాధి లభించేలా చేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఆదిత్య బిర్లా సంస్థతో కలిసి మల్టీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ప్రారంభించామని తెలిపారు. వర్క్ ఫ్రం హోం చేసుకునే వారికి... ఆఫీసు స్పేస్ లేని వారికి ఉపయోగపడేలా కుప్పంలో రాష్ట్రంలోనే తొలి కో-వర్కింగ్ స్పేస్ ను ఏర్పాటు చేశామని అన్నారు. కంగుంది ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. రాక్ క్లైబింగ్ పార్కును కూడా అభివృద్ధి చేశామన్నారు. ఫ్లవర్ ఫెస్టివల్ ద్వారా పర్యాటకానికి దారులు తెరిచామని.. ఇక్కడ హోం స్టేలు కూడా అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. మొత్తంగా కుప్పంలో ప్రతీ ఒక్కరికీ ఉపాధి కల్పించే ప్రయత్నం చేస్తున్నామని దానిని సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. హంద్రీనీవా, గాలేరు నగరి సహా రాయలసీమలోని అన్ని ప్రాజెక్టులూ పూర్తి చేస్తామన్నారు. స్వర్ణాంధ్ర విజన్ తో ఏపీని అగ్రస్థానంలో నిలబెడతామని కుప్పం అభివృద్దే దానికి మొదటి మెట్టని ముఖ్యమంత్రి వివరించారు.

**ఐదేళ్ల పాటు పట్టి పీడించటం వల్లే రాష్ట్రానికి కష్టాలు**

విధ్వంస పాలనతో రాష్ట్ర అభివృద్ధిని వెనక్కు నెట్టారని.. వైసీపీ ఐదేళ్ల పాలన కారణంగానే కూటమి ప్రభుత్వానికి వారసత్వ సమస్యలు వచ్చాయని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. ప్రజల ఆస్తులపై ఫొటోలు వేసుకున్నారని, గెలాక్సీ గ్రానైట్ తో సరిహద్దు రాళ్లు తయారు చేయించి వాటిపై బొమ్మలు ముద్రించారని అన్నారు. దీనికోసం రూ.700 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారన్నారు. దుర్మార్గం చేసింది చాలక తమ పాలనే బెటర్ అంటూ ఇప్పుడు మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరుతో ఓ నల్ల చట్టం తెచ్చారని.. భూ వివాదాలు వస్తే స్థానిక కోర్టులకు వెళ్లే అవకాశం లేకుండా చేశారన్నారు. ప్రజల ఆస్తులు కాజేసే ఘోరమైన చట్టం చేసి తనదే గొప్ప చట్టం అంటూ బుకాయిస్తున్నారని సీఎం అన్నారు. 22 ఏ పేరుతో భూ వివాదాలు సృష్టించారని ఆ వివాదాలు పరిష్కరించేందుకు ఆయన పెట్టుకున్న గుమస్తాకే అప్పగించేలా చట్టం చేసుకున్నారని ఆక్షేపించారు. గత ప్రభుత్వం చేసిన నల్ల చట్టాన్ని రద్దు చేసి... ఆ పాలనలో జరిగిన సర్వే తప్పిదాలను సరిచేస్తున్నామని అన్నారు. ఎవరూ ట్యాంపర్ చేయలేని విధంగా ఆధునిక టెక్నాలజీని వినియోగించి పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించి అందిస్తున్నామని అన్నారు. పేదలకు అండగా ఉండేలా వివిధ రకాల కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణ- మహిళా సాధికారిత లక్ష్యంగా ఇ-సైకిళ్ల పంపిణీ**

పర్యావరణ పరిరక్షణ- సాధికారత లక్ష్యంగా మహిళలకు ఇ-సైకిళ్లను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. 24 గంటల వ్యవధిలో 5555 సైకిళ్లను లబ్దిదారులకు పంపిణీ చేసి గిన్నీస్ వరల్డ్ రికార్డును కుప్పం నియోజకవర్గం నమోదు చేసింది. ఇ-సైకిళ్లను ఇంత పెద్ద సంఖ్యలో పంపిణీ చేయటంపై ఈ రికార్డు నమోదు అయినట్టు గిన్నీస్ వరల్డ్ బుక్ అజుడికేటర్ ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సైకిళ్ల తయారీ సంస్థ ఇ-మోటరాడ్ ప్రతినిధులకు సర్టిఫికెట్ అందించారు. కుప్పాన్ని కాలుష్య రహితంగా చేసేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగా 5555 ఇ-సైకిళ్లను పంపిణీ చేసినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇ- సైకిళ్లకు సూపర్ సైకిల్ అని పేరుపెట్టినట్టు సీఎం వివరించారు. 60 కిలోమీటర్ల వరకూ సైకిల్ పైనే ప్రయాణించి పనులు చేసుకోవచ్చని సీఎం తెలిపారు. వీటి ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడటంతో పాటు కాలుష్యాన్ని కూడా తగ్గించేలా చూస్తున్నామని అన్నారు. ఇ-సైకిళ్ల వినియోగం ద్వారా ప్రతీ కుటుంబం రూ.1000 నుంచి 1500 వరకూ ఆదా చేసుకోవచ్చని అన్నారు. స్కూటర్ ద్వారా ప్రతీ కిలోమీటరు ప్రయాణానికి 68 గ్రాముల మేర కార్బన్ డై ఆక్సైడ్ విడుదలై కలుషితం అవుతుందని.. ఇ-సైకిల్ ద్వారా కేవలం 15 గ్రాములు మాత్రమే పరోక్షంగా వస్తుందని తద్వారా 75 శాతం ఉద్గారాలు తగ్గుతాయన్నారు. ప్రతీ వెయ్యి ఇ- సైకిళ్ల ద్వారా ఏడాదికి 37 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ తగ్గుతుందని ముఖ్యమంత్రి అన్నారు. సైకిల్ అంటే పురోగతికి చిహ్నమని.. ఇ-సైకిల్ ఈ తరానికి సింబల్ గా నిలుస్తుందని అన్నారు. కడుపల్లెలోని తన నివాసం నుంచి ముఖ్యమంత్రి ఇ- సైకిళ్లపై ర్యాలీగా ప్రజా వేదిక వద్దకు చేరుకున్నారు. దాదాపు ఏడు కిలోమీటర్ల మేర హుషారుగా సైకిల్ తొక్కిన ముఖ్యమంత్రి మార్గమధ్యంలో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

## అమెరికా చెప్పే ప్రతిదానికి
# భారత్ తలాడించదు

తలాడించదని అన్నారు. ఎందుకంటే సొంత ప్రయోజనాలకు రాజీపడి ఏ దేశమూ ఇతర దేశాలతో చర్చలు జరపబోదన్నారు. మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాతో వ్యాపారం చేస్తుందన్న కారణంతో భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు 50 శాతం సుంకాలు విధించడం ట్రంప్ మూర్ఖపు మనస్తత్వాన్ని తెలియజేస్తోందని విమర్శించారు. అమెరికాతో భారత్ సంబంధాలపై మక్‌గ్రెగర్ మాట్లాడుతూ.. అమెరికా ఎప్పుడూ ప్రపంచదేశాలు తనతోనే ఉండాలి.. లేదా తనకు వ్యతిరేకంగా ఉండాలనే సిద్ధాంతాన్ని పాటిస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా భారత్-రష్యాలు మిత్ర దేశాలుగా కొనసాగుతున్నాయని.. ఇప్పుడు వాటిని కలిసి వ్యాపారం చేయొద్దంటే అవి అమెరికాను వ్యతిరేకించే అవకాశం ఉందని పేర్కొన్నారు. మలేసియా వంటి దేశాలు యూఎస్‌తో వాణిజ్య ఒప్పందం కోసం తమ ప్రధాన విధానాల విషయంలో కూడా రాజీపడాల్సి వచ్చిందన్నారు. గ్రీన్‌లాండ్‌తో వ్యాపారం చేసే ఐరోపా దేశాల పైనా ట్రంప్ టారిఫ్‌లు విధించడాన్ని ప్రస్తావించారు. ఇలా ప్రపంచ దేశాలపై బెదిరింపులకు దిగుతూ.. ఇష్టం వచ్చినట్లు సుంకాలు విధిస్తే అమెరికాకే నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు.

# అయోధ్య రామాలయ పనులు పూర్తి

తెలిపారు. విలేకరులతో మిశ్రా మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి ఎల్ అండ్ టీ, టీసీఎస్ కంపెనీలు మూడేళ్ల కాలానికి ఒప్పందం చేసుకున్నాయని తెలిపారు. మిగిలిన పనుల నిమిత్తం కంపెనీలకు చెందిన బృందాలు ఆలయం వద్ద విధులు నిర్వర్తిస్తాయని చెప్పారు. ఈ ప్రాజెక్టు మొత్తం ఖర్చు రూ.19 వందల కోట్లు అవుతుందని, ఇప్పటివరకు రూ.16 వందల కోట్లు చెల్లించామని వెల్లడించారు. ఏప్రిల్ 30 నాటికి పేపర్ వర్క్, బిల్లు చెల్లింపులు కూడా పూర్తవుతాయన్నారు. ఆ తర్వాత ఆలయం శ్రీరామ జన్మభూమి ఆలయ ట్రస్ట్ పరిధిలోకి వస్తుందన్నారు. నగర శైలిలో నిర్మిస్తోన్న ఈ రామమందిరం 2.7ఎకరాల్లో విస్తరించి ఉంది. 380 అడుగుల పొడవు, 250 అడుగుల వెడల్పు, 161 అడుగుల ఎత్తులో దీన్ని నిర్మిస్తున్నారు. మొత్తంగా 392 స్తంభాలు, 44 ద్వారాలు ఉంటాయి. అయోధ్యలో రెండేళ్ల క్రితం బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగిన సంగతి తెలిసిందే.

# నా బిడ్డను కోల్పోయాను

పవన్ కళ్యాణ్‌ని కలిశారు. గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో కాన్పు నిమిత్తం కేజీహెచ్ లో చేరగా.. వైద్యులు, సిబ్బంది తన పట్ల, తన కుటుంబ సభ్యుల పట్ల నిర్లక్ష్యంగా, ఎంతో అమానవీయంగా ప్రవర్తించారని ఫిర్యాదు చేశారు. కాన్పుకి ఇచ్చిన గడువు పూర్తయ్యిందని తెలిపినప్పటికీ సాధారణ కాన్పు పేరిట నరకం చూపించారని, తన పరిస్థితి ఆందోళనకంగా ఉందని కుటుంబ సభ్యులు పదేపదే చెప్పినా వినిపించుకోలేదని తెలిపారు. పైగా తన కుటుంబ సభ్యులను తీవ్ర పదజాలంతో దూషించారని, కాన్పు సమయంలో తన గుండెల పైకి ఎక్క కూర్చుని సాధారణ కాన్పు పేరిట అమానవీయంగా ప్రవర్తించారని వాపోయారు. చివరి నిమిషం వరకు సిజేరియన్ నిర్ణయం తీసుకోకపోవడం కారణంగా మృత శిశువుకి జన్మనివ్వాల్సి వచ్చిందని ఆమె చెప్పారు. కేజీహెచ్ సిబ్బంది తీరుతో శారీరక హింసతోపాటు జీవితకాలం మనో వేదన మిగిల్చిందంటూ తన గోడు వెళ్లబోసుకున్నారు. తన లాంటి దుస్థితి మరో మహిళకు రాకుండా వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. ఆ మహిళ వేదన విని చలించిన పవన్ కళ్యాణ్ ప్రభుత్వం తరఫున తగిన భరోసా ఇవ్వాలని నిర్ణయించారు.

# అంబటి అసభ్య వ్యాఖ్యలు..

దూషించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అంబటిని అక్కడి నుంచి పోలీసులు పంపించేశారు.

**అంబటిపై ఎస్పీకి ఫిర్యాదు..**

సీఎం చంద్రబాబుపై అసభ్య వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబుపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ గుంటూరు జిల్లా తెదేపా అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మరో వైపు గుంటూరులోని అంబటి ఇంటి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# బడ్జెట్ రూపొందించాలి

ప్రధాని నోరు మెదపట్లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో సిబల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ పేదలకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రతి ఏడాది అనుకుంటున్నానని.. కానీ గత 11ఏళ్లుగా ఆ విధంగా జరగట్లేదని సిబల్ అన్నారు. ఆదివారం ప్రవేశపెట్టే బడ్జెట్ అయినా పేదల బాధను తగ్గించి, ఆనందాన్ని పెంచుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని అన్నారు. అందుకు అనుగుణంగానే పేద ప్రజల అభివృద్ధి, తక్కువ నిధులు ఉన్న రాష్ట్రాల పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌ను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

## చట్ట ప్రకారం
# నోటీసు ఇవ్వలేదు..

ఆక్షేపించారు. జూబ్లీహిల్స్ ఏసీపీ శుక్రవారం ఇచ్చిన నోటీసుకు కేసీఆర్ సుదీర్ఘ సమాధానం ఇచ్చారు. మొదట తనకు ఇచ్చిన నోటీసుకు స్పందించి... ఎర్రవల్లిలో విచారణకు అందుబాటులో ఉంటానని, ఇకనుంచి నోటీసు అక్కడే ఇవ్వాలని తాను సమాధానం ఇచ్చినట్లు గుర్తు చేశారు. అయితే కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి నందినగర్ లోని తన నివాసం గోడకు నోటీసు అంటించారని, దానిపై జూబ్లీహిల్స్ ఏసీపీ సంతకం ఉందని కేసీఆర్ తెలిపారు. ఒకవేళ జూబ్లీహిల్స్ ఏసీపీ ఆదేశాల మేరకే అలా చేసి ఉంటే... దానిపై తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగం, చట్టం, సుప్రీంకోర్టు తీర్పుల పట్ల అధికారులకు ఎలాంటి గౌరవం లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. పలు సెక్షన్లు, సుప్రీంకోర్టు తీర్పులను లేఖలో ప్రస్తావించిన కేసీఆర్... వాటి ప్రతులను కూడా జతపరిచారు. సత్యేంద్ర కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ కేసులో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సుప్రీంకోర్టు... వాట్సాప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా నోటీసులు పంపడం చట్టబద్ధమైన పద్ధతి కాదని, చట్టం నిర్దేశించిన రీతిలోనే నోటీసులు ఇవ్వాలని పేర్కొందని గుర్తు చేశారు. సీఆర్పీసీ 160 కింద నోటీసులను వ్యక్తిగతంగా అందజేయాలని తెలిపారు. వాటన్నింటినీ విస్మరించి ఉద్దేశపూర్వకంగా సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించి మరీ నోటీసులను గోడపై అంటించారని మండిపడ్డారు. ఎర్రవల్లికి నోటీసులు పంపాలని కోరినప్పటికీ విస్మరించారని అభ్యంతరం వ్యక్తం చేశారు. వీటన్నింటి దృష్ట్యా శుక్రవారం తనకు జారీ చేసిన నోటీసు చట్టబద్ధం కాదని, అక్రమమైన ఆ నోటీసును తాను పక్కకు పెట్టవచ్చని కేసీఆర్ తెలిపారు. నోటీసుల జారీ రాజ్యాంగంలోని 14, 21 ఆర్టికల్ ప్రకారం తన గౌరవానికి భంగం కలిగించడమేనని అన్నారు. అసలు సీఆర్పీసీ 160 కింద తనకు నోటీసులు ఇచ్చే అధికారమే జూబ్లీహిల్స్ ఏసీపీకి లేదని, తన నుంచి స్టేట్ మెంట్ కూడా నమోదు చేయకూడదని పేర్కొన్నారు. ఎలాంటి అధికార పరిధి లేకుండా తనకు ఇచ్చిన నోటీసు పూర్తి అక్రమమని, దాన్ని తాను గౌరవించాల్సిన అవసరం లేదని తెలిపారు. అటు ఎర్రవల్లి కాకుండా ఎన్నికల అఫిడవిట్‌లో ఉన్న నందినగర్‌నే నివాస చిరునామాగా పరిగణిస్తామని చెప్పడం కూడా సరికాదని ఆక్షేపించారు. సీఆర్పీసీ 160 సెక్షన్ కింద అది సరికాదని, 65 ఏళ్ల పైబడిన వ్యక్తి ఎక్కడ నివసిస్తే అక్కడే విచారణ చేయాలని తెలిపారు. గత కొన్నేళ్లుగా తాను ఎర్రవల్లిలోనే నివసిస్తున్నట్లు అందరికీ తెలుసని, చట్టప్రకారం తన వాంగ్మూలాన్ని అక్కడే నమోదు చేయాల్సి ఉంటుందని అన్నారు. ఇదే సమయంలో పార్టీ ఎమ్మెల్యే హరీశ్ రావు ఎన్నికల అఫిడవిట్ లో సిద్దిపేట చిరునామా ఉంటే హైదరాబాద్‌లో నోటీసులు ఇచ్చారని గుర్తు చేశారు. తద్వారా అధికారుల ద్వంద్వ వైఖరి అర్థమవుతోందని విమర్శించారు. చట్టప్రకారమైతే వాంగ్మూలం నమోదు కోసం తాను నందినగర్‌లో ఉండాల్సిన అవసరం లేదని, పట్టించుకోకుండా వదిలివేయవచ్చన్నారు. న్యాయపరంగా అవసరం లేనప్పటికీ... మాజీ ముఖ్యమంత్రిగా, ప్రధాన ప్రతిపక్షనేతగా, బాధ్యతగల పౌరునిగా విచారణకు సహకరిస్తానని తెలిపారు. అందులో భాగంగా రేపు మధ్యాహ్నం 3 గంటలకు నందినగర్ నివాసంలో అందుబాటులో ఉంటానని, అక్కడ తన వాంగ్మూలం నమోదు చేసుకోవచ్చని లేఖలో పేర్కొన్నారు.

## అంబటి గురించి మాట్లాడాలంటేనే
# సిగ్గు అనిపిస్తోంది

కలిగిన నాయకుడు సీఎం చంద్రబాబు. ఆయన గురించి ఇష్టానుసారం మాట్లాడితే కఠిన చర్యలు ఉంటాయి. కచ్చితంగా కేసు నమోదు చేస్తాం. సీఎం చంద్రబాబును ఒక మాట అంటే.. రాష్ట్ర ప్రజలను అన్నట్టే. కల్తీ నెయ్యి వ్యవహారంలో వైకాపాపై రాష్ట్ర ప్రజలు ఉమ్మి వేస్తున్నారు. ప్రసాదాన్ని కల్తీ చేసి రూ.250 కోట్ల స్కామ్ చేశారు. డైవర్షన్ పాలిటిక్స్ చేయడానికి అంబటి ప్రయత్నిస్తున్నారు. శాంతిభద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఎంత ముఖ్యమో.. ప్రజల రక్షణ కూడా అంతే ముఖ్యం" అని హోం మంత్రి స్పష్టం చేశారు.

## ప్రతి డివిజన్, ప్రతి వార్డూ గెలుపు
# మనకు ముఖ్యమే

కార్యాచరణపై పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు, నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. "ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం వద్దు. భాజపా, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలి. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే. రెబల్స్ విషయంలో మాట్లాడి సమన్వయం చేసుకోవాలి. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలి" అని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు చేశారు.

# అంబటి రాంబాబు ఇంటి వద్ద ఉద్రిక్తత..

అంబటి ఇంటిని ముట్టడించారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో భారీగా మహిళా కార్యకర్తలు తరలివచ్చారు. కొందరు కార్యకర్తలు రాళ్లు రువ్వేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. అంబటి క్షమాపణలు చెప్పే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని తెదేపా నేతలు స్పష్టం చేశారు. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. అంబటి ఇంటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అంతర్జాతీయ ఎర్ర చందనం స్మగ్లర్ ముజామిల్ అరెస్ట్

ఎస్పీ శ్రీనివాస్, అదనపు ఎస్పీ కులశేఖర్ శనివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. "శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్ర చందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో టాస్క్‌ఫోర్స్ కఠిన చర్యలను చేపట్టింది. అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నాం. మరో వైపు జాతీయ, అంతర్జాతీయ స్మగ్లర్లపై ప్రత్యేక నిఘా పెట్టాం. పాత కేసుల్లో పరారీలో ఉన్న స్మగ్లర్లను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. ఇందులో భాగంగానే ఎప్పటి నుంచో పరారీలో ఉన్న మొహమ్మద్ ముజామిల్‌ను పక్కా ప్రణాళిక ప్రకారం అదుపులోకి తీసుకున్నాం. శనివారం తిరుపతి రూరల్ మండలం, చిత్తూరు - నాయుడుపేట రోడ్డు తనపల్లి క్రాస్ వద్ద అరెస్ట్ చేశాం. ఎర్రచందనం దుంగలను చైనాకు ఎగుమతి చేస్తూ, అదే ముసుగులో శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేస్తున్నాడు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎర్రచందనం స్మగ్లర్లు సయ్యద్ అబ్దుల్ లతీఫ్ అలియాస్ సెట్టు, సేటుభాయ్, వాజీబ్‌తో అతడికి పరిచయం ఉంది. బెంగళూరుకు చెందిన రవి ద్వారా ఎర్రచందనం దుంగలు తక్కువ ధరకే కొనేవాడు. ఆ ఎర్రచందనం దుంగలను రైతుల వద్ద కొన్నట్టుగా ప్రభుత్వ అనుమతులు తీసుకొని, వాటిని చైనాకు అక్రమంగా రవాణా చేసి అధిక లాభాలు ఆర్జించేవాడు" అని విచారణలో తేలిందని టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు తెలిపారు.

# బిల్‌గేట్స్‌కు ఆ వ్యాధి..

ఎప్‌స్టీన్ ఆరోపణలు చేశాడు. తాజాగా విడుదలైన ఫైల్స్‌లో ఈ విషయం వెల్లడైందని మీడియాలో కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం.. 2013లో తనకి తాను రాసుకున్న ఈ-మెయిల్‌లో ఎప్‌స్టీన్ ఈ విషయాలు ప్రస్తావించాడు. రష్యన్ అమ్మాయిలతో గేట్స్ లైంగిక సంబంధాలు నెరిపాడని ఆరోపించాడు. దీంతో ఆయన సుఖవ్యాధుల బారిన పడ్డారని పేర్కొన్నాడు. ఈ విషయం బయటపడకుండా ఉండేందుకు ఆయన తన భార్య మిలిందాకు రహస్యంగా ఇచ్చేందుకు యాంటీబయాటిక్స్ తనను అడిగారని ఎప్‌స్టీన్ తెలిపాడు. ఇదే మెయిల్‌లో ఆ తరువాత తనతో ఉన్న ఆరేళ్ల స్నేహాన్ని గేట్స్ తెంచుకున్నాడని ఎప్‌స్టీన్ వెల్లడించాడు. అయితే.. ఈ ఆరోపణలను గేట్స్ బృందం తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా అసంబద్ధమైనవని అతని ప్రతినిధి మీడియాతో పేర్కొన్నారు. తనతో సంబంధాలు కొనసాగించకపోవడం వల్లే ఎప్‌స్టీన్ ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేశాడని తెలిపారు.

# ఎడిటర్ వాయిస్

## తిరుపతి లడ్డూ.. బడ్జెట్ సెషన్‌కి జగన్ వస్తున్నారా?

తిరుపతి లడ్డూ చుట్టూ గత కొన్ని రోజుల రాజకీయ వివాదం రాజుకుంది. సోషల్ మీడియా అయితే దీని మీద హోరెత్తిపోతోంది. తాము ఏ తప్పూ చేయలేదని వైసీపీ అంటోంది. కొవ్వు జంతువుల నూనె కలిసిందని కూటమి ప్రభుత్వ పెద్దలు గతంలో ప్రచారం చేశారని వారు క్షమపణలు చెప్పాలని వైసీపీ నేతలు అంటూంటున్నారు. దానికి ప్రతిగా కూటమి ప్రభుత్వం నుంచి మంత్రులు కీలక నేతలు వైసీపీ మీద ఎటాక్ చేస్తున్నారు. దాదాపుగా 68 లక్షల కేజీల కల్తీ నెయ్యితో లడ్డూలను తయారు చేశారని వందల కోట్లు దీని వెనక చేతులు మారాయని ఘాటు విమర్శలు చేస్తున్నారు. అత్యంత ప్రమాదకరమైన రసాయనాలు వాడిన నెయ్యితో లడ్డూలను తయారు చేశారు అని నిందిస్తున్నారు. దీనికి వైసీపీ ప్రాయశ్చిత్తం చేసుకోవాలని కూటమి గట్టిగా డిమాండ్ చేస్తోంది.

**భారీ కుట్రతో :** వైసీపీ ప్రభుత్వ హయాంలో 20 కోట్ల లడ్డూలు కల్తీ నెయ్యితో తయారయ్యాయని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తాజాగా సంచలన ఆరోపణలు చేశారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ సిట్ దాఖలు చేసిన ఫైనల్ చార్జ్‌షీట్‌తో ఈ బండారం బట్టబయలైందని ఆయన అన్నారు. ఒక విధంగా చూస్తే ఇది స్లో పాయిజన్ ఇచ్చి హిందువులను హతమార్చే అతి పెద్ద కుట్రగా ఆయన ఆరోపించారు. వైఎస్ జగన్ వైసీపీ నేతలు హిందూ సమాజానికి తక్షణమే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

**అసెంబ్లీలో చర్చకు సవాల్ :** ఇదిలా ఉంటే ప్రస్తుతం మీడియా సోషల్ మీడియాల ద్వారా సాగుతున్న లడ్డూ వివాదం అసెంబ్లీలో కూడా చర్చగా రానుందని అంటున్నారు. తిరుపతి లడ్డూ విషయంలో కల్తీ జరిగిందా లేదా అన్న దాని మీద చర్చకు వైసీపీ అధినేత జగన్ అసెంబ్లీకి రావాలని కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీకి వస్తే అన్ని విషయాలు అక్కడే తాము స్పష్టంగా చెబుతామని వారు అంటున్నారు. జగన్ ఆయన పార్టీ ఎమ్మెల్యేలు ఈ సవాల్ ని స్వీకరించి రావాలని కోరుతున్నారు.

**అది జరిగే పనేనా :** అసెంబ్లీకి వైసీపీ రావడం లేదు, ఇది జరిగి ఇరవై నెలలు దాదాపుగా అవుతోంది. అయితే కూటమి ప్రభుత్వం పెద్దలు మాత్రం అసెంబ్లీకి రావాలని కోరుతున్నారు. ఇపుడు చూస్తే శ్రీవారి లడ్డూ ఇష్యూ హాట్ హాట్ గా ఉంది. దీని మీద పూర్తి సమాచారంతో ప్రభుత్వం సిద్ధంగా ఉందని వైసీపీ నేతలు అక్కడ మాట్లాడేందుకు సిద్ధం కావాలని కూటమి నేతలు కోరుతున్నారు. మరి జగన్ అసెంబ్లీకి వస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది. ఏది ఏమైనా ఈ ఇష్యూని కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు పెట్టి అసలు జరిగిన వాస్తవాలు దర్యాప్తు సంస్థలు ఇచ్చిన నివేదికలు అన్నీ జనాలకు అత్యున్నత చట్ట సభ వేదికగా తెలియచేస్తుందని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## కోఠిలోని బ్యాంక్ స్ట్రీట్‌లో కాల్పుల కలకలం




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. ఎస్బీఐ ప్రధాన కార్యాలయం వద్ద శనివారం ఉదయం ఈ ఘటన జరిగింది. తుపాకీతో కాల్పులు జరిపిన దుండగులు రూ.6 లక్షలు ఎత్తుకెళ్లారు. ఉదయం 7 గంటలకు ఏటీఎంలో డబ్బులు డిపాజిట్ చేసేందుకు రిషద్ అనే వ్యక్తి వచ్చాడు. అతడిని దుండగులు వెంబడించి.. కాల్పులు జరిపారు. రూ. 6 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఘటనలో రిషద్ కాలికి తూటా గాయమైంది. అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి.. ఘటనాస్థలిలో సీసీటీవీ ఫుటేజీని సుల్తాన్ బజార్ పోలీసులు పరిశీలిస్తున్నారు. బైకుపై వచ్చిన ఇద్దరు దుండుగులు కాల్పులు జరిపి డబ్బు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడు రిషద్‌ను నాంపల్లిలోని వస్త్ర వ్యాపారిగా గుర్తించారు. ఘటనాస్థలిని డీసీపీ శిల్పవల్లి పరిశీలించారు. క్లూస్ టీమ్స్ ఇప్పటికే ప్రాథమిక వివరాలు సేకరించినట్లు తెలిపారు. "ఉదయం 6:30 నుంచి 7 గంటల మధ్య ఘటన జరిగినట్లు మాకు సమాచారం అందింది. కాల్పులు జరిగిన వెంటనే అలర్ట్ అయ్యాం. నిందితుల కోసం ఐదు బృందాలు గాలిస్తున్నాయి. రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఇలా జరగడం దురదృష్టకరం. నిందితులు తప్పించుకోలేరు" అని అన్నారు.

## మహిళపై పెట్రోల్ పోసి దారుణ హత్య..

### చికిత్స పొందుతూ చిన్నారి మృతి

**నాంపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** నల్గొండ జిల్లాలో ఘోరం జరిగింది. నాంపల్లి మండలం కేతపల్లిలో మహిళ దారుణ హత్యకు గురైంది. గ్రామానికి చెందిన కుందేళ్ల నగేశ్ భార్య మమత (25)తో.. అదే గ్రామానికి చెందిన వంపు సుజాత గొడవపడింది. వాగ్వాదం పెరిగి మమతపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. ఆ సమయంలో బాధితురాలు తన ఐదు నెలల కుమారుడిని ఎత్తుకొని ఉంది. ఈ ఘటనలో మమత అక్కడికక్కడే మృతి చెందగా.. చిన్నారికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే బాబును నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం నీలోఫర్ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ చిన్నారి కూడా ప్రాణాలు కోల్పోయాడు. మమత భర్తతో సుజాతకు వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. నగేశ్‌ను అదుపులోకి తీసుకున్నామని.. నిందితురాలు సుజాత పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## జులై నుంచి నకిలీ మద్యం తయారీ

### జనవరి నుంచే సన్నాహాలు చేసినట్లు వాంగ్మూలం

### వైద్య పరీక్షల నిమిత్తం నిందితులను మదనపల్లె ఆసుపత్రికి తీసుకెళ్లిన ఎక్సైజ్ పోలీసులు



**ములకలచెరువు, విశ్వం వాయిస్ న్యూస్ :** ములకలచెరువులో నకిలీ మద్యం తయారీకి 2025 జనవరి నుంచే సన్నాహాలు చేసినట్లు నిందితులు వాంగ్మూలం ఇచ్చారు. ఇందులో కీలక పాత్రధారి కేసులో ఏ1గా ఉన్న జనార్దన్‌రావేనని స్పష్టం చేశారు. నకిలీ మద్యం తయారీకి పరికరాలు, ముడిసరకులు, నకిలీ లేబుళ్ల సరఫరా ఆలస్యం కావడంతో జులై నుంచి తయారీ ప్రారంభించినట్లు ఒప్పుకొన్నారు. నకిలీ మద్యం కేసులో నిందితులైన జయచంద్రారెడ్డి పీఏ రాజేష్, ఎకౌంటెంట్ అన్బురసును కస్టడీలో భాగంగా శుక్రవారం మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయంలో రెండో రోజు అధికారులు విచారించారు. జనార్దన్‌రావుకు ములకలచెరువులో రాజకీయ నేతలతో పరిచయాలు ఉండటంతో ఇబ్రహీంపట్నం తరహాలో నకిలీ మద్యం తయారీ చేపట్టినట్లు తెలిపారు. మొదట ములకలచెరువు, పీటీఎం మండలాల్లోని రెండు మద్యం దుకాణాలను తన పరిధిలోకి ఆయన తీసుకున్నారని వివరించారు. ములకలచెరువు సమీపంలో నకిలీ మద్యం తయారీ ప్రారంభానికి ఓ గోదామును అద్దెకు తీసుకుని బయట ప్రాంతాల వ్యక్తులతో తయారీ ప్రారంభించారని చెప్పారు. తయారు చేసిన నకిలీ మద్యాన్ని దుకాణాలకు తరలించకుండా గ్రామాల్లోని బెల్టుషాపులకు తరలించేవారని తెలిపారు. తయారీ కేంద్రంపై జరిగిన దాడుల తర్వాతే తమకు కుట్ర విషయం సమగ్రంగా తెలిసిందని చెప్పారు. తమకు వ్యవహారాలు తెలియకుండా జనార్దన్‌రావు అనుచరుడు రాజు అన్ని లావాదేవీలు నడిపారని విచారణాధికారులకు తెలిపారు. ఈ కేసులో ఇప్పట్ల వరకు 29 మందిని కస్టడీకి తీసుకుని విచారించారు. ఇంకా జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డిలు అరెస్ట్ కావాల్సి ఉంది. కస్టడీ అనంతరం నిందితులను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు రెండు రోజుల కస్టడీ ముగియడంతో వారిని మదనపల్లె జైలుకు తిరిగి తరలించారు.

## హత్య చేసి.. ఇంట్లోనే పూడ్చిపెట్టి

### తల్లిదండ్రులతో పాటు చెల్లెలిని చంపిన వ్యక్తి

### కర్ణాటకలోని విజయనగర జిల్లాలో దారుణం



భీమరాజ్, జయలక్ష్మీ దంపతులు

**హొసపేటె, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటకలో దారుణం చోటుచేసుకుంది. తల్లిదండ్రులతో పాటు సొంత చెల్లెలిని హత్య చేసి ఇంట్లోనే పూడ్చిపెట్టాడో అన్న. విజయనగర జిల్లా కొట్టూరులో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్రదుర్గ జిల్లా హొసదుర్గ తాలూకా కిట్టిహళ్లికి చెందిన అక్షయ్‌కుమార్(24).. రెండేళ్ల కిందట కొట్టూరుకు వచ్చి తల్లిదండ్రులు జయలక్ష్మీ (45), భీమరాజ్ (50), సోదరి అమృత (17)తో కలిసి ఉంటున్నాడు. ఇదే గ్రామంలో టైర్ల దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్న అక్షయ్‌కుమార్ ఈ నెల 27న తల్లిదండ్రులు, చెల్లెలిని దారుణంగా హత్య చేసి ఇంట్లోనే పూడ్చిపెట్టాడు. అనంతరం గురువారం బెంగళూరుకు వెళ్లిన నిందితుడు అక్షయ్‌కుమార్ తన తల్లిదండ్రులు, సోదరి అదృశ్యమయ్యారని అక్కడి తిలక్‌నగర్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. అతని ప్రవర్తనపై అనుమానం రావడంతో అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా.. ముగ్గురిని తానే హత్య చేసినట్లు అక్షయ్‌కుమార్ ఒప్పుకొన్నాడు. వెంటనే కొట్టూరు ఠాణాకు సమాచారం ఇచ్చి, నిందితుడిని వారికి అప్పగించారు. అదే రోజు రాత్రి అతడిని కొట్టూరుకు తీసుకొచ్చారు. విజయనగర ఎస్పీ జాహ్నవి, డీఎస్పీ మల్లేశ్ దొడ్డమని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదని, నిందితుడిని అరెస్టు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్పీ జాహ్నవి తెలిపారు.

## కంటైనర్‌ను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్..

### చౌటుప్పల్ వద్ద 4 కి.మీ ట్రాఫిక్ జామ్



**చౌటుప్పల్, విశ్వం వాయిస్ న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కైతాపురం వద్ద శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కంటైనర్‌ను వెనక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌ను అరగంటకుపైగా శ్రమించి పోలీసులు బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో విజయవాడ–హైదరాబాద్ హైవేపై 4 కి.మీ మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్యాంకర్‌ను పక్కకు తరలించి ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరిస్తున్నారు.

## అన్నం ముద్ద అడ్డుపడి చిన్నారి మృతి



**జంగారెడ్డిగూడెం, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నం తినిపిస్తుండగా ముద్ద అడ్డుపడి చిన్నారి మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పట్టణ శివారు మార్కండేయపురం జగనన్న ఎల్–3 లేఅవుట్ కాలనీకి చెందిన ర్యాలీ అభయ ఆంజనేయకుమార్, భానుశిరీష దంపతులకు రెండేళ్ల కుమార్తె జెస్సీదీవెన ఉంది. బాలికకు ఎదుగుదల సరిగా లేకపోవడంతో వైద్యం చేయిస్తున్నారు. శుక్రవారం ఉదయం బాలికను తండ్రి వద్ద వదిలి తల్లి భానుశిరీష, నాయనమ్మ వెంకటరమణలు పనిమీద జంగారెడ్డిగూడెం వెళ్లారు. భోజన సమయంలో చిన్నారికి ముద్దపప్పుతో కలిపిన అన్నాన్ని తండ్రి తినిపించాడు. ఈ క్రమంలో గొంతులో అన్నం ముద్ద ఇరుక్కుపోవడంతో ఉక్కిరిబిక్కిరయ్యింది. స్పృహకోల్పోయిన చిన్నారిని వెంటనే జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలిక మృతిచెందినట్లు ధ్రువీకరించారు.

## ఖర్జూరాలు లేదా బాదం, చలికాలంలో ఆ సమస్యలు దూరం చేసేందుకు ఏది బెస్ట్!

శీతాకాలంలో మన శరీరంలో రోగనిరోధక శక్తి క్షీణిస్తుంది. దీని వల్ల మనం సీజనల్ వ్యాధుల భారీన పడే అవకాశం ఉంటుంది. కాబట్టి చలికాలంలో రోగనిరోధక శక్తిని, శరీరాన్ని లోపలి నుంచి వెచ్చగా ఉంచే ఆహారాలను తీసుకోవడం చాలా ముఖ్యం.అందుకే చలికాలంలో ఖర్జూరం, బాదం వంటి డ్రై ఫ్రూట్స్ తినడానికి ప్రజలు ఇష్టపడతారు. ఇవి రెండూ ఆరోగ్యకరమైనవే అయినప్పటికీ.. వాటి ప్రయోజనాలు మాత్రం భిన్నంగా ఉంటాయి. కాబట్టి చలికాలంలో రెండింటిలో ఏది తీసుకోవడం బెస్ట్ అనేది ఇప్పుడు తెలుసుకుందాం.



**శీతాకాలంలో ఖర్జూరాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు:** ఖర్జూరాలలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటి సహజ చక్కెరలు ఉంటాయి. వీటిని తినడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. అలాగే జలుబుతో పోరాడటానికి సహాయపడుతుంది. ఉదయం 2–3 ఖర్జూరాలు తినడం వల్ల అలసట తగ్గి మీ శరీరం చురుగ్గా మారుతుంది ఖర్జూరాలలో ఇనుము కూడా పుష్కలంగా ఉంటుంది, ఇది చలికాలం బలహీనత, హిమోగ్లోబిన్ లోపాన్ని నివారిస్తుంది. వాటిలో ఉండే ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. శీతాకాలంలో సాధారణంగా కనిపించే మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. అంతేకాదు ఖర్జూరాలలో రోగనిరోధక శక్తిని బలోపేతం చేసే, కాలానుగుణ వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడే యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. అయితే, ఖర్జూరాలను మితంగా తీసుకోవడం వల్ల ఈ ప్రయోజనాలు పొందవచ్చు. వాటిలో చక్కెర అధికంగా ఉంటుంది, కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులు, బరువును నియంత్రించుకోవాలనుకునే వారు వాటిని అధికంగా తినకూడదు.

**బాదం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు :** బాదం అనేది శరీరానికి తక్షణ శక్తిని అందించదు. కానీ నెమ్మదిగా ఎక్కువ సేపు శక్తిని అందించేందుకు సహాయపడుతుంది. వాటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్, ఫైబర్ ఉంటాయి, ఇవి శీతాకాలంలో శరీరాన్ని బలంగా, వెచ్చగా ఉంచడంలో సహాయపడతాయి. బాదంలో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది, ఇది చల్లని వాతావరణంలో పొడి చర్మాన్ని నివారించడంలో సహాయపడుతుంది. రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. బాదం పప్పు మెదడు ఆరోగ్యానికి కూడా చాలా బాగా పనిచేస్తుంది. బాదంను రాత్రి నీటిలో నానబెట్టి ఉదయం తినడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుంది.

**మరి, శీతాకాలంలో తినడానికి ఏది మంచిది?:** ఖర్జూరం, బాదం రెండూ ఆరోగ్యకరమైనవి. మీరు బలహీనంగా, జలుబుగా లేదా అలసిపోయినట్లు అనిపిస్తే, ఖర్జూరం మీకు ఉత్తమమైనది. ఎందుకంటే అవి తక్షణ శక్తిని, వెచ్చదనాన్ని అందిస్తాయి. అయితే, మీరు దీర్ఘకాలిక బలం, రోగనిరోధక శక్తి, మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకుంటే బాదం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. మీ ఆహారంలో రెండింటినీ చేర్చుకోవడం మంచిది. రోగనిరోధక శక్తి, బలం కోసం ఉదయం 10–12 నానబెట్టిన బాదంపప్పులను తినడం ఉత్తమం. శక్తి లేదా వెచ్చదనం కోసం రోజంతా 1–2 ఖర్జూరాలను తినండి. ఖర్జూరాలు, బాదంపప్పుల ఈ కలయిక ఈ శీతాకాలంలో మిమ్మల్ని ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంచడానికి సహాయపడుతుంది.

# హెల్త్ వాయిస్


## ఛాతీనొప్పి ఒక్కటే గుండెపోటుకు సిగ్నల్ కాదు..

### ఈ లక్షణాలు కనిపించినా వెంటనే అలర్ట్ అవ్వండి!

ఈ రోజుల్లో యువతలో గుండెపోటు కేసులు పెరుగుతున్నాయి, ముఖ్యంగా మారుతున్న జీవనశైలి, ఒత్తిడి కారణం. గుండెపోటు కేవలం ఛాతీ నొప్పితోనే కాకుండా ఇతర ముందస్తు సంకేతాలతోనూ వస్తుంది. ఈ లక్షణాలను అలసట లేదా గ్యాస్‌గా పొరబడకూడదు. వీటిని సకాలంలో గుర్తిస్తే ప్రాణాలను కాపాడవచ్చు. ఈ రోజుల్లో గుండెపోటు కేసులు పెరుగుతున్నాయి. యువతరం కూడా గుండెపోటు బారిన పడుతున్నారు. మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న ఒత్తిడి, క్రమరహిత ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం దీనికి ప్రధాన కారణాలు. ప్రజలు తరచుగా తీవ్రమైన ఛాతీ నొప్పి వస్తేనే గుండెపోటు లక్షణం అని అనుకుంటారు. కానీ ఇది ఎల్లప్పుడూ ఒకే లక్షణాలతో ఉండదు. కొన్నిసార్లు శరీరం ముందస్తు హెచ్చరిక సంకేతాలను ఇస్తుంది, వీటిని ముందుగానే గుర్తిస్తే ప్రాణాలు రక్షించుకోవచ్చు. సరైన సమాచారం లేకపోవడం వల్ల ప్రజలు ముందస్తు హెచ్చరిక సంకేతాలను నిర్లక్ష్యం చేస్తారు, వాటిని అలసట, గ్యాస్ లేదా సాధారణ బలహీనతగా తప్పుగా భావిస్తారు. ఈ అజాగ్రత్త దీర్ఘకాలంలో ప్రాణాంతకం కావచ్చు. అందువల్ల గుండెపోటు గురించి తెలుసుకోవడం, వాటి సంకేతాలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. గుండెపోటుకు ముందు ఛాతీ నొప్పితో పాటు ఏ లక్షణాలు కనిపించవచ్చో అన్వేషిద్దాం. కార్డియాలజిస్ట్ డాక్టర్ అజిత్ జైన్ గుండెపోటుకు ముందు శరీరం అనేక సంకేతాలను ఇస్తుందని తెలిపారు. అకస్మాత్తుగా శ్వాస ఆడకపోవడం లేదా ఎక్కువ శ్రమ లేకుండా అలసట సంకేతాలు కావచ్చు. చాలా మందికి ఎడమ చేయి, భుజం, మెడ లేదా దవడలో నొప్పి లేదా భారంగా అనిపిస్తుంది. చలితో చెమట పట్టడం, వికారం లేదా వాంతులు కూడా గుండె సమస్యను సూచిస్తాయి. కొన్ని సందర్భాల్లో తలతిరగడం లేదా ఆందోళన పెరగడం గమనించవచ్చు. మహిళల్లో గుండెపోటు లక్షణాలు కొద్దిగా భిన్నంగా ఉండవచ్చు, అంటే పై వెన్నునొప్పి, పొత్తికడుపులో అసౌకర్యం లేదా తీవ్ర బలహీనత వంటివి. ఈ లక్షణాలను తేలికగా తీసుకోవడం ప్రమాదకరం. ముందస్తుగా గుర్తించడం, తక్షణ వైద్య సహాయం అందించడం వల్ల ప్రాణాలను కాపాడవచ్చు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

ఆదివారం, 01 ఫిబ్రవరి 2026





www.viswamvoice.com

# ఫిబ్రవరి 6న 'శ్రీ చిదంబరం గారు' రిలీజ్

- చిత్రం ప్రజలందరినీ అలరిస్తుంది - గ్రామీణ నేపథ్యంలో సాగే అందమైన ప్రేమ కథ
- ఇప్పటికే టీజర్, ట్రైలర్, పాటలకు మంచి స్పందన - రాజమండ్రి ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకం ఉంది
- హీరో హీరోయిన్స్ వంశీ, సంధ్య, దర్శకుడు వినయ్ ఆకాంక్ష

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా వినయ్ రత్నం దర్శకత్వంలో చింతా గోపాలకృష్ణారెడ్డి, చింతా వినీష రెడ్డి, నిర్మించిన 'శ్రీ చిదంబరం గారు' ఇప్పటికే టీజర్, ట్రైలర్ విడుదలై మంచి స్పందన తెచ్చుకుని, ఫిబ్రవరి 6న విడుదల కానుంది. ఈనేపథ్యంలో సినిమా ప్రమోషన్ లో భాగంగా స్థానిక వి ఎల్ పురంలోని ఎఫ్ కేఫ్ లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో వంశీ మాట్లాడుతూ ఈ సినిమా గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమ కథగా పేర్కొన్నారు. దర్శకుడు వినయ్, నేను రాజమండ్రి వాళ్లమేనని, చిన్నప్పటి నుంచి సినిమా ప్రేమికులమని చెప్పారు. ఇద్దరం కల్సి చాలా షార్ట్ ఫిలిమ్స్ కూడా చేశామన్నారు. తొలిసారిగా 'శ్రీ చిదంబరం గారు'సినిమా చేశామని తెలిపారు. ఈ సినిమాలో హీరోకి మెల్లకన్ను ఉంటుందని, అయితే తాను ప్రేమించిన



అమ్మాయిని దక్కించుకున్నాడా లేదా అనే ఆసక్తికర కోణంలో ఎన్నో మలుపులతో సినిమా ఉంటుందని వంశీ తెలిపారు. రాజమండ్రి ప్రేక్షకులు సినిమాను ఆదర్శిస్తారని భావిస్తున్నామన్నారు. ఇప్పటికే టీజర్, ట్రైలర్, రెండు పాటలు విడుదలై మంచి వ్యూస్ సాధించాయని ఆనందం వ్యక్తంచేసారు. హీరోయిన్ సంధ్య మాట్లాడుతూ ఈ సినిమా బాగా వచ్చిందని, ఇలాంటి అమ్మాయి జీవితంలోకి వస్తే ఎలా ఉంటుందన్న భావన సినిమా చూస్తున్నపుడు కలుగుతుందని తెలిపారు. దర్శకుడు వినయ్ మాట్లాడుతూ ఈసినిమాలో ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి ఒక పాట పాడారని, ఈ పాట విడుదలై వీక్షకుల్లోఆసక్తి కలిగించిందని తెలిపారు. దానిని రెట్టింపు చేసేలా తాజాగా మేకర్స్ ట్రైలర్ ను విడుదల చేయగా, మంచి స్పందన లభించిందని తెలిపారు. ప్రేమకథను కొత్తకోణంలో చూపించామన్నారు. సినిమా అందరికీ నచ్చుతుంద న్నారు. కమెడియన్ గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సినిమాలో శివకుమార్ మట్ట, కల్పలత గార్లపాటి, అరుణ్ కుమార్, తులసి, నాయుడు మోరం, శంకర్ రావు తదితరులు కీలక పాత్రలు పోషించగా, చందు రవి సంగీతం అందించారు. నీ లోపం నీకు బలహీనత కాకూడదన్న సందేశంతో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

# సంప్రదాయం, సంస్కృతి, ఆనందాన్ని పంచిన సంక్రాంతి

## లయన్స్ క్లబ్ సంక్రాంతి సంబరాలు అద్భుతం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** లయన్ జి.దీపా రెడ్డి, డిస్ట్రిక్ట్ ఫస్ట్ లేడీ లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఏ (2025-2026) ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ స్టార్స్ నిర్వహించిన "సంక్రాంతి సంబరాలు''కార్యక్రమం శనివారం ఉదయం అశోక్ నగర్ కల్చరల్ ఉ వెల్ఫేర్ అసోసియేషన్, హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లయన్ జి. దీపా రెడ్డి, డిస్ట్రిక్ట్ ఫస్ట్ లేడీ, సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను, గ్రామీణ సంస్కృతి విలువలను, సంప్రదాయాల సంరక్షణలో మహిళల పాత్రను వివరిస్తూ అర్థవంతమైన ప్రసంగం చేశారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, ఆనందాన్ని పెంపొందిస్తాయని ఆమె తెలిపారు. ప్రత్యేక అతిథులు లయన్ ప్రభావతి జాగ్గాని, లయన్ ఎస్. సవితా కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్, యోగా గురు సరోజని రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి కొలాటం నృత్యం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సంప్రదాయ వస్త్రధారణతో, ఉత్సాహభరిత అడుగులతో ప్రదర్శించిన కొలాటం నృత్యం పండుగ వాతావరణాన్ని మరింత ఉల్లాసంగా మార్చింది. అంతేకాకుండా, సంక్రాంతి పాటల ఆలాపన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో రంగోలి పోటీలు, పిల్లల ఫ్యాషన్ షో, లేడీస్ క్యాట్‌వాక్, హరిదాసు గంగిరెద్దు ప్రదర్శనలు తదితర సంక్రాంతి ప్రత్యేక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం టీ, స్నాక్స్ మరియు భోజన ఏర్పాట్లు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఈవెంట్ చైర్‌పర్సన్ లయన్ సంజీవ్ రెడ్డి పానాల, డీసీ - సంక్రాంతి సంబరాలు లయన్ గరిమెళ్ల సుజాత, ఈవెంట్ కోఆర్డినేటర్ లయన్ శైలజ మోహన్తో పాటు క్లబ్ అధ్యక్షులు లయన్ అశోక్ కుమార్ రెడ్డి, కార్యదర్శి లయన్ రఘువీర్ రెడ్డి, ఖజాంచి లయన్ శ్రీనివాస్ రావులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మొత్తంగా "సంక్రాంతి సంబరాలు"కార్యక్రమం సంప్రదాయం, సంస్కృతి, ఆనందాన్ని సమన్వయ పరిచిన ఒక మరిచిపోలేని వేడుకగా నిలిచింది.

# హాస్టల్ తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

## ఎస్.ఎఫ్.ఐ డిమాండ్ - విద్యార్థుల భారీ ఎత్తున నిరసనకు మద్దతు తేలిపిన మాజీ ఏంపి భరత్ రామ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో 700 మంది విద్యార్థులు శనివారం ఉదయం కళాశాల ఎదుట నిరసన కార్యక్రమం చేశారు. ఆర్.జె.డి వచ్చి తక్షణమే కళాశాల హాస్టల్ ని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్.జె.డి రాకపోవడంతో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆర్.జె.డి ఆఫీస్ గేట్ బయటకు వచ్చి ఆందోళన చేశారు. ఈ ఆందోళనకు ఆర్.జె.డి దిగి వచ్చి సమాధానం చెప్తున్నారు. విద్యార్థులు, ఎస్.ఎఫ్.ఐ నాయకులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వెనక్కి తిరిగి వెళ్లిపోయారు. దీంతో విద్యార్థులు అధికారులు మా సమస్య పరిస్కారం అయ్యేంతవరకూ కదలమని చెప్పారు ఆందోళన చేస్తున్న పట్టించుకోక పోయే సరికి కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ వద్దకు వచ్చి ఆందోళన కొనసాగించారు. ఈ మధ్యలో విద్యార్థులకు పోలీస్ లకు మధ్య వాగ్వాదం జరిగింది. ఎస్.ఎఫ్.ఐ నాయకులు ఇద్దరు గాయపడ్డారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ మార్గాని భరత్ మద్దతు తెలియజేస్తూ విద్యార్థుల సమస్య పరిస్కారం అయ్యే వరకూ విద్యార్థుల పక్షాన ఉంటామని. నా తరుపున కోర్టులో కేసు వేస్తామని విద్యార్థుల పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ మద్దతు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర అధ్యక్షులు పి. రామ్మోహన్ మాట్లాడుతూ శ్రీ కందుకూరి విద్యాసంస్థలు జీవో నెం.42 ప్రకారం 5 విద్యాసంస్థల్లో నాలుగు విద్యాసంస్థలు ప్రభుత్వ పరం అయ్యాయి. ప్రభుత్వం తీసుకుంటున్నట్టు ప్రతీ విద్యాసంస్థకి జీవో లు వచ్చాయి. అందులో భాగమైన శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల జీవో నెం. 28 ప్రకారం మొత్తం కళాశాల స్థిర, చర ఆస్తులతో 2022 నుంచి ప్రభుత్వ కళాశాలగా నడుస్తుంది. 11/12/2025 వ తేదీన హితకారిని సమాజం చైర్మన్ పాలకమండలి, ఎండోమెంట్ ఈఓ కలిసి కళాశాల ప్రిన్సిపాల్ లేని సమయంలో స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ ని దౌర్జన్యంగా లాగేసుకుంది. ఈ సమయంలో ఆర్.జె.డి ఉన్నా దానిని ఆపకుండా చూసారు. దానిని అడ్డుకున్న విద్యార్థులు, ఎస్.ఎఫ్.ఐ నాయకులను మీరు రౌడీలా అంటూ బెదిరించారు. అయితే డిసెంబర్ 27న ఎండోమెంట్ కమిషనర్ హాస్టల్ ని కళాశాలకు అప్పజెప్పాలని ఉత్తర్వులు ఇచ్చిన కళాశాలకు అప్పజెప్పక పోవటంతో, జనవరి 26న గ్రౌండ్ మీది కాదు కాబట్టి గణతంత్ర దినోత్సవం మీరు గ్రౌండ్ లో చేయడానికి అనుమతి తీసుకోవాలి అని చెప్పటంతో కళాశాల విద్యార్థులు అందరూ ర్యాలీగా ఆర్.జె.సి ఆఫిస్ వద్దకు వెళ్లి ఆందోళన చేయగా గ్రౌండ్ లో మీరే గణతంత్ర దినోత్సవం చేసుకోండి అలాగే వారంలో హాస్టల్ సంగతి తేలుస్తామని చెప్పారు ఇప్పటికీ హాస్టల్ సంగతి ఏమి తేల్చకపోయే సరికి విద్యార్థులు అందరూ ఆందోళనకు దిగారు. జీవో నెం. 28 ప్రకారం కళాశాల ప్రభుత్వం ఆధీనంలో నడుస్తున్న హాస్టల్ ని హితకారిని సమాజం ఎలా హ్యాండోవర్ చేసుకుంది. దీనికి బాధ్యులపై కేసు నమోదు చేయాలి. స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ ని తిరిగి కళాశాలకు అప్పగించాలి, అలాగే తక్షణమే కళాశాల మొత్తం క్యాంపస్ ప్రభుత్వానిదే దీనిలో ఇతర డిపార్ట్మెంట్, హితకారిని సమాజం ఎందుకు ఇన్వాల్వ్ అయిందో సమాదానం చెప్పాలి. అధికారులకు తెలియజేయకుండా ఇలా చేసినందుకు వాళ్ళపై చర్యలు తీసుకోవాలి. తక్షణమే కందుకూరి విద్యాసంస్థల్లో 4 ప్రభుత్వ పరం అయ్యాయి వెంటనే 5వ విద్యాసంస్థ అయిన వి.టి జూనియర్ కాలేజి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటూ జీవో ఇవ్వాలి. హాస్టల్ తక్షణమే కళాశాలకు అప్పగించాలి అని డిమాండ్ చేశారు. కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ వద్దకు వెళ్లిన తరువాత ఆర్.డి.ఓ ఆర్.కృష్ణ నాయక్ వచ్చి సాయంత్రం 5 గంటలకు మీ సమస్యలను రాసి వినతి పత్రం పట్టుకుని రండి మీతో చర్చించి సమస్య పరిస్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు తాత్కాలికంగా ఆందోళనను విరమించి ఆర్.డి.ఓకి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లారు.

## మండల పరిధిలో సి.సి.రోడ్లు, డ్రైన్ల పనులను


# పరిశీలించిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట మండలం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మండల పరిధిలో ఎంజిఎన్ఆం ఈజియస్ నిధులతో చేపడుతున్న పనులను శనివారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పరిశీలించారు. మండపేట మండలంలో పర్యటించారు. తాపేశ్వరం దేవుడి కాలనీలో సి.సి.రోడ్లు, డ్రైన్ పనులు ద్వారపూడి లో సంగీత వెంకటరెడ్డి కాలనీ, రాజ్యలక్ష్మి బంగారమ్మ కాలనీ లలో సి.సి.రోడ్లు, డ్రైన్ పనులు కేశవరం లో ఎస్.సి. కాలనీలో సి.సి.రోడ్లు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు మీద నీరు నిలవకుండా ఉండేలా అధికారులకు పలు సూచనలు చేసి, పనులను నాణ్యతతో నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితర్లు పాల్గొన్నారు.

# టీ.కే విశ్వేశ్వరరెడ్డిని సత్కరించిన కాంగ్రెస్ నేతలు

- జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి
- నమ్మకంతో పదవి అప్పగించిన వై.యస్ షర్మిళకు కృతజ్ఞతలు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు దేశానికి ప్రధానిగా రాహుల్ గాంధీని, రాష్ట్రానికి వైఎస్ షర్మిళారెడ్డిని ముఖ్యమంత్రి గా చేసేందుకు అహర్నిశలు కృషిచేస్తానని కాంగ్రెస్ రాజమహేంద్రవరం పార్లమెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ టీ.కే విశ్వేశ్వరరెడ్డి వెల్లడించారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన ఎఐసిసి ముఖ్య నాయకులకు, పిసిసి అధ్యక్షురాలు షర్మిళకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక మున్సిపల్ కాలనీలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో టీకే మాట్లాడుతూ రాజమండ్రి పార్లమెంట్ పాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. త్వరలోనే అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తామని, ఘర్ వాపస్ ఆవో నినాదంతో గతంలో పార్టీలో పనిచేసిన వాళ్లందరిని మళ్లీ సొంత గూటికి రప్పిస్తామని తెలిపారు. తనకు అండగా నిలిచిన కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండి రఫీ చేతులమీదుగా ఆయనకు నియమాకపతం అందించగా నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, పిసిసి ఉ పాధ్యక్షుడు మార్టిన్ లూథర్, రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వడయార్, మహిళా విభాగం అధ్యక్షురాలు మోతా శారద, కాకర్ల హరిబాబు, మట్టా శ్రీనివాస్ గౌడ్ తదితర నాయకులు పుష్పగుచ్చాలు, దుశ్శాలువాలతో టీకే విశ్వేశ్వరరెడ్డిని సత్కరించి అభినందనలు తెలిపారు. ఇదే వేదికపై క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సింధియా రాణికి కూడా నియామక పత్రం అందచేసారు. వారు మాట్లాడుతూ గడచిన 18 నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి విశ్వేశ్వర రెడ్డి ఎంతగానో శ్రమించారన్నారు. అందుకే ఆయన నాయకత్వాన్ని బలపరుస్తూ తాము పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిళను జరిగిన విన్నవించగా పార్లమెంట్ కో ఆర్డినేటర్గా పదవి అప్పగించారన్నారు. ఫిబ్రవరి 2వ తేదీ నాటికి ప్రధాని మన్మోహన్ సింగ్, యుపిఎ చైర్పర్సన్ సోనియా గాంధీ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించిన 20 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా షర్మిళారెడ్డి ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్ర చేపడుతున్నారని దానికి తాము పూర్తిస్థాయిలో మద్దతిస్తున్నామన్నారు. రాయలసీమలో 20 రోజులు పర్యటించిన తరువాత ఈ జిల్లా పర్యటనకు వస్తారని, ఆలోగా ఒక కమిటీ ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్ని సమన్వయం చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాకా పుల్లారావు, డాక్టర్ వడయార్ శ్రీనివాస్, కాకర్ల హరిబాబు, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ యాళ్ల వీరభద్రరావు, బర్రే సుబ్రహ్మణ్యం, కిశోర్కుమార్ జైన్, జి. రామకృష్ణ, జి.యేసు, తాడి సూరిబాబు, కొల్లి చిన్న, బత్తిన చంద్రరావు, రాయపూడి శ్రీదేవి, షేక్ జయలలిత, మండూరి ఎస్తేర్, కె. గ్రేస్,కెవి ఆనంద్ కుమార్,జాలా నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మోస్ట్ వాంటెడ్ ఘరానా మోసగాడు అరెస్టు

- పెళ్లి సంబంధాల ఏర చూపి మహిళలను మోసం - తెలుగు మ్యాట్రిమోనీ వేదికల్లో ఒంటరి, వితంతువులే లక్ష్యం
- స్వాధీనం చేసుకున్న బంగారం,రెండు కార్లు,రెండు సెల్ ఫోన్లు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పెళ్లి సంబంధాలను చూసే తెలుగు మ్యాట్రిమోనీ, షాదీ డాట్ కామ్ వేదికల ద్వారా మహిళలను మోసం చేస్తున్న మోస్ట్ వాంటెడ్ ఘరానా మోసగాడు, నిత్య పెళ్లి కొడుకు ఎట్టకేలకు అరెస్ట్ అయ్యాడు. రాష్ట్రేతరంగా పలు ప్రాంతాల్లో పలువురు ఒంటరి, వితంతువు మహిళలను రెండవ పెళ్లి చేసుకుంటానని నమ్మించి , పెళ్లికి ముందు పూజలు పేరుతో బంగారు నగలతో ఉడయించడం ఇతని నైజం. నిందితుడు మరో పెళ్లికి సిద్ధపడుతున్న తరుణంలో విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు త్రీ టౌన్ పోలీసులు అతన్ని శనివారం స్థానిక పుష్కర్ ఘాట్ వద్ద అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ. 75 లక్షల విలువగల బంగారు నగలు, రెండు కార్లు రెండు సెల్ ఫోన్లు. స్వాధీనం చేసుకున్నామని సెంట్రల్ జోన్ ఇన్చార్జి డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో శనివారం మీడియా సమావేశంలో డిఎస్పి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కాలంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పుష్కర ఘాట్, కోటిలింగాల ఘాట్ల వద్ద తెలుగు మ్యాట్రిమోనీ, షాదీ డాట్ కామ్ ల ద్వారా మహిళలను మోసం చేసిన సంఘటనల పై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ నందు 5 ఛీటింగ్ కేసులు నమోదు చేసారన్నారు. బిఎన్ఎస్ సెక్షన్లు 2026 లో 318(4),303(2) 2025 లో ఐ పి సి 420,379 కింద నమోదు చేసామన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు సెంట్రల్ జోన్ ఇన్చార్జి డిఎస్పి . వై.శ్రీకాంత్ పర్యవేక్షణలో పై కేసులను చాలెంజింగ్ గా తీసుకున్న 3 టౌన్ పి.ఎస్ ఇన్స్పెక్టర్ ఏ.వి. అప్పారావు , సబ్ ఇన్స్పెక్టర్స్ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారన్నారు. పై కేసులలో ముద్దాయి అయిన చిత్తూరు జిల్లా, పలమనేరు మండలం, పి. వద్దురు గ్రామానికి చెందిన చల్లా నారాయణ ఏకృష్ణ నారాయణ ఏనారాయణ



కృష్ణ, ను అరెస్టు చేసామన్నారు. అతన్ని విచారించగా ముద్దాయి తెలుగు మ్యాట్రిమోనీ ల ద్వారా భర్తలు చనిపోయి, ఒంటరిగా ఉన్న మహిళల రెండో పెళ్లి సంబంధాల ప్రొఫైల్స్ ను ఎంచుకుని ఆ మహిళలను లక్ష్యంగా చేస్తూ తాను బంగార వ్యాపారం చేస్తుంటానని పరిచయం చేసుకుని వారికి మ్యారేజ్ ప్రపోజల్స్ పంపిస్తూ, మాయమాటలు చెప్పి మీ ప్రొఫైల్స్ తన తల్లిదండ్రులకు కూడా చూపించానని, వారికి మీరు నచ్చిరని చెప్పేవాడన్నారు. మీ జాతకం కూడా చూపించానని, అయితే మీ జాతకంలో దోషం ఉందని సరిచేసుకుంటే తాము మ్యారేజ్ చేసుకోవచ్చునని నమ్మించేవాడన్నారు. ఆ దోషం పోవాలి అంటే గోదావరి స్నానాలు చేసి పూజలు చేయాలని, జాతకం చూసిన పంతులు చెప్పారని నమ్మబలికి, మీరు రాజమహేంద్రవరం గోదావరి స్నానాలకు వచ్చినట్లయితే అక్కడకి తమ తల్లిదండ్రులను కూడా తీసుకువచ్చి పరిచయం చేస్తాననే వాడన్నారు. వచ్చేటప్పుడు బంగార వస్తువులను ధరించి చక్కని చీర కట్టులో వస్తే మా తల్లిదండ్రులకు మీరు నచ్చుతారని మ్యాట్రిమోనిల్లో ఎంచుకున్న హైదరాబాద్, విశాఖపట్నం, కడప, శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాలకు చెందిన మహిళలను చెప్పేవాడన్నారు. ఆ విధంగా వారిని రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్, బస్టాండ్లకు రమ్మని చెప్పి అక్కడ నుండి పుష్కర ఘాట్, కోటిలింగాల ఘాట్ వద్దకు ముద్దాయి తన కార్లలో తీసుకువచ్చేవాడన్నారు. వారు ధరించిన బంగారు వస్తువులను తీసి వారి బ్యాగ్లలో పెట్టుకోమనే వాడన్నారు. వారిని పుష్కర ఘాట్లలో గోదావరి స్నానాలు చేయమని , ఆ తర్వాత వారిని దుస్తులు మార్చుకునే గదిలోకి పంపించి వారు దుస్తులు మార్చుకునే లోపు తానువెళ్లి పూజ సామానులు తీసుకువస్తానని ఆ మహిళలను నమ్మబలికి వారు బ్యాగులలో పెట్టుకున్న బంగారు నగలను తీసుకుని కార్లలో పారిపోవడం ఇతని నైజమన్నారు. ఈ విధంగా ముద్దాయి త్రిటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రెండు పుష్కర ఘాట్లలో ఐదుగురు అమ్మాయిలను మోసం చేసి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలను అపహరించుకుపోయినట్లు డీఎస్పీ తెలిపారు. ఒంటరి మహిళలు పోగొట్టుకున్న బంగారు ఆభరణాలను, నేరములు చేయడానికి ఉపయోగించిన రెండు సెల్ ఫోన్ లను, రెండు కార్లను రూ.75 లక్షల విలువ గల సొత్తు ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

### నిందితుడి గత నేర చరిత్ర

నిందితుడి పై గతంలో చిత్తూరు, పలమనేరు, అలిపిరి ,తిరుపతి, విశాఖపట్నం, నెల్లూరు, కర్ణాటక చిక్ భల్లపూర్ ప్రాంతాలలో 8 కేసులు నమోదు అయ్యాయని డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు.చిత్తూరు జిల్లా గంగవరం పోలీస్ స్టేషన్లో ఒక హత్య కేసు, పోక్సో కేసు, చీటింగ్ కేసులు, పలమనేరు పోలీస్ స్టేషన్లో రౌడీ షీట్ పెండింగ్లో ఉందన్నారు.ఈ కేసులను సమర్థవం తంగా ఛేదించిన స్తానిక 3 టౌన్ ఇన్స్పెక్టర్ వి ఏ రావుని, సబ్ ఇన్స్పెక్టర్లు వి ఏసుబాబు బి సురేష్ లను, క్రైమ్ పార్టీ సిబ్బంది, హెడ్ కానిస్టేబుళ్లు వి. కృష్ణ, ఎన్. వెంకట రామయ్య, యస్. చంద్ర శేఖర్, కానిస్టేబుళ్లు బి. విజయ్ కుమార్, కె. పవన్ కుమార్, యస్. రామకృష్ణలను జిల్లా ఎస్పీ నార్త్ జోన్ డిఎస్పి అభినందించి రివార్డ్స్ ప్రకటించారన్నారు.



కూటమి ప్రభుత్వంలో

# జోరుగా సంక్షేమం, అభివృద్ధి

## పేద కుటుంబాల్లో ఆనందం కోసమే ఒక రోజు ముందుగా పింఛన్లు పంపిణీ : మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో సంక్షేమం పథకాల అమలు, అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయని, కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వంగా ప్రజల మన్ననలు అందుకొంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం రామచంద్రపురంలోని కవల సావరం, ముచ్చిమిల్లి 18 వ వార్డులో పలువురు లబ్ధిదారులకు మంత్రి సుభాష్ ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగ లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఏపీ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగామంత్రి సుభాష్ మాట్లాడుతూ



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో ప్రతి కుటుంబం ఆనందంగా ఉందన్నారు. గడిచిన 18 నెలల్లో ఒక్కరోజు కూడా ఆలస్యం కాకుండా పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, అవసరమైతే ఒక రోజు ముందుగానే ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, విద్యార్థులకు తల్లికి వందనం ద్వారా నిధులు, రైతులకు అన్నదాతా సుఖీభవ నిధులు, మహిళలకు దీపం 2.0 ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు, మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ నియామకాలు, ఇంకా అనేక సంక్షేమ, అభివృద్ధి పనులను ఏడాదిన్నర కాలంలోనే పూర్తి చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవెల్లి శివ, ఏఎంసీ డైరెక్టర్ నారపురెడ్డి బలరాం, కవల నానాజీ, కంచుమర్తి బాబురావు, మాజీ కౌన్సిలర్ దిగుమర్తి వీరబాబు, జనసేన సంపత్, వాసంశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, పింఛనుదారులు పాల్గొన్నారు.

# ఏపీఎస్ఆర్టీసీ భద్రతా మాసోత్సవాల ముగింపు వేడుకలు

### వేడుకల్లో డీటీఓ డి.శ్రీనివాస్ కీలక ప్రసంగం

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రహదారి భద్రతా మాసోత్సవాలకు అమలాపురంలో ఘన ముగింపు జరిగింది. జనవరి 1 నుంచి 31 వరకు నెలరోజుల పాటు కొనసాగిన ఈ కార్యక్రమాల ముగింపు సమావేశం అమలాపురం ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం డిపో ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా రవాణా అధికారి (డీటీఓ) డి.శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి భద్రతలో డ్రైవర్ పాత్ర అత్యంత కీలకమని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీసే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నియమాలపై



సంపూర్ణ అవగాహన పెంచుకుని, అప్రమత్తతతో వాహనాలు నడపాలని సూచించారు. ఏపీఎస్ఆర్టీసీ చేపట్టిన భద్రతా మాసోత్సవాలు ప్రజల్లోనే కాకుండా డ్రైవర్లలో కూడా బాధ్యతాభావాన్ని పెంపొందించా యన్నారు. ప్రమాద రహిత డ్రైవింగ్ అలవాటుగా మారినప్పుడే రహదారి ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని డీటీఓ డి.శ్రీనివాస్ పేర్కొన్నారు. అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలను అతిక్రమించడం వల్లే ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. డ్రైవర్లు నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, ఇతర రోడ్డు ప్రయాణికుల భద్రతకూ బాధ్యత వహించాలని కోరారు. అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ డి.ఎల్.ఎన్.శర్మ మాట్లాడుతూ, డ్రైవర్లు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మద్యం వంటి దురలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన డ్రైవర్ మాత్రమే సురక్షితమైన డ్రైవింగ్ చేయగలడని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో ముగ్గురు ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్లకు, అలాగే డిపో స్థాయిలో 12 మంది ప్రమాద రహిత డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రమాదాలు లేకుండా నిరంతరం సేవలందించిన డ్రైవర్లను ప్రోత్సహించడం ద్వారా భద్రతా సంస్కృతి మరింత బలోపేతం అవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, డిపిటిఓ కార్యాలయ సిబ్బంది, కోనసీమ జిల్లా ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

వెంకటాయపాలెంలో టీడీపీ గూటికి చేరిన

# 50 మంది వైసిపి కార్యకర్తలు

### సీఎం చంద్రబాబు పరిపాలనా దక్షతకు నిదర్శనమన్న మంత్రి వాసంశెట్టి సుభాష్
### కూటమి ప్రభుత్వ పాలన, మంత్రి వాసంశెట్టి సుభాష్ పాలన భేష్ అన్న కార్యకర్తలు



**రామచంద్రపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజవర్గం రామ చంద్రపురం రూరల్ మండలం వెంకటాయపాలెం గ్రామంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో 50 మంది వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ పార్టీ కండువా కప్పి కొత్తగా చేరిన కార్యకర్తలను సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంపై విశ్వాసం, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పరిపాలన దక్షత, ప్రభుత్వ కార్యక్రమాలు, సామాజిక సేవ పట్ల ఆకర్షితులమై తాము తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని చేరికల సందర్భంగా కార్యకర్తలు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించే మంత్రి సుభాష్, టీడీపీ పార్టీ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారని వారు అన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే పార్టీ తెలుగుదేశం అని, అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అందిస్తూ మంచి పాలనతో రాష్ట్రాన్ని ముందుకు నడిపే శక్తి టీడీపీకే ఉంది అని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, బాధ్యతలు కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారని, అదే కారణంగా టీడీపీలోకి చేరికలు రోజు రోజుకు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో రామచంద్రపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మరింత బలపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో గుంటల శ్రీనివాస్, పెయ్యల బాబేలు, కనికళ్ళ సూర్యనారాయణ, తనికెళ్ల మహేష్, నంది కోళ్ల సుబ్రమణ్యం, పచ్చిమాల సోమేశ్, నంది కోళ్ల ఏసేపు, తనికెళ్ల శ్రీనివాస్ తాతపూడి ప్రసాద్, యార్లగడ్డ తాతారావు, సుందరపల్లి సాయిబాబు, పెయ్యల పద్మలక్ష్మి, కోటి అనంత కుమారి, కోటి నాగమణి, గుబ్బల సునీత, పి జీవరత్నం తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, రామచంద్రపురం రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ నాయకులు పెంకే సాంబశివరావు, అమలాపురం పార్లమెంట్ నాయకుడు సిర్రా సురేష్, కాటే సుబ్రమణ్యం, ఎంపీటీసీ కనిపి వెంకటేశ్వరి, తోట రాము, కనికల్లా సత్తిబాబు, గుబ్బల శ్రీను, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలపై

# కొత్తపేట ఎమ్మెల్యే బండారు ఆగ్రహం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలపై కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడిని ఉద్దేశించి అంబటి మాట్లాడిన మాటలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి గట్టి బుద్ధి చెప్పినా అంబటి ధోరణి మారలేదని విమర్శించారు. చంద్రబాబు నాయుడు అభివృద్ధి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందుతుంటే తట్టుకోలేక వైసీపీ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని అన్నారు. ప్రభుత్వాధినేతపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. అంబటి తన నోరు అదుపులో పెట్టుకొని బాధ్యతాయుతంగా మాట్లాడాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్పష్టం చేశారు.

నాట్ర రవణమ్మ మృతికి సంతాపం తెలిపిన

# ఎల్ఐసి యూనియన్ నాయకులు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ సుబ్రమణ్యం తల్లి (మాతృమూర్తి) ఇటీవల మృతి చెందడంతో, ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. తల్లి మరణ వార్త తెలుసుకున్న ఎల్ఐసి ఏఓఐ యూనియన్ నాయకులు శనివారం సుబ్రమణ్యం నివాస గృహాన్ని సందర్శించి, మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఏఓఐ యూనియన్ డివిజన్ ప్రెసిడెంట్ సానబోయిన వీరభద్రరావు, అమలాపురం బ్రాంచ్ ప్రెసిడెంట్ ఏ. నాగేంద్ర కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కేతా వీరస్వామి, డివిజన్ ఈసీ మెంబర్ కదలి శ్రీనివాసరావు, మట్ట శ్రీనివాస్ గౌడ్, సేలం లంకేశ్వరుడు, కోరుమిల్లి మధు తదితరులు హాజరయ్యారు. అలాగే అల్లవరం మండల పరిషత్ అధ్యక్షుడు ఇళ్ల శేషారావు కూడా పాల్గొని, సుబ్రమణ్యం మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం సుబ్రమణ్యం ని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని, ఎల్ఐసి కుటుంబం ఎల్లప్పుడూ తమకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాతృవియోగం తీరని లోటు అని పేర్కొన్న వారు, దైవం వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎల్ఐసి ఉద్యోగులు, యూనియన్ సభ్యులు పాల్గొని సంతాపం తెలిపారు.

గ్రూప్ వన్‌లో ఉద్యోగం సాధించిన

# సాఫ్ట్ వేర్ ఇంజనీర్

### – పదేళ్ల కష్టానికి ఫలితం లభించింది
### – కర్రి రాజా రమేష్ బాబు ఆనందం వ్యక్తం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తూనే గ్రూప్ వన్ ఉద్యోగం సాధించారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన రాజా రమేష్ బాబు కర్రి. ఈయన తండ్రి సత్యనారాయణ ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో పనిచేసారు. తల్లి పద్మావతి జిల్లా పరిషత్ హైస్కూల్లో హిందీ పండిట్ గా చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్స్ లో బి.టెక్ పూర్తి చేసిన రమేష్ బాబు మొదట ఇన్ఫోసిస్ లో చేరారు. ఈయన భార్య స్వప్న కూడా సాఫ్ట్ వేర్ ఇంజనీరుగా చేస్తున్నారు. అయితే సివిల్స్ కి వెళ్ళాలన్న కోరిక రమేష్ బాబుకి చిన్నప్పటి నుంచి బలంగా ఉండేది. దాంతో ఉద్యోగం చేస్తూనే, ఢిల్లీలో కోచింగ్ కి వెళ్లారు. ఆ ప్రయత్నంలో ప్రభుత్వ బ్యాంకు లో అసిస్టెంట్ మేనేజర్ గా ఉద్యోగం వచ్చింది. సివిల్స్ కి ప్రిపరేషన్ కి అనువుగా లేకపోవడంతో బ్యాంకు ఉద్యోగం వదిలేసి, సాఫ్ట్ వేర్ లో మళ్ళీ ఉద్యోగంలో చేరి, సివిల్స్ కి ప్రిపేర్ అయ్యారు. గ్రూప్ వన్ రాసి, ఎంపిక అయ్యారు. దాంతో స్టేట్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ గా ఉద్యోగంలో చేరారు. నా పదేళ్ల కష్టానికి మంచి ఫలితం దక్కిందని రమేష్ బాబు ఆనందం వ్యక్తం చేసారు. బంధు మిత్రులు అతనికి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా

# 'విశ్వం వాయిస్' దినపత్రిక ఘన ఆవిష్కరణ



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యలకు గట్టి స్వరం వినిపించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న 'విశ్వం వాయిస్' దినపత్రికను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శుభారంభంగా ఆవిష్కరించారు. ప్రజలకు నిజమైన వార్తలను నిర్భయంగా అందించాలనే సంకల్పంతో ప్రారంభమైన ఈ దినపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం అమలాపురంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చేతుల మీదుగా విశ్వం వాయిస్ జిల్లా ప్రతినిధి వెంకటేష్ దినపత్రికను అధికారికంగా ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో అమలాపురం రూరల్ రిపోర్టర్ శ్రీనివాస్ పాల్గొని, ఈ ప్రత్యేక ఘట్టానికి సాక్షులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, ప్రజల జీవితాలకు సంబంధించిన సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రజల గుండె చప్పుడు ప్రభుత్వానికి చేరవేయడంలో బాధ్యతాయుతమైన జర్నలిజం అవసరమని ఆయన అన్నారు. 'విశ్వం వాయిస్' దినపత్రిక ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందిస్తూ, సమాజానికి దిశానిర్దేశం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విశ్వం వాయిస్ దినపత్రిక చైర్మన్ ఖండవిల్లి సునీల్ కుమార్ మాట్లాడుతూ, ఈ దినపత్రిక ఆవిష్కరణకు ముఖ్య భూమిక పోషించిన జిల్లా ప్రతినిధి వెంకటేష్‌ను, అలాగే అమలాపురం రూరల్ రిపోర్టర్ శ్రీనివాస్‌ను హృదయపూర్వకంగా అభినందించారు. వారి అంకితభావం, కృషి వల్లే విశ్వం వాయిస్ ప్రజల మధ్యకు చేరుతోందని ఆయన ప్రశంసించారు. ప్రజల తరఫున నిలబడి, నిష్పక్షపాతంగా వార్తలను అందించడమే విశ్వం వాయిస్ దినపత్రిక యొక్క ప్రధాన ధ్యేయమని చైర్మన్ సునీల్ కుమార్ తెలిపారు. సామాజిక బాధ్యతతో జర్నలిజాన్ని కొనసాగిస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, మీడియా ప్రతినిధులు, అభిమానులు పాల్గొని 'విశ్వం వాయిస్' దినపత్రికకు శుభాకాంక్షలు తెలిపారు. దినపత్రిక ఆవిష్కరణతో అమలాపురం ప్రాంతంలో మీడియా రంగానికి కొత్త ఉత్సాహం నెలకొన్నదని వారు అభిప్రాయపడ్డారు

# మందపల్లి తైలాభిషేకములు ఇతర పూజల ఆదాయ వివరములు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శనిత్రయోదశి పర్వదినం సందర్భంగా శ్రీ స్వామి వారికి తైలాభిషేకములు మరియు ఇతర పూజల ద్వారా ఆదాయ వివరములు ముఖమండపం 1164 × 700/- = 8,14,800/-ఆలయం వెనుక అభిషేక షెడ్డులలో 2596× 250/- = 6,49,000/- స్వయం హోమం2 × 800/- = 1600/-తైలాభిషేక దర్శనం, 633× 80/- = 50,640/- ఏకాదశ రుద్ర తైలాభిషేకం (పరోక్ష)1 × 600/- =600/- మహాన్యాస పూర్వకతైలభిషేకం (పరోక్ష) 3 × 400/- = 1200/- పిఓ యాస్ ద్వారా(ఫోన్ పే,గూగుల్ పే)= 1,37,170/-మొత్తం రూ.16,55,010/- అన్నప్రసాదం విరాళాలు రూ.54,502 /- పరోక్ష పూజలు ద్వారా రూ. 8,28,700/-మొత్తం రూ.25,38,212/-లు ఆదాయం వచ్చినదని స్వామి వారి సేవలో దారపురెడ్డి సురేష్ బాబు సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

# సెలవు దినాలలో ఒకరోజు ముందుగానే పెన్షన్ పంపిణీ



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పెన్షన్ పంపిణీలో పారదర్శకత చూపిస్తున్న కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెన్షన్ పంపిణీలో పారదర్శకత కనబరుస్తోంది. ఒకరోజు కూడా పెన్షన్ ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో పెన్షన్. దారులకు ఇబ్బంది కలగకుండా సెలవు దినాలలో ఒకరోజు ముందుగానే పెన్షన్ పంపిణీ చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేనుసారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపుమేరకు కొత్తపేట సచివాలయం రెండు పరిధిలో టిడిపి సీనియర్ నాయకులు గుబ్బల మూర్తి సచివాలయ సిబ్బందితో కలిసి పెన్షన్ దారుల ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. ప్రభుత్వ అధికారులతో కలిసి పెన్షన్ పంపిణీ చేసేటప్పుడు పెన్షన్ దారుల కళ్ళల్లో ఆనందాన్ని చవిచూస్తున్నామని పెన్షన్ పంపిణీలో పాల్గొనటం చాలా సంతోష దాయకమని గుబ్బల మూర్తి ఈ సందర్భంగా తెలియజేశారు.

# వృద్ధుల చెంతకే పింఛన్ నగదు

### పేదల ముఖాల్లో చిరునవ్వే ప్రభుత్వ ధ్యేయం : రెడ్డి అనంతకుమారి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, నిరుపేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే తమ ధ్యేయమని ఏపీ బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి పేర్కొన్నారు. శనివారం కొత్తపేట మండలం కొత్తపాలెం గ్రామంలో ఆర్ ఎస్ కాలనీలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా' సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పింఛన్ల పంపిణీని ఒకరోజు ముందుగానే చేపట్టిందని ఆమె తెలిపారు. ప్రజల సౌకర్యమే ప్రభుత్వానికి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అనంతకుమారి స్వయంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి, వారిని ఆప్యాయంగా పలకరిస్తూ పింఛన్ నగదును అందజేశారు. వృద్ధులు, వికలాంగులు, మాట్లాడి వారి ఆరోగ్యం, కుటుంబ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. "సంక్షేమం ప్రజల ముంగిటకే చేరాలి అనే లక్ష్యంతోనే కూటమి ప్రభుత్వం పని చేస్తోంది" అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని, నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సభ్యుడు కదలి భీమా,రాయుడు బాబీ,కొప్పిశెట్టి శ్రీరామ్, జోగి గనిరాజు, రాయుడు త్రిమూర్తులు తదితరులు ఉన్నారు.

# దేశానికే ఆదర్శంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

### పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలుచేయని సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పింఛన్ల పంపిణీ అందులో ఒక భాగమన్నారు. శనివారం రావులపాలెం మండలం కొమరాజులంక లో జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారికి పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకంతో దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. ఆదివారం వస్తుంది అంటే ఒకరోజు ముందే పింఛన్లు అందించడం జరుగుతుందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిలోనూ దూసుకుపోతున్నామన్నారు. కొత్తపేట నియోజకవర్గంలోనే 42069 మందికి సామాజిక, ఆర్థిక భద్రత కోసం పింఛన్లు అందిస్తున్నామని ఆయన అన్నారు. మొత్తం నియోజకవర్గానికి సంబంధించి రూ.18 కోట్ల 30 లక్షల 30 వేల రూపాయలుపంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# దేశ పౌరులందరికీ సమన్యాయం అందాలి

## పెద్దాపురం జిల్లా న్యాయమూర్తి చంద్రమౌళీశ్వరి - పెదమల్లాపురంలో న్యాయ విజ్ఞాన అవగాహనా సదస్సు
## ప్రత్యేక మెగా వైద్య శిబిరం ఏర్పాటు - చేనేత వస్త్ర అమ్మకాల ప్రదర్శన - ఐసిడిఎస్ పోషకాహార పదార్థాల ప్రదర్శన

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ పౌరులు అందరికీ సకాలంలో సమన్యాయం అందుబాటులో ఉండాలని, చట్టాలపై పౌరులకు అవగాహన ఉండాలని పెద్దాపురం జిల్లా న్యాయమూర్తి చంద్రమౌళీశ్వరి పేర్కొన్నారు. తెలిసో తెలియకో నేరాలు చేస్తుంటాం. దేశంలో జనాభా, నేరాలు ఎక్కువగాను, న్యాయస్థానాలు తక్కువగానూ ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో సత్వర న్యాయం చేకూరేందుకు, నేర ప్రవృత్తి తగ్గేందుకు ప్రజల్లో చట్టాలపై సదవగాహన ఉండాలని ఆమె పేర్కొన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం పెదమల్లాపురం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో శంఖవరం మండల ఉప ప్రణాళికా ప్రాంతంలోని వేళంగి, పెదమల్లాపురం, గౌరంపేట గిరిజన పంచాయతీల్లోని 19 గిరిజన గ్రామాల ప్రజలకు ప్రత్యేక గిరిజన న్యాయ విజ్ఞాన అవగాహనా సదస్సును జిల్లాలో ఎక్కడా లేని రీతిలో శనివారం విజయవంతంగా నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయ సేవాధికార సంస్థల సంయుక్త సంరక్షణలో ప్రత్తిపాడు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గిరిజన హక్కుల రక్షణ, అమలు పథకం-2015, జాగృతి పథకం-2025 ప్రకారం గిరిజనుల్లో చట్టపరమైన అక్షరాస్యతను పెంపొందించడం, సాధికారతను పెంచడం లక్ష్యంగా ప్రత్యేకంగా రూపొందించిన కార్యక్రమ విధి విధానాల అమలులో భాగంగా నిర్వహించిన ఈ అవగాహనా సదస్సులో 14 మంది వక్తల్లో ప్రధాన వక్తగా చంద్రమౌళీశ్వరి సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. సమాజంలోని పేద, బలహీన వర్గాలకు ఉచిత, సమర్థవంతమైన న్యాయ సహాయాన్ని అందించడానికి 1987 లో ఏర్పడిన




చట్టపరమైన సేవల అధికారుల చట్టం - జాతీయ న్యాయ సేవాధికార సంస్థ 9 నవంబర్ 1995న అమలులోకి వచ్చింది. ఇది జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో న్యాయ సేవా సంస్థలను ఏర్పాటు చేసి, లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయాన్ని ప్రోత్సహిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ చట్టం ఆర్థిక, ఇతర వైకల్యాల కారణంగా న్యాయం నిరాకరించ బడకుండా, అర్హులైన వారికి ఉచిత న్యాయ సేవలు అందిందని, వివాదాలను సయోధ్య, రాజీ ద్వారా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్‌లను నిర్వహిస్తుందనీ, చట్టపరమైన కార్యక్రమాలను పర్యవేక్షిస్తుందని, జిల్ల, మండల స్థాయిలో ఉచిత న్యాయ సేవలను అందిస్తుందని ఆమె వివరించారు. ఎస్సీ, ఎస్టీలు, బాధితులు, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, తక్కువ ఆదాయం ఉన్నవారికీ ఉచిత న్యాయం అందించడం న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని, అర్హులైన వారు ఆయా స్థాయిల్లోని కమిటీ సభ్యుల ద్వారా ఉచిత న్యాయ సేవలను ఉపయోగించు కోవాలని చంద్రమౌళీశ్వరి పిలుపును ఇచ్చారు. మధ్యాహ్నం 1.20 గంటల నుంచి అర్ధగంట పాటు సుదీర్ఘంగా సాగిన తన ప్రసంగంలో పలు చట్ట, న్యాయపరమైన అంశాలను గురించి ఆమె స్పృశించారు. ఆర్థిక, సామాజిక లేదా ఇతర ఇబ్బందుల వల్ల న్యాయాన్ని పొందలేని నిరుపేదలకు, ఉచిత న్యాయ సహాయం అందించడం ప్రభుత్వాల బాధ్యతని సభాధ్యక్షులు, ప్రత్తిపాడు న్యాయస్థాన న్యాయమూర్తి లంక గోపినాథ్ పేర్కొన్నారు. ఉచిత న్యాయ సహాయం పొందడం మన జన్మ హక్కు. ఇందుకోసం భారత రాజ్యాంగంలోని 39 ఏ అధికరణం ప్రకారం మనకు ప్రత్యేక హుక్కును పొందుపర్చారని పేర్కొన్నారు. చదువుకోక పోడం, చట్టాలపై అవగాహన లేకపోవడం, హక్కుల గురించి తెలియకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నారో వారందరి సమస్యలు, తగాదాలు పరిష్కారానికి వారి తరఫున వాదించడానికి సమాంతర న్యాయవాదులను న్యాయస్థానమే ఏర్పాటు చేస్తుంది. వారు మీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఉచితంగా మీ తరఫున వాదిస్తారు. మన సమస్యలను మన నుంచి దూరం చేసేది చదువు ఒక్కటే. దీన్ని మించి ఏదీ పరిష్కరించలేదు. చదువుకుంటే హక్కులు, పరిధులు తెలుస్తాయి. మన హక్కులతో పాటు ఇతరుల హక్కులను రక్షించే బాధ్యత మనపై ఉందని గోపీనాథ్ పేర్కొన్నారు. ఎవరూ అన్యాయాలకు, అణచివేతకు గురి కాకూడదంటూ 20 నిమిషాలపాటు పలు అంశాలపై ప్రత్తిపాడు న్యాయస్థాన న్యాయమూర్తి లంక గోపినాథ్ కూలంకషంగా వివరించారు. ఇంకా న్యాయవాదులు అవసరాల దేవి, బుగతా శివన్నారాయణ (శివ), గౌరీశంకర్, మధుబాబు, పిల్లి బలరాముడు, ఎ.సుగుణ, కాళీప్రసాద్, పుల్లయ్య, చెరుకూరి రామకృష్ణ, శారదామణి, పెదమల్లాపురం సర్పంచ్ గుండు నాగదేవి భర్త చెంచుబాబు, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బచ్చల గంగ, పెదమల్లాపురం ప్రత్యేక గిరిజన మండలం సాధన సమితి ఛైర్మన్ జర్తా ముసలయ్య, పెదమల్లాపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యులు పొలసపల్లి సందీప్ ప్రసంగించారు. శంఖవరం మండల వెలుగు కార్యాలయం ద్వారా మండలంలోని 57 డ్వాక్రా సంఘాలకు మంజూరైన బ్యాంకు లింకేజీ రివాల్వింగ్ ఫండ్ రూ. 3.40 కోట్ల నమూనా చెక్కును లబ్ధిదార మహిళలకు చంద్రమౌళీశ్వరి అందజేసారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. పలువురు పలు విజ్ఞాపనలను అందజేశారు. జ్యోతీ ప్రజ్వలనంతో ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన ఈ న్యాయ విజ్ఞాన అవగాహనా సదస్సు బాల్యం వివాహాల నిరోధం ప్రతిజ్ఞతతో 2.30 గంటలకు ముగిసింది. ఈ కార్యక్రమం ఆరంభానికి ముందు పెదమల్లాపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను, శంఖవరం, రౌతులపూడి మండలాల ఐసిడిఎస్ పథకం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ పోషకాహార పదార్థాల ప్రదర్శన, చేనేతశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన, ప్రకృతి సేద్యం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ కషాయాలు, ఆర్గానిక్ సేద్య ఉత్పత్తులైన కూరగాయలు, ఆకు కూరల ప్రదర్శనా క్షేత్రాలను పెద్దాపురం జిల్లా న్యాయమూర్తి చంద్రమౌళీశ్వరి ప్రారంభించారు. వీటన్నింటికంటే ముందుగా ఆశ్రమ పాఠశాల ఆవరణలోని భారత రత్న బిఆర్.అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు ఆమె పూల మాలలను వేసి ఘన నివాళులను అర్పించారు. పలువురు పాల్గొన్నారు.

# సర్పవరం జంక్షన్లో రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం సర్పవరం జంక్షన్ వద్ద రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, సివిల్ సప్లై డైరెక్టర్ కదలి ఈశ్వరి, కూటమి నాయకులు టిడిపికో కోఆర్డినేటర్ కటకం శెట్టి బాబి నులుకుర్తి వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో కొబ్బరికాయ కొట్టి రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చేయడానికి శ్రీకారం చుట్టారని అందులో భాగంగానే 50 కోట్ల రూపాయలతో క్రికెట్ స్టేడియం ను ఏర్పాటు చేయడానికి సహకరించడం ఆనందదాయమన్నారు అలాగే నియోజకవర్గంలో రోడ్లన్నీ అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని అవసరమైన వారికే ప్రభుత్వం ద్వారా అందించే సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రంబాల వెంకటేశ్వరరావు పితాని లీలావతి ఎంపీడీవో పి సతీష్ డి ఈ శ్రీనివాస్ జనసేన పార్టీ నాయకులు తాటికాయల వీరబాబు గుడిపూడి బాలాజీ చంటి రెడ్డి గేదెల చిన్నారావు సంతోష్ గుంటముక్కల బుజ్జి తల్లి శ్రీనివాస్ గంటా ప్రసాద్ కనిగిరి సత్యనారాయణ గిడుదూరి శ్రీనుటిడిపి నాయకులు పాల్గొన్నారు

# వేళంగి గ్రామం సచివాలయ ఉద్యోగి సత్యకు అభినందనలు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ కరప మండలం వేళంగి గ్రామపంచాయతీకి చెందిన డిజిటల్ అసిస్టెంట్ సత్య శనివారం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో తన పరిధిలో ఉన్న వాళ్ళందరి ఇంటింటికి వెళ్లి పెన్షన్ దారులకు అమౌంట్ అందజేశారు.. కానీ ఒక వృద్ధురాలైన మహిళకు ఎలాగైనా సరే అమౌంట్ అందజేసి ఆమె కళ్ళల్లో ఆనందం చూడాలని కాకినాడలో రాఘవ హాస్పిటల్ ఎమర్జెన్సీ వార్డులో ఉన్న కొప్పిశెట్టి జానకమ్మకు ఆవిడకు రావాల్సిన పించన్ సొమ్మును అందజేశారు. ఈ విషయంలో ఈ మహిళా ఉద్యోగినీ చేసిన పనికి గ్రామస్తులు మరియు పంచాయతీ సిబ్బంది, సహచర ఉద్యోగస్తులు ఆమెను అభినందించారు.

# విద్యార్థులకు ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

## - ప్రాణం నిలిపే ప్రథమ చికిత్స



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ డాక్టర్ గోగినేని తరుణ్ అనుమతితో జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక కోటిపల్లి బస్టాప్ వద్ద గల రెడ్ క్రాస్ కార్యాలయం నందు శనివారం ప్రథమ చికిత్స శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ కామిరెడ్డి వెంకటరమణ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులలో ప్రాణం కాపాడే మెళకువలు నేర్చుకునేందుకు ప్రథమ చికిత్స శిక్షణ ప్రజలందరికీ తప్పనిసరి అని, ముఖ్యంగా యువత, విద్యార్థులు ప్రథమ చికిత్స శిక్షణలో తర్ఫీదు పొందిన వారై ఉండడం ఎంతో ఆవశ్యకరమని తెలిపారు. అదేవిధంగా కలెక్టర్ సూచనల మేరకు విద్యాసంస్థలలో ఉచితంగా ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో రెడ్ క్రాస్ కోశాధికారి మహాలక్ష్మి, మేనేజింగ్ కమిటీ సభ్యులు బల్ల శ్రీనివాస రావు, బి పద్మావతి, జిల్లా సమన్వయకర్త పాగోటి రాంబాబు, ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ వియ్యపు గోపాలకృష్ణ, నాగ పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలోని ప్రభుత్వ ఇళ్ల లబ్దిదారులకు బిగ్ అలర్ట్..

## ఆ లోపు ఇంటి నిర్మాణం పూర్తి చేయకపోతే డబ్బులు బంద్..!




ఏపీ ప్రభుత్వం ఇళ్ల లబ్దిదారులకు బిగ్ అలర్ట్ జారీ చేసింది. మార్చిలోగా పెండింగ్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. లేకపోతే బిల్లులు ఆగిపోతాయని హెచ్చరిస్తోంది. ఉగాది నాటికి ఇళ్లకు గృహప్రవేశాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇల్లు కట్టుకునేవారికి ప్రభుత్వం అలర్ట్ జారీ చేసింది. ఇంటి నిర్మాణాలపై లబ్దిదారులకు కీలక అప్డేట్ ఇచ్చింది. గతంలో ప్రభుత్వం నుంచి ఇళ్ల నిర్మాణ పథకం ద్వారా ఇల్లు మంజూరై నిర్మించుకుంటున్నవారికి డెడ్ లైన్ విధించింది. మార్చి నెలాఖరు నాటికి పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రజలకు సూచనలు జారీ చేస్తూ ప్రకటన విడుదల చేసింది. ఉగాదికి పెండింగ్‌లో ఉన్న ఇళ్లన్నీ పూర్తి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఉగాదికి ఐదు లక్షల ఇళ్లకు ఒకేసారి గృహప్రవేశం చేయాలని చూస్తోంది. ఈ క్రమంలో మార్చిలోపు ఇంటి నిర్మాణం పూర్తి చేసేలా పనులు వేగవంతం చేయాలని లబ్దిదారులకు గృహనిర్మాణ అధికారులు సూచిస్తున్నారు.

**ఉగాది తర్వాత చెల్లింపులు బంద్**

ఉగాది నాటికి ఇంటి నిర్మాణం పూర్తి చేయకపోతే ఆన్‌లైన్ నుంచి పేరు తొలగించనున్నారు. దీని వల్ల చెల్లింపులు నిలిచిపోతాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. అందుకే వేగంగా ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని చెబుతున్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్లను పూర్తి చేసేందుకు ఏపీ ప్రభుత్వం అదనపు సాయం కూడా అందిస్తోంది. దీంతో వీటి సాయంతో త్వరతగతిన ఇళ్లను పూర్తి చేయాలని ఏపీ గృహనిర్మాణశాఖ సూచిస్తోంది. ఇళ్ల నిర్మాణాలు మధ్యలో ఆగిపోయినవారిలో ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్సీలకు రూ.75 వేలు అదనంగా ఆర్థిక సహాయం అందిస్తోంది. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం ఆవాస్ యోజన పథకం ద్వారా కూడా రాష్ట్ర ప్రభుత్వం సాయం అందిస్తోంది.

**ఒకేసారి ఐదు లక్షల ఇళ్లకు గృహప్రవేశం**

మార్చి చివరిల్లోగా పూర్తిచేయకపోతే లబ్దిదారుల పేర్లను ఆన్ లైన్ నుంచి తొలగించేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమవుతుందని తెలుస్తోంది. దీని వల్ల పెండింగ్ బిల్లులు ఆగిపోవడం వల్ల లబ్దిదారులు నష్టపోతారు. గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల నిర్మించి ఇచ్చింది. కానీ కొంతమంది సొంత స్థలంలో ఇళ్లను నిర్మించుకున్నారు. అయితే ఈ నిర్మాణాలను కొంతమంది మధ్యలో ఆపివేశారు. అలాంటి లబ్దిదారులకు అదనంగా ఆర్థిక సాయం ప్రభుత్వం అందుతోంది.

# ఏపీ ప్రజలకు బంపర్ ఆఫర్..

## ఒకేసారి రూ.10 వేల రాయితీ.. ప్రభుత్వం నుంచి బెనిఫిట్




కుప్పం గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సంపాదించుకుంది. ఇ-సైకిళ్ల పంపిణీలో చరిత్ర సృష్టించింది. ఏపీలో ఇ-సైకిళ్ల కొనుగోలుపై ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. ఇందులో భాగంగా కుప్పంలో 24 గంటల్లోనే ఐదు వేలకుపైగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఇదొక చరిత్రగా సీఎం చంద్రబాబు తెలిపారు. ఏపీలోని ప్రజలకు కూటమి ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. పర్యావరణాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్న ప్రభుత్వం.. ఎలక్ట్రానిక్స్ వెహికల్స్‌ను ప్రోత్సహిస్తోంది. ఈ-వెహికల్స్‌పై భారీగా సబ్సిడీలు అందించాలని నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా ఇ-సైకిల్స్‌పై ఏకంగా రూ.10 వేల భారీ రాయితీ ఇస్తోంది. అంటే ఇ-వెహికల్స్ కొంటే రూ.10 వేల తగ్గింపు ప్రభుత్వం నుంచి పొందవచ్చు. ఇందుకోసం ప్రముఖ కంపెనీ అయిన ఈ-మోటోరాడ్స్‌తో ఏపీ ప్రభుత్వం తాజాగా ఒప్పందం కూడా కుదర్చుకుంది. అంతేకాకుండా ఈ సైకిళ్ల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం గిన్నీస్ రికార్డు కూడా సృష్టించింది. ఆ వివరాలేంటో ఇప్పుడు చూద్దాం.

**ఒక్కసారి ఛార్జ్ చేస్తే..**

ఈ సైకిళ్లు ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఏకంగా 40 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయి. వీటి ఒక్కో సైకిల్ ధర రూ.35 వేలుగా ఉంది. అయితే ప్రభుత్వం వీటిపై రూ.10 వేల రాయితీ అందిస్తోంది. దీంతో వీటిని కొనుగోలు చేసినవారికి రూ.25 వేలకు వస్తుంది. తాజాగా సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో 5,555 ఇ-సైకిళ్లను పంపిణీ చేశారు. కేవలం 24 గంటల్లోనే ఇది సైకిళ్లను పంపిణీ చేయడం రికార్డుగా చెప్పవచ్చు. దీంతో చిత్తూరు జిల్లా గిన్నీస్ రికార్డ్ సంపాదించుకుంది. ఈ మేరకు చిత్తూరు జిల్లా కలెక్టర్ దీనిని అందుకున్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా కుప్పంలోని తూంసీలో చంద్రబాబు ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా మూడు కిలోమీటర్ల మేర చంద్రబాబు ఇ-సైకిల్‌పై ర్యాలీ చేపట్టి వేదిక వద్దకు చేరుకున్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ఇ-సైకిళ్లను ప్రోత్సహిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు.

**కుప్పం రికార్డ్**


24 గంటల్లోనే కుప్పంలో 5555 ఇ-సైకిళ్లను పంపిణీ చేయడం రికార్డు అని చంద్రబాబు తెలిపారు. కుప్పం ఈ రికార్డ్ సొంతం చేసుకుని గిన్నీస్ రికార్డుల్లోకి ఎక్కడం సంతోషంగా ఉందన్నారు. దీంతో కుప్పం సరికొత్త చరిత్ర సృష్టించిందని తెలిపారు. కొత్త చరిత్రకు కుప్పం శ్రీకారం చుట్టిందని, త్వరలోనే మరిన్ని రికార్డులు సృష్టిస్తుందని అన్నారు. ఇంటిలోనే ఈ సైకిళ్లకు ఛార్జింగ్ పెట్టుకోవచ్చని, ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.

# ఆవు మెడలో ఇలా ట్యూబ్స్ ఎందుకు వేస్తారో తెలుసా..?

ఆవులు తమ పొదుగులో పాలు స్వయంగా తాగకుండా నివారించడానికి వాటి మెడలో ట్యూబ్స్ అమరుస్తారు. ఈ ప్రత్యేకమైన పద్ధతిని రైతులు అనుసరిస్తారు, తద్వారా ఆవు ఈ అలవాటును మరిచిపోతుంది. ఇది తాత్కాలిక పరిష్కారం, అలవాటు పూర్తిగా మారిన తర్వాత ట్యూబ్స్‌ను సురక్షితంగా తొలగిస్తారు. ఇది పశు వుల ఆరోగ్యంతో, పాల దిగుబడి కోసం రైతులు అనుసరించే పద్ధతి పాడి రైతులు కొన్నిసార్లు పాడి ఆవుల మెడలో ట్యూబ్స్ అమర్చుతారు. దీని వెనుక ఒక ప్రత్యేకమైన కారణం ఉంది. కొన్నిసార్లు ఆవులు తమ పొదుగులోని పాలను అవే స్వయంగా తాగుతుంటాయి. ఈ అలవాటును సెల్ఫ్-సక్లింగ్ అని పిలుస్తారు, ఇది పాల దిగుబడిపై ప్రభావం చూపుతుంది. ఆవుల ఆరోగ్యానికి కూడా మంచిది కాదు. ఈ అలవాటును ఆపడం కోసం రైతులు ఆవు మెడలో ప్రత్యేకమైన ట్యూబ్స్‌ను అమరుస్తారు. ఈ ట్యూబ్స్ ఆవు తన మెడను వెనక్కి వంచి పొదుగును అందుకోకుండా అడ్డుకుంటాయి. ఇది ఆవు తన అలవాటును మర్చిపోయేలా చేయడానికి ఒక తాత్కాలిక పద్ధతి. కొన్ని రోజుల పాటు ట్యూబ్స్‌ను ఉంచిన తర్వాత, ఆవు ఆ అలవాటును పూర్తిగా వదులుకున్నాక, వాటిని తొలగిస్తారు. ఈ పద్ధతి రైతులు తమ పాడి పశువులను సంరక్షించడానికి.. పాల ఉత్పత్తిని సమర్థవంతంగా నిర్వహించడానికి అనుసరించే ఒక సాధారణ పరిష్కారం.

**ఆవులు తమ పాలను అవే ఎందుకు తాగుతాయి...?**

దూడగా ఉన్నప్పుడు.. తల్లిపాలను ఎక్కువగా తాగే అలవాటు ఉంటుంది. లేదా బాటిల్ / రబ్బర్ నిప్పుల్‌తో పెంచితే ఆ సక్కింగ్ రిఫ్లెక్స్ పెద్దయ్యాక కూడా మిగిలిపోతుంది. అలవాటు రూపంలో మారుతుంది. అలానే.. సరిపడా మేత లేకపోతే.. ప్రోటీన్, ఖనిజాలు తక్కువైతే శరీరం ఇంకా కావాలి అన్న కోరికతో.. తన పాలను తానే తాగుతుంది. పొదుగు ఎక్కువగా నిండిపోతే.. అసౌకర్యంతో ఉపశమనానికి తానే పాలు తాగుతుంది. మానసిక ఒత్తిడి వల్ల కొన్ని ఆవులు ఇలా ప్రవర్తిస్తాయి. ఆ అలవాటును మాన్పించేందుకు రైతులు ఈ పద్ధతిని అనుసరిస్తాయి.





అంబటి... నోరు అదుపులో పెట్టుకో...

# తక్షణం క్షమాపణ చెప్పు

**మాకు నోళ్లున్నాయ్... మేము మాట్లాడగలం - కానీ మాకు సంస్కారం ఉంది**
**జగన్ మీ వాళ్లను అదుపులో పెట్టుకో : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** క్యారెక్టర్ లేని కొంతమంది... సుకన్యలు, సంజనలు, లీలలు, రాసలీలలు చేసిన వాళ్లు, మాజీ మంత్రుల స్థాయి మరచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని అసభ్యంగా విమర్శించడం చాలా దురదృష్టకరమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పందించారు. అంబటి రాంబాబు వ్యాఖ్యలను ఖండించి తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న పెట్టుబడులను చూసి ఓర్వలేక వైకాపా వారు మాటలతో ఇలా దాడి చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలను తాము దాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. తమ నాయకుడు చంద్రబాబు నాయుడు తమకు నేర్పిన క్రమశిక్షణ, ప్రజాస్వామ్యం గురించి తాము బాధ్యతగా ఉంటున్నామన్నారు. అందుకే తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎప్పుడూ లైన్ దాటరన్నారు. కానీ ఈరోజు తమ దైవ సమాన నాయకుడు చంద్రబాబుపై అసభ్య "ల"కారాలతో మాట్లాడారని అ నుంచి అమ్మహా వరకు లకారాలతో తమ పార్టీ వాళ్లు మాట్లాడగలరని పేర్కొన్నారు. దాన్సులు చేస్తే శ్రీరెడ్డిని చూస్తారు.. రాంబాబును చూస్తారని అన్నారు. కానీ ప్రజాస్వామ్యంలో మన స్థాయిని గుర్తుంచుకోవాలన్నారు. కడప ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి సతీమణి పై కామెంట్ చేసినోడిని సస్పెండ్ చేసిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. మంత్రి పదవి చేపట్టినప్పుడు ఏమీ చేయలేకపోయిన రాంబాబు ఇప్పుడు "నోటికొచ్చినట్టు వాగుతున్నాడు" అని మండిపడ్డారు. మరోవైపు వైఎస్సార్సీపీ లో క్రమశిక్షణ లోపిస్తోందని, గత ఎన్నికల్లో 11 సీట్లకు పడిపోయినా సిగ్గు లేదని విమర్శించారు. "జగన్ గారూ.. ఇలాంటి నోటి దురుసు ఉన్నవాళ్లను చూసుకోండి. లేకపోతే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు ఉండరు!" అని హెచ్చరించారు. "ఇప్పటికైనా నీ



నోరు, నీ ఒళ్లు అదుపులో పెట్టుకో అంబటి రాంబాబు మా సమాధానం మరోలా ఉంటుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఘాటుగా హెచ్చరించారు. వయసు రీత్యా నోరు తప్పి మాట్లాడేసానంటే కుదరదని అంబటి రాంబాబు తప్పకుండా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**వైసీపీ తట్టుకోలేకపోతోంది :**

తిరుమల లడ్డు విషయంలో తప్పు జరిగిందని సిట్ నివేదిక 35వ పేజీలో స్పష్టంగా పేర్కొందన్నారు. నిర్ధారణ తర్వాత కూడా సిగ్గు లేకుండా వైకాపా వాళ్లు మాట్లాడం సరైన విధానం కాదన్నారు. రూ. 235 కోట్లు అవినీతి, వారి గుమ్మస్తాల అకౌంట్లలో వేసి, నిబంధనలు మార్చారని ఆరోపించారు. లడ్డూ వ్యవహారం ప్రజలు నమ్మారు కాబట్టి వైకాపాను ఇంట్లో కూర్చోపెట్టారని అన్నారు. ఇంకా తప్పు ఒప్పుకోకుండా "మేమే సరైనవాళ్లం" అంటూ దొంగే దొంగ అన్నట్టు వైకాపా వారి వ్యవహారం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తోందన్నారు. వైసీపీ వాళ్లకు నోరు ఉంటే అసెంబ్లీకి వచ్చి ప్రతి అంశంపై చర్చించాలన్నారు. ఫిబ్రవరి 11 నుంచి అసెంబ్లీ సెషన్ ఉందని,11మంది 11వ గంటకి ఆధారాలతో వచ్చి చర్చించే దమ్ముందా అని సవాల్ విసిరారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవిత్ర తిరుమల ప్రసాదాన్ని

# రాజకీయం చేస్తున్న చంద్రబాబు

**గుండె పగిలిన హిందువుల మనోభావాలు - అందుకే పాప పరిహార పూజలు : మాజీ ఎంపీ మార్గాని భరత్**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక దానవాయిపేట, టీటీడీ కళ్యాణ మండపం లోని ఆలయం వద్ద వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ ఆధ్వర్యంలో పాప పరిహార పూజలు పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా మిత్రులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఒక భారీ కుట్ర పూర్తిగా బద్దలయ్యింది, నిజం గెలిచింది అబద్దం ఓడిపోయింది. తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని వేదిక చేసుకుని స్వామివారి ప్రసాదాన్ని ఆయుధంగా మార్చిన చంద్రబాబు నాటకం పూర్తిగా భగ్నమైంది రాజకీయ స్వార్థం కోసం చంద్రబాబు కోట్లాది భక్తుల మనోభావాలతో ఆడుకున్నాడు ఈ దుర్మార్గపు కుట్రను తిరుమల వెంకన్న స్వామి కూల్చేశారు. ఈ అబద్ధాన్ని చంద్రబాబు ఒక్కడే కాదు ఆయన పార్టీ పవన్ కళ్యాణ్ కూటమికి ఊడిగం చేసే ఎల్లో మీడియా అందరూ కలిసి విష ప్రచారాన్ని రాష్ట్రవ్యాప్తంగా వ్యాపింప చేశారు. ఈరోజు టీటీడీ కళ్యాణ మండపంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద చంద్రబాబు చేసిన ఘోర అపచారం కారణంగా రాష్ట్రానికి ప్రజలకు ఎలాంటి నష్టం కష్టం రాకూడదని ఆ దేవున్ని ప్రార్థిస్తూ పాప పరిహార పూజలు చేశామని భరత్ తెలిపారు. సుప్రీం కోర్ట్ ఆదేశాల తో దేశంలోనే ప్రముఖమైన ఎన్డిడిబి , ఎన్డిఆర్ఏ లాభలు చేసిన పరీక్షల్లో చంద్రబాబు ఆరోపించినట్టుగా ఎలాంటి జంతువుల కొవ్వు గాని గొడ్డు కొవ్వు గాని పంది కొవ్వు గాని తిరుమల ప్రసాదంలో వాడే నెయ్యిలో లేదని తేలిపోవడం అందరికీ చాలా సంతోషాన్ని ఇచ్చింది భక్తులకు ఊరటను ఇచ్చింది. మనిషిగా పుట్టినవాడు ఎవడైనా ఎంత అమానవనీయంగా వ్యవహరిస్తాడా దేవుడంటే భయం లేకుండా ప్రసాదంలో జంతువులకు కలిసింది అంటూ అబద్ధాలు చెబుతాడా ఇలాంటి వ్యక్తి ముఖ్యమంత్రి కుర్చీలో ఉండటం రాష్ట్ర దురదృష్టం కాదా నిజం ఏమిటంటే సిబిఐ పరీక్షలు చేసిన నెయ్యి చంద్రబాబు




హయాంలోనే సప్లై అయినది ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత వచ్చిన నెయ్యి పైనే ఆరోపణ చేశారు ఆ ట్యాంకర్ నుంచే శాంపిల్లు తీసుకుని సిబిఐ మళ్లీ పరీక్షలు చేయించగా జంతువుల కొవ్వు లేదని తేలింది మిగిలిన అభియోగాలు అన్నిటికీ బాధ్యత చంద్రబాబుదే. ఆరోపణలు ఎదుర్కొంటున్న బోలా బాబాకు టెక్నికల్ క్లియరెన్స్ ఇచ్చింది కూడా చంద్రబాబు గత ప్రభుత్వమే ఇది టీటీడీ మినిట్స్ లో కూడా స్పష్టంగా ఉంది తప్పులన్నీ తానే చేసి వాటిని వేరొకరిపై నెట్టివేయడం చంద్రబాబు రాజకీయ నైజం. పవన్ కళ్యాణ్ లోకేష్ ఏ బాధ్యత వహిస్తారు ఈ ముగ్గురు హిందూ మతానికి చేసిన ద్రోహానికి తిరుమల ఆలయానికి తెచ్చిన అప్రతిష్టకు ఏ మూల్యం చెల్లిస్తారు? నిజాలు బయటకు వచ్చిన ఈ సమయంలో ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకోవాలి లేకపోతే ఈ పాపం జీవితాంతం వెంటాడుతుంది. రాష్ట్ర ప్రజలందరికీ వైయస్సార్సీపీ స్పష్టమైన విజ్ఞప్తి రాజకీయం కోసం చంద్రబాబు చివరకు దేవుని వదలడని తిరుమల లడ్డు వ్యవహారంలో రుజువయింది ఇలాంటి కుట్రలు పట్ల అప్రమత్తంగా ఉండండి అబద్ధాల ప్రచారాల పట్లకూడా జాగ్రత్తగా ఉండండి అని భరత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రాజమండ్రి సిటీ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, ప్రజలు పాల్గొన్నారు.

# దేవున్ని సైతం రాజకీయ లబ్ధికోసం వాడారు...

**ప్రపంచవ్యాప్తంగా తిరుమల లడ్డుకు ఉన్న ఖ్యాతిని బంగపాటు చేశారు - నెయ్యిలో కొవ్వు కలిసిందంటూ చెప్పారు**
**సీట్ ఇచ్చిన నివేదికపై ఏం చెప్తారు : ఎమ్మెల్సీ తోట**

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రపంచవ్యాప్తంగా ఎంతో పవిత్రంగా భావించే కలియుగ పాండవుడు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి తిరుమల లడ్డు ప్రసాదం పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు దుష్ప్రచారాలు చేశారని పిఎసి సభ్యులు,మండపేట నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు.మండపేట విజయలక్ష్మి నగర్ లోని వైసిపి ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తోట మాట్లాడుతూ టిటిడి దేవస్థానానికి సంబంధించిన శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదం అంశంలో దుష్ప్రచారాలు చేశారని విమర్శించారు. కాగా ఎట్టకేలకు సిట్ విచారణ లో అన్ని తేటతెల్లం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ప్రసాదం లో నెయ్యి లో జంతు కొవ్వు వినియోగించారని గతంలో చంద్రబాబు పవన్ లు మాట్లాడారని పేర్కొన్నారు. ఇప్పుడు అటువంటిదేమీ లేదని కొన్ని రసాయనాలు కలిశాయంటూ నివేదిక వచ్చిందన్నారు. గతంలో వీరు దుష్ప్రచారం చేసినప్పుడు దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని జగన్ కోరారని దీంతో కేంద్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పుడు నివేదికలో ఎలాంటివి లేవని తేలిందన్నారు. కల్తీ జరిగిందని జోగేశ్వరరావు ప్రెస్ మీట్ లో చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కల్తీపై తాము మాట్లాడటం లేదని జంతు మాంసం కొవ్వు ఉందని విష ప్రచారం చేశారని దానిపై స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. నిజంగా జంతు మాంసం కొవ్వు కలిస్తే అధికారం లో ఉన్న కూటమి ఈ అంశాన్ని బహిర్గతం చేయకుండా అంతర్గత విచారణ చేపట్టి నివేదికలో తప్పు జరిగిందని తేలితే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దీన్ని రాజకీయం



చేయాలనే ఉద్దేశంతో అప్పట్లో దుష్ప్రచారం చేసి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అపచారం చేశారని పేర్కొన్నారు. ఆయన్నే రాజకీయాల్లోకి లాగడం తగదన్నారు.తనను అలిపిరి ఘటన నుండి రక్షించింది శ్రీవారే అని ఎంతో భక్తిగా మాట్లాడే చంద్రబాబు వెంకటేశ్వర స్వామి పై భక్తి ఉంటే ఆనాడు బయట పెట్టకుండా విచారణ చేయాల్సి ఉండాల్సిందన్నారు. భక్తి ఉంటే అప్పుడు ఎందుకు విచారణ చేపట్టలేదని నిలదీశారు. ప్రజల మనోభావాలు దెబ్బతినేలా ప్రయత్నించారని ఎద్దేవా చేశారు. జంతు కొవ్వు కలవలేదని సిట్ ఇచ్చిన రిపోర్ట్ అంశాలను ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. కల్తీ ఎవరు చేసినా తప్పేనని దాన్ని తాము సమర్థించడం లేదని వివరించారు. తప్పు చేసిన వారిని శిక్షించాల్సింది పోయి గ్లోబల్ ప్రచారం చేసి స్వామి వారిపై ప్రచారం చేశారన్నారు.స్వామివారికి ఎంత ప్రాధాన్యత ఉందో లడ్డు కు కూడా అంతే ప్రాధాన్యత ఉందన్నారు. రాజకీయాల్లో ఈ అంశాన్ని వాడుకుని వాడుకున్న వారిని శ్రీ వెంకటేశ్వర స్వామి క్షమించడని పేర్కొన్నారు. వారు చేసిన ప్రచారం వల్ల ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రసాదాన్ని నోట్లో వేసుకునే వారికి వారు వాడిన పదాలు గుర్తుకు వచ్చేయని పేర్కొన్నారు. వీరు దేవుడిని కూడా వదల్లేదని విమర్శించారు. ఎవరికి శిక్ష వేయాలో దేవుడు చూసుకుంటాడని పేర్కొన్నారు. దీనిపై వైసిపి సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే ప్రశ్నించడం ఎంతవరకు సమంజసమన్నారు. కూటమి ప్రభుత్వం భాగస్వామ్యంగా ఉన్న కేంద్ర ప్రభుత్వం నియమించిన దర్యాప్తు సంస్థ ఇచ్చిన నివేదికలో నిజాలు వెల్లడయ్యాయన్నారు. ఇప్పుడు నోరు మూసుకు కూర్చోవాల్సిన పరిస్థితి కూటమి నేతలకు ఏర్పడిందని ఎద్దేవా చేశారు. వై వి సుబ్బారెడ్డి పిఎ అప్పన్న ఖాతాలోకి సొమ్ము వచ్చాయని ఆరోపిస్తున్నారని తిరుమల తిరుపతి దేవస్థానం నుండి ఒక రూపాయి నగదు కూడా బయటకు వెళ్ళదని అన్ని బ్యాంక్ అకౌంట్ ల ప్రకారం జరుగుతాయన్నారు. ఈ అకౌంట్లో నుండి జగన్ కరుణాకర్ రెడ్డి సుబ్బారెడ్డికి నగదు వెళ్లిందా అంటూ ప్రశ్నించారు. వారు ఏదైనా దోచేసారా దీనిపై ఆధారాలు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. వారు ఏదైనా దోచేస్తే చెప్పండి అంటూ నిలదీశారు. సిగ్గులేని విధంగా దుష్ప్రచారాలు చేశారని మండిపడ్డారు. వైసీపీ పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.ఆ భగవంతుడు కూడా వీళ్ళని క్షమించడని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మునిసిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, రాష్ట్ర వైసిపి కార్యదర్శి కర్రి పాపారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురం శ్రీను, వైసిపి టౌన్ కన్వీనర్ పిల్లి శ్రీను, రూరల్ వైసిపి కన్వీనర్ అడబాల బాబ్జి, షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆలీఖాన్ బాబా, కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్ , జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట అయ్యప్ప, జొన్నపల్లి సత్తిబాబు, పిల్లా వీరబాబు, పోతుల రాంబాబు, పోతుల ప్రసాద్, యరమాటి వెంకన్నబాబు,దాసరి వీర వెంకట లక్ష్మి, వాసిరెడ్డి అర్జున్, కోళ్ళ శ్రీను, తీగిరెడ్డి మహేష్, మద్రివాడ సూరిబాబు, బిళ్లగుత్తి అంజిబాబు,శ్రీ వెంకట గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలతో గ్రామమంతటా పచ్చని వాతావరణం

**- మొక్కలను నాటడం కాదు పరిరక్షించాలి**
**- విడతల వారీగా అర్హులని ఎంపిక చేస్తూ నూతన పెన్షన్లను అందిస్తున్నాం**
**- తొర్రేడు గ్రామంలో యువగళం టీం ఆధ్వర్యంలో**
**మొక్కలు నాటిన ఎమ్మెల్యే గోరంట్ల, రూడా చైర్మన్ బొడ్డు**

**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** మొక్కలను నాటడం కాదు వాటిని పరిరక్షించాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు. శనివారం ఉదయం తొర్రేడు గ్రామంలో యువగళం టీం ఆధ్వర్యం లో గ్రామమంతట మొక్కలు నాటే కార్యక్రమానికి రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రూడా చైర్మన్,జిల్లా తెదేపా అధ్యక్షులు



బొడ్డు వెంకట రమణ చౌదరి హాజరయ్యారు.అలానే గ్రామంలో నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అర్హులకు అందించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ గ్రామమంతట మొక్కలు నాటుతూ మంచి ఆహ్లాదకరమైన వాతావరణానికి నాంది పలికిన యువగళం టీం వారికి అభినందనలు తెలిపారు. మొక్కలు నాటడం వలన గ్రామమంతట పచ్చని వాతావరణంతో పాటు ఆరోగ్యకరమైన ఆక్సిజన్ ప్రజలకు అందుతుందని అన్నారు. ఈరోజు నియోజకవర్గంలో నూతనంగా మంజూరైన 44 మంది అర్హులకు పెన్షన్లు అందిస్తున్నామని, రాష్ట్రమంతటా సమగ్ర సర్వే చేస్తూ విడతల వారీగా అర్హులను ఎంపిక చేసి పింఛన్లు అందిస్తున్నామని అన్నారు. రేపు ఒకటవ తేదీ సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం, కూటమి ప్రభుత్వమని, భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మందికి 24 రకాల పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు, తెలుగు యువత నాయకులు కురుకుర్ కిషోర్, గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ, దండమూడి బాపినీడు, ప్రమీల, కొత్తపల్లి సత్యనారాయణ, గద్దె సత్యనారాయణ, దాసరి రామచంద్రం, సుంకవెల్లి చిన్నారి, చిట్టూరి శ్రీధర్, దాసరి గురు ప్రసాద్, నాగవర్ధిని, వెంకటరత్నం, బాబు రాయుడు, ఎం.పీ.డీ.వో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్ యువగళం టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్వోను కలిసి ప్రెస్‌క్లబ్ సమస్యను వివరించిన జేఏసీ సభ్యులు




- ❑ రాజమండ్రి ప్రెస్ క్లబ్ ఎన్నికలు జాప్యంపై నిరసన ర్యాలీ
- ❑ ఫిబ్రవరి 6 వరకు రాజమండ్రి ప్రెస్ క్లబ్ వద్ద సెక్షన్ 163 అమలు
- ❑ అర్బన్ మండల కార్య నిర్వాహక మేజిస్ట్రేట్, న్యాయస్థానం, పి.హెచ్.జి.ఆర్.పాపారావు ఉత్తర్వులు జారీ

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహణపై జరుగుతున్న జాప్యంపై జేఏసీ సభ్యులు నిరసన ర్యాలీ నిర్వహించారు. శనివారం రాజమండ్రి ప్రెస్ క్లబ్ నుంచి ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహించాలని, ఏడు సంవత్సరాల కాలంగా ప్రెస్ క్లబ్ నిధులు దుర్వినియోగంపై విచారణ జరపాలని, జర్నలిస్టుల జేఏసీ ఐక్యత వర్ధిల్లాలని, అర్హులైన జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ లో సభ్యత్వాలు కల్పించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా రాజమండ్రి ప్రెస్ క్లబ్ నుంచి బయలుదేరి దేవిచౌక్, గోకవరంబస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం, కోటగుమ్మం సెంటర్లోని శివుని విగ్రహం, నుంచి బయలుదేరి మెయిన్ రోడ్ మీదుగా కోటిపల్లి బస్టాండ్ వద్దగల ఎన్టీఆర్ విగ్రహం వద్ద వరకు ర్యాలీ నిర్వహించారు.ప్రెస్ క్లబ్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని, గత ఏడు సంవత్సరాల కాలంగా ప్రెస్ క్లబ్ నిధులు దుర్వినియోగం ప్రత్యేక అధికారితో విచారణ జరపాలని, అర్హులైన జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ లో సభ్యత్వం కల్పించాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం రాజమండ్రి తాసిల్దార్ కార్యాలయం చేరుకొని తాసిల్దార్ కు రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో జరుగుతున్న అవకతవకలు, అవినీతి, నియంతృత్వ పోగడాలపై సమగ్రంగా వివరించారు. ప్రెస్ క్లబ్ ఎన్నికలు వెంటనే నిర్వహించి ప్రెస్ క్లబ్ కు సంబంధించిన నిధులు దుర్వినియోగంపై ప్రత్యేక అధికారితో విచారణ జరపాలని కోరారు. ప్రెస్ క్లబ్ సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రెస్ క్లబ్ కు తాళాలు వేసి ఉద్రుతలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ వద్ద సెక్షన్ 163 అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిస్కారం అయ్యే వరకు ఎటువంటి ప్రెస్ మీట్ లు జరుగకుండా చూడాలని కోరారు. విలేకరుల డిమాండ్లపై స్పందించిన రాజమండ్రి అర్బన్ తాసిల్దార్ సెక్షన్ 163 అమలు చేయాలని కోరుతూ నోటీసులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ట్రైనింగ్ పూర్తయి వచ్చిన తర్వాత ప్రెస్ క్లబ్ సమస్య ను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ వద్ద ఫిబ్రవరి 6 వరకు సెక్షన్ 163 అమలు :**

రాజమండ్రి ప్రెస్ క్లబ్ వద్ద ఫిబ్రవరి 6 వరకు సెక్షన్ 163 అమలలో ఉంటుందని రాజమహేంద్రవరం అర్బన్ మండల కార్యనిర్వాహక మేజిస్ట్రేట్, న్యాయస్థానం, పి.హెచ్.జి.ఆర్. పాపారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఎం.సి.నెం.39/2026, తేది: 31.01.2026 సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ క్రింద ఉత్తర్వు జారీ చేశారు. రాజమహేంద్రవరంలోని గణేష్ చౌక్ వద్ద ఉన్న ప్రెస్ క్లబ్‌లో ఒక వర్గం నిరాహార దీక్ష చేస్తున్నారని, మరొక




వర్గం ప్రెస్ క్లబ్ ఎన్నికలు ఆర్థిక విషయాలకు సంబంధించి ఒక పత్రికా సమావేశం నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నారని సమాచారం అందిందని, ఈ నేపథ్యంలో ప్రజల ప్రయోజనార్థం, శాంతియుత వాతావరణాన్ని నిర్ధారించడానికి, శాంతిభద్రతల పరిస్థితికి భంగం కలిగించే అవాంఛనీయ సంఘటనలను నివారించడానికి, ఏదైనా శాంతిభద్రతల పరిస్థితిని ఎదుర్కోవడానికి, సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ క్రింద ఉత్తర్వులు జారీ చేయడం అవసరమని నేను పూర్తిగా నమ్మాను, సంతృప్తి చెందాను. పై విషయాల దృష్ట్యా, నేను, పి.హెచ్.జి.ఆర్. పాపారావు, మండల కార్యనిర్వాహక మేజిస్ట్రేట్, రాజమహేంద్రవరం అర్బన్ మండలం, తూర్పు గోదావరి జిల్లా, గణేష్ చౌక్ ప్రాంతంలో శాంతిభద్రతలను సజావుగా నిర్వహించడం కోసం 31.01.2026 నుండి 06.02.2026 వరకు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ క్రింద ఈ ఉత్తర్వులను జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను పోలీసు అధికారులు అందరూ ప్రకటన ద్వారా సాధారణ ప్రజలకు తెలియజేయాలి. సంబంధిత పోలీసు ఇన్‌స్పెక్టర్ ఈ ఉత్తర్వులను సమర్థవంతంగా అమలు చేయాలి అని అన్నారు.

# ఆదిత్య వాలంటీర్లకు కలెక్టర్ అభినందనలు

**- రహదారి భద్రత మాసోత్సవాల్లో బహుమతుల స్వీకరణ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కన ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాల, ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల అండ్ పిజి కళాశాల ,యానిమేషన్ వింగ్, బిజినెస్ స్కూల్‌కు చెందిన ఎన్.ఎస్.ఎస్డయూత్ రెడ్ క్రాస్.. వాలంటీర్లకు 37వ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన అనేక పోటీలలో 22 మందికి బహుమతులు, ధ్రువ పత్రాలు, 29 మంది వివిధ ప్రాంతాలకు వెళ్లి చేసిన అవగాహనా సదస్సులకు, రహదారి భద్రత నియమాలు గురించి, శిరస్త్రాణం వాడకం గురించి, కారులో ప్రయాణించే వారికి సీట్ బెల్ట్ గురించి చెప్పిన సేవలకు గాను ధ్రువ పత్రాలు బహూకరించడం జరిగింది. ముగింపు ఉత్సవాల సందర్భంగా పీజీ ఆర్ఎస్ హాల్లో వై మేఘ స్వరూప్ ఐఏఎస్ కలెక్టర్, డిటిఓ ఆర్.సురేష్, మోటారు వాహనాలు ఇన్స్పెక్టర్స్ సిహెచ్ సంపత్ కుమార్, ఎం రవికుమార్, జి ప్రణీత్ కుమార్, ఉమామహేశ్వరరావు, రామనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి వి ఎస్ నాగేశ్వరరావు,రాజమండ్రి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ బి హెచ్. వి.రమాదేవి, పోలుకొండ సాయి, బేటి విమల, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ బి కొరియన్ కుమార్, ఎన్ఎస్ఎస్ నాయకుడు జి.వినయ్,వై.మనోజ్, పృథ్వి, యశస్విని, శ్రావణి. పల్లవి, పి శంకర్,సుగుణ, తదితరులు పాల్గొన్నారు. తమ వాలంటీర్లు రహదారి భద్రతా మాసోత్సవాల్లో అనేక సేవలు చేసి, పోటీలలో పాల్గొని, బహుమతులు సంపాదించినందుకు ఆదిత్య డిగ్రీ కళాశాల సిబ్బంది అభినందనలు తెలియజేశారు. కలెక్టర్ విజేతలను ప్రశంసించారు.

# చినకొండేపూడి - పెదకొండేపూడి మధ్య పులి పాదముద్రలు

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం చిన్న కొండేపూడి నుండి పెద్దకొండేపూడి మధ్య ప్రాంతంలో పులి తిరుగుతున్నట్లు గుర్తులు (పాదముద్రలు) కనిపించడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు.ఈ నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని గ్రామ పెద్దలు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఎవరూ బయట తిరగవద్దని, ఉదయం 8 గంటల వరకు బయటకు రావద్దని సూచించారు.అలాగే పశువులను ఒంటరిగా మేతకు వదలకూడదని, ఎవరైనా అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే అటవీ శాఖ లేదా గ్రామ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



# ఈ రెండు బ్యాంకుల విలీనం..! ఖాతాదారులకు అలర్ట్..

## పాస్‌బుక్, ఐఎఫ్‌సీ మారొచ్చు!




యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా విలీనంతో దేశంలో మూడవ అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ త్వరలో ఏర్పడనుంది. ఈ ఏడాది చివరి నాటికి విలీనం పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ విలీనం ఖాతాదారుల పాస్‌బుక్‌లు, IFSC కోడ్‌లలో మార్పులకు దారితీయవచ్చు. దేశంలో త్వరలో మూడవ అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ఏర్పడవచ్చు. రెండు పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనంతో మూడో అతిపెద్ద బ్యాంక్‌గా మారనుంది. ఈ ఏడాది చివరి నాటికి విలీనం పూర్తవుతుందని సమాచారం. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా మధ్య విలీనం కోసం ప్రాథమిక ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. రెండు బ్యాంకులు ప్రస్తుతం తగిన శ్రద్ధ వహిస్తున్నాయి, ఇందులో ప్రక్రియ అంతర్గత మూల్యాంకనం, కార్యాచరణ ఏకీకరణ ఉన్నాయి. కాగా ఈ బ్యాంకుల విలీనం పూర్తి అయితే అందులోని ఖాతాదారుల పాస్ పుస్తకాలు, ఐఎఫ్‌సీ కోడ్‌లు మారే అవకాశం ఉంది. ప్రభుత్వం చిన్న బ్యాంకులను పెద్ద వాటితో విలీనం చేయాలని, ప్రస్తుత 12 బ్యాంకుల స్థానంలో నాలుగు నుండి ఐదు పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకులను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఈ విలీనం దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఒకటిగా ఏర్పడుతుందని, బ్యాలెన్స్ షీట్, బ్రాంచ్ నెట్‌వర్క్, కస్టమర్ బేస్ గణనీయంగా విస్తరిస్తుంది. ఈ విలీన సంస్థ 2025 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.25.4 లక్షల కోట్ల ఆస్తులతో రెండవ అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకుగా అవతరిస్తుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, HDFC బ్యాంక్ తర్వాత మూడవ అతిపెద్దదిగా అవతరిస్తుంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా విలీనమైన బ్యాంక్ ప్రస్తుత ధరల ప్రకారం సుమారు రూ.2.13 లక్షల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో ఆరవ స్థానంలో ఉంటుంది. బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లను అధిగమిస్తుంది. ప్రస్తుతం యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా వరుసగా ఐదవ, ఆరవ అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకులుగా ఉన్నాయి.

### మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా

# సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం..



అజిత్ పవార్ మరణం తరువాత, ఆయన భార్య సునేత్రా పవార్ శనివారం (జనవరి 31) మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సునేత్రా పవార్ కు క్రీడలు, యువజన సంక్షేమ శాఖ, రాష్ట్ర ఎక్సైజ్, మైనారిటీ వ్యవహారాల శాఖ బాధ్యతలు అప్పగించారు. అయితే, అజిత్ పవార్ నిర్వహించిన ఆర్థిక శాఖను ఎవరికి కేటాయించలేదు. దీంతో ఆర్థిక మంత్రిత్వ శాఖతో పాటు, ప్రణాళికా విభాగం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తోనే ఉంటుంది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఈ శాఖను తమ పార్టీకి అప్పగించాలని ఎన్‌సీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నట్లు కూడా వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం ఇరు పార్టీల అగ్ర నాయకుల నుండి ఎటువంటి స్పందన రాలేదు. అయితే, అజిత్ పవార్ నిర్వహించిన అన్ని శాఖలను సునేత్ర స్వీకరిస్తారని చర్చలు జరిగాయి. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ లెఫ్టినెంట్ గవర్నర్‌కు లేఖ రాసి మంత్రిత్వ శాఖ గురించి తెలియజేశారు. సునేత్రా పవార్ తో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇప్పుడు ఆర్థిక మంత్రిత్వ శాఖతో పాటు, ప్రణాళికా విభాగం కూడా ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తోనే ఉంటుంది. ఆయన ఈ సంవత్సరం, అంటే 2026 బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశపెడతారు. తన అనుభవం కారణంగా, ఫడ్నవీస్ ప్రస్తుతానికి ఈ మంత్రిత్వ శాఖను కొనసాగిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సంవత్సరం బడ్జెట్ కు సిద్ధం కావడానికి ఆయన బాధ్యత వహిస్తారు. 2023 లో ఫడ్నవీస్ ఆర్థిక శాఖను కూడా నిర్వహించిన సంగతి తెలిసిందే. సునేత్రా పవార్ ఉప ముఖ్యమంత్రిగా నియమితులైన తర్వాత, ఆమె మేనల్లుడు రోహిత్ పవార్ స్పందించారు. రాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా ప్రమాణ స్వీకారం చేయడం సంతోషకరమైన విషయం అని ఆయన అన్నారు. నిజం చెప్పాలంటే, అజిత్ దాదా స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు, కానీ కనీసం సునేత్రా రూపంలోనైనా, అక్కడ అజిత్ దాదాను మనం చూడగలుగుతాము. మనమందరం దుఃఖిస్తున్నప్పటికీ, ఆమెకు ఎలా శుభాకాంక్షలు చెప్పాలో మనకు తెలియడం లేదు అని రోహిత్ పవార్ పేర్కొన్నారు.

**సునేత్రా పవార్‌కు ప్రధాని మోదీ అభినందనలు**

ఉప ముఖ్యమంత్రిగా ఎన్నికైన సునేత్రా పవార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. తన సోషల్ మీడియా హ్యాండిల్ లో పోస్ట్ చేసిన ప్రధాని మోదీ, "మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పదవీకాలం ప్రారంభించిన సునేత్రా పవార్ జీకి అభినందనలు, ఈ బాధ్యతను చేపట్టిన తొలి మహిళ. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఆమె అవిశ్రాంతంగా కృషి చేస్తారని, దివంగత అజిత్ దాదా పవార్ దార్శనికతను నెరవేరుస్తారని నాకు నమ్మకం ఉంది" అని రాశారు.

### ఇప్పటివరకు బయటపడ్డ

# పలు ముఖాల నాగ శిల్పాలు..

## ఇప్పుడు ఏకంగా సజీవ పాము..



కర్ణాటక రాష్ట్రం గడగ్ జిల్లా లక్కుండిలో కొనసాగుతున్న తవ్వకాల్లో ప్రతిరోజూ కొత్త పురాతన అవశేషాలు వెలుగుచూస్తున్నాయి. నాగ శిల్పాలు లభిస్తున్న అదే ప్రదేశంలో సజీవ పాము కనిపించడం స్థానికుల్లో ఆసక్తిని రెట్టింపు చేసింది. చాళుక్యుల కాలానికి చెందిన మరిన్ని చారిత్రక ఆనవాళ్లు బయటపడతాయనే అంచనాలతో పురావస్తు శాఖ తవ్వకాలు కొనసాగిస్తోంది. పూర్తి వివరాలు కథనం లోపల... కర్నాటక గడగ్ జిల్లా లక్కుండిలో జరుగుతున్న తవ్వకాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. దాదాపు ప్రతిరోజూ కొత్త పురాతన అవశేషాలు బయటపడుతున్నాయి. శుక్రవారం 13వ రోజు తవ్వకం పనులు ప్రారంభించక ముందే ఆ ప్రదేశంలో.. ఓ గుంత వద్ద సజీవ పాము కనిపించింది. ఇది స్థానికులు, సందర్శకులలో చర్చకు దారితీసింది. ఇప్పటివరకు లక్కుండి తవ్వకాలలో అనేక నాగ శిలలు బయటపడ్డాయి. వాటిలో ఏకముఖ, రెండు ముఖాలు, మూడు ముఖాలు, ఐదు ముఖాలు. ఏడు ముఖాలు కలిగిన సర్ప శిల్పాలు ఉన్నాయి. అయితే శుక్రవారం తెల్లవారుజామున, తవ్వకం స్థలంలో ఒక గొయ్యి లోపల రెండున్నర అడుగుల పొడవున్న సజీవ పాము కనిపించింది. శరీరంపై నల్లటి మచ్చలు ఉన్న ఆ పాము విషపూరితమైన బేల్ ఓడకా జాతికి చెందినదిగా అనుమానిస్తున్నట్లు స్థానిక వర్గాలు తెలిపాయి. పామును గమనించిన తర్వాత.. తవ్వకం సిబ్బంది, పర్యవేక్షకులు జాగ్రత్తగా రెస్క్యూ ఆపరేషన్ చేసి దానిని సురక్షితంగా రక్షించారు. సర్ప శిల్పాలు దొరికిన సమయంలో నిజమైన పాము కనిపించడం స్థానికుల్లో ఉత్సుకతను పెంచింది.

**లక్కుండిలో తవ్వకాలు ఎందుకు..?**

అక్కడ భూమి కింద పాత ఆలయాలు, శిల్పాలు, నాగరాళ్లు ఉన్నాయని అనుమానం ఉంది. లక్కుండి చాళుక్యుల కాలంలో చాలా ముఖ్యమైన ప్రాంతం.గ్రామస్తుల దగ్గర నుంచి వచ్చిన సమాచారం.. పాత ఆధారాలు చూసి.. గతంలో బయటపడ్డ సాంస్కృతి సంపద ఆనవాళ్ల కారణంగా.. ఇక్కడ ఇంకా చరిత్ర దాగి ఉందని పురావస్తు శాఖ గుర్తించింది. అందు కేదాగి ఉన్న పురాతన అవశేషాలు బయటకు తీయడానికి, లక్కుండి అసలు చరిత్ర ఏమిటో తెలుసుకోవడానికి పురావస్తు శాఖ తవ్వకాలు చేపడుతుంది.

# కనిపించకుండా పోయిన 13 ఏళ్ల బాలుడు..

## గుట్టురట్టు చేసిన పోలీస్ డాగ్.. నిందితుడు ఎవరో తెలుసా..?



మధ్యప్రదేశ్ లో సంచలన ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. ఇండోర్ లోని ఎంఐజి పోలీస్ స్టేషన్ ప్రాంతంలో 13 ఏళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి హతమార్చారు. హత్య తర్వాత, నిందితుడు మృతదేహాన్ని తన సొంత ఇంట్లోని బెడ్ బాక్స్‌లో దాచిపెట్టాడు. బాలుడి గురించి ఏమి తెలియనట్లు నటించాడు. చివరికి పోలీసులు సాంకేతిక ఆధారాలతో తమదైన శైలిలో విచారణ చేపట్టడంతో అసలు విషయం బయటపడింది. ప్రధాన నిందితుడు రెహాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంటి పొరుగున ఉండే మైనర్ బాలుడు అతిఫ్‌ను రెహాన్ తోపాటు మరో మైనర్ బాలుడు కిడ్నాప్ చేశారు. అమాయక బాలుడిని ఒక భవనం పైకప్పుపైకి తీసుకెళ్లి, అక్కడ అతన్ని దారుణంగా హత్య చేశారు. అనంతరం, సాక్ష్యాలను దాచడానికి నిందితులు అతిఫ్ మృతదేహాన్ని బెడ్ బాక్స్‌లో బంధించారు. అతిఫ్ చాలా సేపటి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో, అతని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపుచర్యలు చేపట్టారు. ఆశ్చర్యకరంగా, ప్రధాన నిందితుడు రెహాన్, పోలీసులు, కుటుంబ సభ్యులతో కలిసి అతిఫ్ కోసం వెతుకుతున్నట్లు నటించాడు. అనుమానం రాకుండా ఉండటానికి అతను దర్యాప్తులో ప్రతిచోటా పోలీసులతో పాటు వెళ్లాడు. కేసు తీవ్రత దృష్ట్యా, పోలీసులు డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ బృందాన్ని పిలిపించారు. దర్యాప్తు సమయంలో, స్నిఫర్ డాగ్ నిందితుడు రెహాన్ వద్దకు వచ్చినప్పుడు, అది అతనిపై మొరగడం ప్రారంభించింది. ఈ ప్రవర్తన పోలీసుల అనుమానాన్ని రేకెత్తించింది. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని తీవ్రంగా విచారించినప్పుడు, హత్యకు సంబంధించిన మొత్తం రహస్యాన్ని వెల్లడించాడు. నిందితులు ఆ ప్రాంతంలో అక్రమంగా మాదకద్రవ్యాలు రవాణా చేస్తున్నారని అతిఫ్ తండ్రి రఫీక్, ఇతర కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాదకద్రవ్యాలు అమ్ముతున్నట్లు అతిఫ్ చూసినట్లు కుటుంబం అనుమానిస్తోంది. బయటపడతారనే భయంతో నిందితులు ఆ అమాయకుడిని చంపేశారు. సంఘటనాస్థల నుండి రక్తంతో తడిసిన జాకెట్, ఇతర ముఖ్యమైన ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రెహాన్‌తోపాటు మరొకరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు MIG పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ జదీ సింగ్ తెలిపారు. ఈ హత్యలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా కాకుండా మరేదైనా కారణంగా ఉందా అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# చేసిందే పాడు పని.. పైగా ఓవరాక్షన్..

## ఈ ఇన్‌స్పెక్టర్ మామూలోడు కాదు సామీ.. వీడియో వైరల్..



రక్షణ కల్పించాల్సిన ఖాకీ అధికారి.. లంచం రుచి మరిగాడు. చిట్ ఫండ్ కేసులో చిక్కుకున్న బాధితుడిని బెదిరించి లక్షల్లో బేరం పెట్టాడు. కానీ సీన్ కట్ చేస్తే.. లోకాయుక్త పోలీసులు వేసిన పక్కా స్కెచ్‌తో ఆ ఇన్‌స్పెక్టర్ ఇప్పుడు కటకటాల పాలయ్యాడు. బెంగళూరులోని సిరాసి సర్కిల్ వద్ద సినిమాను తలపించేలా జరిగిన ఈ ఘటన గురించి ఇప్పుడు తెలుసుకుందాం..కర్ణాటకలో అవినీతి అధికారుల ఆటకట్టించేందుకు లోకాయుక్త పోలీసులు దూకుడు పెంచారు. చిట్ ఫండ్ కేసులో నిందితులకు సహకరించేందుకు ఏకంగా రూ. 5 లక్షలు లంచం డిమాండ్ చేసిన కేపీ అగ్రహార పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గోవిందరాజును లోకాయుక్త పోలీసులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఈ ఘటన మైసూర్ రోడ్డులోని సిరాసి సర్కిల్ సమీపంలో కలకలం రేపింది. మహమ్మద్ అక్బర్ అనే వ్యక్తిపై చిట్ ఫండ్‌కు సంబంధించి ఒక కేసు నమోదైంది. ఈ కేసులో అక్బర్, అతని స్నేహితులకు సహాయం చేసేందుకు అలాగే వారిపై మరిన్ని కఠినమైన కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు ఇన్‌స్పెక్టర్ గోవిందరాజు రూ.5 లక్షలు డిమాండ్ చేశారు. ఇప్పటికే ముందస్తుగా రూ.1 లక్షను వసూలు చేసిన ఇన్‌స్పెక్టర్, మిగిలిన రూ.4 లక్షల కోసం బాధితుడిపై ఒత్తిడి తెచ్చారు.

**సినిమా ఫక్కీలో ట్రాప్**

డబ్బులు ఇచ్చుకోలేని బాధితుడు లోకాయుక్త పోలీసులను ఆశ్రయించాడు. లోకాయుక్త ఎస్పీ శివప్రకాష్ దేవరాజు నేతృత్వంలో అధికారులు పక్కా ప్లాన్ వేశారు. చామరాజేపేటలోని CAR గ్రౌండ్ సమీపంలో డబ్బులు ఇచ్చేందుకు అక్బర్ వెళ్లగా అక్కడ కాపుకాసిన లోకాయుక్త అధికారులు, ఇన్‌స్పెక్టర్ గోవిందరాజు రూ. 4 లక్షలు తీసుకుంటుండగా అదుపులోకి తీసుకున్నారు. "గోవిందరాజు అనే ఇన్‌స్పెక్టర్ బాధితుడిని బెదిరించి లంచం డిమాండ్ చేశాడు. సిరాసి సర్కిల్ దగ్గర డబ్బులు తీసుకుంటున్న సమయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాం. ఈ కేసులో ఇంకా ఎవరైనా అధికారుల ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాం" అని ఎస్పీ తెలిపారు. ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్ గోవిందరాజును అదుపులోకి తీసుకున్న అధికారులు ఆయనపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీస్ అధికారే లంచం తీసుకుంటూ దొరకడం ఇప్పుడు పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించిన నక్కా చిట్టిబాబు



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పిలుపు మేరకు, రాజ మండ్రి సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదేశాల మేరకు శనివారం తెలుగుదేశం పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిశీలకులు నక్కా చిట్టిబాబు ఆధ్వర్యంలో స్థానిక 4వ వార్డులో ఎన్టీఆర్ బరోసా పెన్షన్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ఫిబ్రవరి నెలకు సంబంధించి వృద్ధులకు, వితంతువు లకు, వికలాంగులకు ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ బరోసా పెన్షన్ 1తేదీ ఆదివారం కావడంతో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఎవరూ ఇబ్బంది పడకూడదు అని ఒకరోజు ముందుగా పంపిణీ చేయాలని సంకల్పించింది అని, చంద్రబాబు నాయుడు పరిపాలవ దక్షత అటువంటిది అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వరప్రసాద్,వార్డు ప్రెసిడెంట్ గుత్తుల రమేష్,గౌతమీ జీవకారుణ్య సంఘం డైరెక్టర్ గూటాల సంజీవరావు,వార్డు మాజీ ప్రెసిడెంట్ కొండిశెట్టి రామక్రిష్ణ, అల్లంకి మణికంఠ, అప్పిరెడ్డి కుమార్, కాసాని రమణ, కాలెపు శేఖర్, కాలెపు శ్రీనివాస్, మూలగాడ సత్యనారాయణ , గుబ్బల లోకేష్, వాసంశెట్టి రామస్వామి, ఇంటి శ్రీనివాస్, రేగాని సూర్యనారాయణ, నిరుజ్యోగుల వెంకట రమణ, కప్పల మహాలక్ష్మి, మద్దూరి వీరన్న, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ వాయిస్

# బడ్జెట్‌కి ముందే ఉద్యోగులకు గుడ్‌న్యూస్..!

### డీఎపై కీలక ప్రకటన వచ్చేసిందోచ్..



బడ్జెట్ సమావేశాల మధ్య కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త. జనవరి 2026 నుండి కరవు భత్యం పెంపునకు మార్గం సుగమం అయింది. AICPI-IW సూచిక 148.2 వద్ద స్థిరంగా ఉండటంతో, ణూ 5 శాతం పెరిగి మొత్తం 63 శాతానికి చేరే అవకాశం ఉంది. బడ్జెట్ సమావేశాల మధ్య దేశవ్యాప్తంగా లక్షలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త అందింది. అందరి దృష్టి ప్రభుత్వ ఆర్థిక విధానాలపై కేంద్రీకృతమై ఉండగా, డియర్‌నెస్ అలవెన్స్ విషయంలో ఒక కీలక అప్డేట్ వచ్చింది. నిజానికి జనవరి 2026కి కరవు భత్యం పెంపునకు మార్గం ఇప్పుడు పూర్తిగా క్లియర్ అయింది. అంచనా వేసిన జీతం పెరుగుదలను నిర్ణయించే కీలకమైన డేటాను ప్రభుత్వం విడుదల చేసింది. డియర్‌నెస్ అలవెన్స్ పెంపు పక్కా డేటా ఆధారంగా జరుగుతుంది. దీనికి అతి ముఖ్యమైన కొలమానం పారిశ్రామిక కార్మికుల కోసం అఖిల భారత వినియోగదారుల ధరల సూచిక. కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ డిసెంబర్ 2025 కోసం ఈ గణాంకాలను విడుదల చేసింది. మంత్రిత్వ శాఖ ప్రకారం డిసెంబర్‌లో ఇండెక్స్ 148.2 పాయింట్ల వద్ద స్థిరంగా ఉంది. నవంబర్‌లో కూడా ఈ సంఖ్య అదే స్థాయిలో ఉండటం గమనించదగ్గ విషయం. ఇండెక్స్‌లో స్థిరత్వం అంటే డీఏ భత్యం పెంపు ఆగిపోతుందని కాదు. ఈ గణాంకాల ఆధారంగా ప్రభుత్వం డీఏలో గరిష్ట పెంపుదల చేయగలదని, ఇది ఉద్యోగులకు పెద్ద గిఫ్ట్ అని నిపుణులు భావిస్తున్నారు.

**డిఎ 63 శాతం ఉంటుందా?**

ప్రస్తుత డేటా ఆధారంగా కేంద్ర ప్రభుత్వం కరవు భత్యాన్ని 5 శాతం వరకు పెంచవచ్చని అంచనా. ఇది జరిగితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మొత్తం కరవు భత్యం 63 శాతానికి పెరుగుతుంది. దీనిపై ఆల్ ఇండియా ఛీూా ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు మంజీత్ సింగ్ పటేల్ స్పందిస్తూ.. AICPI-IW ఇండెక్స్ 148.2 వద్ద కొనసాగడం సానుకూల సంకేతమని ఆయన స్పష్టం చేశారు. దీని అర్థం కరవు భత్యంలో 5 శాతం పెరుగుదలకు అన్ని అవకాశాలు ఉన్నాయి. దీని అర్థం ఉద్యోగులు ఇప్పుడు 63 శాతం చొప్పున కరవు భత్యం పొందవచ్చని ఆశించవచ్చు.

# గూగుల్ పే వాడేవారికి సూపర్ ఛాన్స్..

### అద్భుత ఫీచర్లతో ప్రత్యేక క్రెడిట్ కార్డ్ లాంచ్.. ఎక్కడ వాడినా ఆఫర్లే ఆఫర్లు..




కొత్త క్రెడిట్ కార్డులు తీసుకోవాలనుకున్నవారికి శుభవార్త. గూగుల్ పే వాడేవారికి ఇది మంచి అవకాశంగా చెప్పవచ్చు. యాక్సిస్ బ్యాంకుతో కలిసి కొత్త క్రెడిట్ కార్డును గూగుల్ పే లాంచ్ చేసింది. ఇది వాడేవారికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో ఇప్పుడు చూద్దాం.ప్రముఖ యూపీఐ పేమెంట్స్ యాప్ అయిన గూగుల్ పేను దేశవ్యాప్తంగా ఎంతోమంది ఉపయోగిస్తున్నారు. దేశంలో ఎక్కువమంది వాడుతున్న యాప్ గా ఇది కొనసాగుతోంది. క్యాష్ బ్యాక్, రివార్డ్స్, ఆఫర్లు లాంటివి ఎక్కువ ఇస్తుండటంతో గూగుల్ పేను కోట్లాది మంది ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలో ఎక్కువమంది యూజర్లను తెచ్చుకునేందుకు గూగుల్ పే ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా మరిన్ని సేవలను అందుబాటులోకి తెస్తోంది. తాజాగా క్రెడిట్ కార్డు సేవలను కూడా గూగుల్ పే ప్రవేశపెట్టింది. ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ అయిన యాక్సిస్ బ్యాంక్ తో కలిసి కొత్త క్రెడిట్ కార్డును తన యాప్ లో తీసుకొచ్చింది. కేవలం గూగుల్ పే ద్వారానే ఈ క్రెడిట్ కార్డు పొందవచ్చు. యాక్సిస్ బ్యాంకుతో భాగస్వామ్యంతో ఈ కొత్త క్రెడిట్ కార్డును గూగుల్ పే అందుబాటులోకి తెచ్చింది. ఈ కార్డు తీసుకున్నవారికి అనేక బెనిఫిట్స్ ఉన్నాయి. గూగుల్ పే ఫ్లెక్స్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు పేరుతో దీనిని లాంచ్ చేసింది. ఈ కార్డు దరఖాస్తు ఎలా..? బెనిఫిట్స్ ఏంటి? అనే వివరాలు ఇప్పుడు చూద్దాం.

**ఫీచర్లు ఇవే**

–గూగుల్ పే ద్వారా కేవలం నిమిషాల వ్యవధిలోనే కార్డు మంజూరు
–క్రెడిట్ కార్డు ద్వారా నేరుగా స్కాన్ చేసి పేమెంట్స్ చేసే అవకాశం
–డిజిటల్ క్రెడిట్ కార్డు
–రూపే క్రెడిట్ కార్డు. దీని వల్ల క్రెడిట్ కార్డు ద్వారా యూపీఐను స్కాన్ చేసి సులువుగా షాపుల్లో పేమెంట్స్ చేయవచ్చు
–స్టార్స్ రూపంలో వెంటనే రికార్డ్స్
–ఒక స్టార్ ఒక రూపాయితో సమానం

దరఖాస్తు చేసుకోవడం ఎలా..?

–మీ మొబైల్ లో గూగుల్ పే ఓపెన్ చేయండి
–మనీ సెక్షన్ లోకి వెళ్లండి
–క్రెడిట్ కార్డు లేదా గెట్ ఫ్లెక్స్ అనే ఆప్షన్ ఎంచుకోండి
–అప్లై బటన్ పై క్లిక్ చయండి
–పాన్, ఇన్ కమ్, ఎంప్లాయిమెంట్ వివరాలు అందించండి
–ఆధార్, పాన్ నెంబర్ ఆధారంగా ఈ కేవైసీ పూర్తి చేయండి
–మీరు అర్హులైతే కొన్ని నిమిషాల వ్యవధిలోనే కార్డు మంజూరు అవుతుంది
–డిజిటల్ కార్డు ద్వారా మీరు వెంటనే లావాదావేవీలు చేసుకోవచ్చు

ఫోన్ పే, పేటీఎం కూడా..

గూగుల్ పేనే కాకుండా ఇప్పటికే పేటీఎం, ఫోన్ పే యూపీఐ యాప్ లు ప్రత్యేక క్రెడిట్ కార్డులను మంజూరు చేస్తున్నాయి. హెచ్ డీఎఫ్ సీ బ్యాంక్ తో భాగస్వామ్యంతో ఫోన్ పే అల్టిమో క్రెడిట్ కార్డును తీసుకురాగా.. ఎస్ బీఐ, హెచ్ డీఎఫ్ సీ బ్యాంకులతో కలిసి పేటీఎం ప్రత్యేక క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టింది.

# క్రెడిట్ కార్డ్ యూజర్లకు బిగ్ అలర్ట్..!

### కార్డ్ వాడే ముందు కొత్త రూల్స్ తెలుసుకోండి..




హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఇన్ఫినియా మెటల్ క్రెడిట్ కార్డ్ రివార్డ్ పాయింట్ల నిబంధనలను ఫిబ్రవరి 1 నుండి మార్చింది. ఇకపై నెలకు గరిష్టంగా 5 సార్లు పాయింట్లు ఉపయోగించవచ్చు. డెబిట్ కార్డ్ వినియోగదారులకు జనవరి 10 నుండి విమానాశ్రయ లాంజ్ యాక్సెస్ కోసం కొత్త నియమాలు అమలులోకి వచ్చాయి. ప్రస్తుతం క్రెడిట్ కార్డ్ వినియోగం బాగా పెరిగిపోయింది. గతంలో ఒక్క క్రెడిట్ ఉంటే గొప్ప అనుకునే వాళ్లు. ఇప్పుడు దాదాపు ప్రతి ఒక్కరి దగ్గర రెండు, మూడు బ్యాంకుల క్రెడిట్ కార్డులు ఉంటున్నాయి. పైగా క్రెడిట్ కార్డ్స్‌లో చాలా రకాల కార్డులు ఉన్నాయి. అందులో మెటల్ కార్డ్ కూడా ఒకటి. అయితే ఎణఖీజ బ్యాంక్ తన ప్రీమియం ఇన్ఫినియా మెటల్ క్రెడిట్ కార్డ్ నియమాలను మార్చబోతోంది. ఫిబ్రవరి 1 నుండి ఈ కార్డుపై అందుబాటులో ఉన్న రివార్డ్ పాయింట్లను ఇప్పుడు నెలలో గరిష్టంగా 5 సార్లు ఉపయోగించవచ్చని బ్యాంక్ తెలిపింది. విమాన టిక్కెట్లు, హోటల్ బుకింగ్‌లు, ఆపిల్ ఉత్పత్తులు లేదా ఆభరణాల కొనుగోలు కోసం రివార్డ్ పాయింట్లను ఎక్కువగా ఉపయోగించే వారికి ఈ మార్పు కీలకం. సింపుల్‌గా చెప్పాలంటే ఇన్ఫినియా కార్డ్ ప్రతి రూ.150 ఖర్చుకు 5 రివార్డ్ పాయింట్లను అందిస్తుంది. మీరు ఎణఖీజ బ్యాంక్ స్మార్ట్‌బై ప్లాట్‌ఫామ్ నుండి కొనుగోళ్లు లేదా బుకింగ్‌లు చేస్తే, మీరు 10 రెట్లు ఎక్కువ పాయింట్లను కూడా పొందవచ్చు. కానీ పాయింట్ల వాడకంపై పరిమితి ఉంది. స్టేట్‌మెంట్ సైకిల్‌లో, మీరు గరిష్టంగా రూ.2 లక్షల వరకు రివార్డ్ పాయింట్లను రీడీమ్ చేసుకోవచ్చు. అదే సమయంలో విమానాలు, హోటళ్ళు, ఎయిర్‌మైల్స్ పరిమితిని నెలకు రూ.1.5 లక్షల వద్ద ఉంచారు. మీరు ఆపిల్ ఉత్పత్తులు లేదా తనిష్క్ వోచర్‌లను కొనుగోలు చేయాలనుకుంటే, మీరు మొత్తం బిల్లులో 70 శాతం వరకు రివార్డ్ పాయింట్లతో చెల్లించవచ్చు. మిగిలిన మొత్తాన్ని కార్డ్ ద్వారా చెల్లించాలి. అదనంగా నెలకు 50,000 రివార్డ్ పాయింట్లను స్టేట్‌మెంట్ బ్యాలెన్స్‌కు వ్యతిరేకంగా మాత్రమే ఉపయోగించవచ్చు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీరు 365 రోజులు కార్డును ఉపయోగించకపోతే, మీ పేరుకుపోయిన రివార్డ్ పాయింట్లు కోల్పోవచ్చు. డెబిట్ కార్డ్ కస్టమర్లకు కొత్త నియమాలు.. ఎణఖీజ బ్యాంక్ తన డెబిట్ కార్డ్ కస్టమర్ల కోసం కొత్త నియమాన్ని కూడా అమలు చేసింది. జనవరి 10 నుండి మూడు నెలల్లో మొత్తం రూ.10,000 లేదా అంతకంటే ఎక్కువ ఖర్చు చేసే వ్యక్తులు ూమీూ లేదా ఇమెయిల్ ద్వారా విమానాశ్రయ లాంజ్ యాక్సెస్ కోసం లింక్‌ను అందుకుంటారు. ఆ లింక్‌పై క్లిక్ చేయడం ద్వారా వోచర్‌ను క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇన్ఫినియా మెటల్ క్రెడిట్ కార్డ్ అంటే ఏమిటి?.. ఈ ఇన్ఫినియా మెటల్ క్రెడిట్ కార్డును ఏ కస్టమర్ పొందాలో బ్యాంకు స్వయంగా నిర్ణయిస్తుంది. కార్డు పొందిన తర్వాత వెల్‌కమ్ బెనిఫిట్స్ కింద 12,500 రివార్డ్ పాయింట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ కార్డు ఉచితం కాదు. దీనికి ప్రతి సంవత్సరం రూ.12,500 జాయినింగ్ ఫీజు, రూ.12,500 రెన్యూవల్ ఫీజు చెల్లించాలి. మొత్తం మీద ఎణఖీజ బ్యాంక్ ఈ మార్పు ద్వారా రివార్డ్ వ్యవస్థను కొంచెం నియంత్రణ ఉంచాలని అనుకుంటోంది.

# పొగరాయుళ్లకు పిడుగులాంటి వార్త..

### ఇక ఊదడం ఆపేయండి బ్రో



ఫిబ్రవరి 1 నుండి సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల ధరలు భారీగా పెరగనున్నాయి. కేంద్రం కొత్త ఎక్సైజ్ సుంకం, ఆరోగ్య సెస్ విధించింది. ఆదాయాన్ని పెంచడం, పొగాకు వినియోగాన్ని తగ్గించడం లక్ష్యం. సిగరెట్ల పొడవు ఆధారంగా పన్నులు మారతాయి. వీఞా ఆధారిత ధరల విధానం, తయారీదారులకు జజుఎ కెమెరాలు వంటి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. సిగరెట్ల ధరలు భారీ పెరగనున్న విషయం తెలిపిందే. ఆ పెంపు రేపటి నుంచి(ఫిబ్రవరి 1) అమలులోకి రానుంది. పొగాగు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకాన్ని, పాన్ మసాలాపై ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్‌ను అమలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ కొత్త పన్ను నిర్మాణం జూలై 2017లో +ూ అమలులోకి వచ్చినప్పటి నుండి ఈ వస్తువులుపై విధించబడిన ప్రస్తుత 28 శాతం +ూ, సెస్‌ను భర్తీ చేస్తుంది. ప్రభుత్వ లక్ష్యం ఆదాయాన్ని పెంచడమే కాకుండా పొగాకు వినియోగాన్ని తగ్గించేందుకు ధరల పెంపు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు సిగరెట్లు, పాన్ మసాలా వంటి ఉత్పత్తులు 28 శాతం +ూ, దాని పైన పరిహార సెస్సుకు లోబడి ఉండేవి. అయితే కోవిడ్ సమయంలో రాష్ట్రాల ఆదాయ నష్టాలను భర్తీ చేయడానికి తీసుకున్న రూ.2.69 లక్షల కోట్ల రుణాన్ని జనవరి 31, 2026 నాటికి తిరిగి చెల్లిస్తారు. దీని తరువాత పరిహార సెస్సును దశలవారీగా తొలగిస్తారు. ఈ శూన్యతను పూరించడానికి ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం, ఆరోగ్య సెస్సు తీసుకొచ్చింది.

**ఎంత పొడవు ఉంటే అంత పన్ను..**

కొత్త నిబంధనల ప్రకారం సిగరెట్ల పొడవు ఆధారంగా పన్ను విధించనున్నారు. 65 మిల్లీమీటర్ల వరకు ఉన్న చిన్న నాన్-ఫిల్టర్ సిగరెట్లకు ఒక్కో స్టిక్ కు సుమారు రూ.2.05 అదనపు సుంకం విధించారు. ఫిల్టర్ సిగరెట్లకు సుమారు రూ.2.10 అదనపు పన్ను, 65 నుండి 70 మిల్లీమీటర్ల కొలతలు కలిగిన సిగరెట్లకు ఒక్కో స్టిక్ కు రూ.3.6 నుండి రూ.4 వరకు పన్ను విధించారు. అయితే 70 నుండి 75 మిల్లీమీటర్ల కొలతలు కలిగిన పొడవైన, ప్రీమియం సిగరెట్లకు ఒక్కో స్టిక్‌కు సుమారు రూ.5.4 పన్ను విధించారు. విలక్షణమైన లేదా అసాధారణమైన డిజైన్లతో కూడిన సిగరెట్లకు ఒక్కో స్టిక్ కు గరిష్టంగా రూ.8.50 పన్ను విధించారు.

**పొగాకు, గుట్కాపై అధిక భారం**

నమలడం పొగాకు, జర్దా, సువాసనగల పొగాకుపై 82 శాతం వరకు ఎక్సైజ్ సుంకం విధిస్తున్నారు. గుట్కాపై ఈ పన్ను 91 శాతానికి చేరుకుంటుంది. పాన్ మసాలాపై 40 శాతం జీఎస్టీ, ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్ విధించారు. మొత్తం పన్ను భారం దాదాపు 88 శాతంగా ఉంది. ఫిబ్రవరి 1 నుండి పొగాకు ఉత్పత్తులకు వీఞా ఆధారిత ధరల విధానం అమలు చేయనున్నారు. అంటే ప్యాకేజీపై ముద్రించిన రిటైల్ ధర ఆధారంగా +ూ నిర్ణయిస్తారు. పాన్ మసాలా తయారీదారులు కొత్త సెస్ చట్టం ప్రకారం కొత్త రిజిస్ట్రేషన్ పొందవలసి ఉంటుంది. అదనంగా ఫ్యాక్టరీలు ప్యాకింగ్ యంత్రాలపై జజుఎ కెమెరాలను ఏర్పాటు చేయడం, 24 నెలల పాటు రికార్డులను నిర్వహించడం తప్పనిసరి. యంత్రాల సంఖ్య, సామర్థ్యం గురించి సమాచారాన్ని కూడా ఎక్సైజ్ శాఖకు అందించాల్సి ఉంటుంది.

# మెట్రో విస్తరణతో హైదరాబాద్ మరింత 'హై'కి..!

### డీపీఆర్ కేంద్రానికి పంపిన రాష్ట్ర ప్రభుత్వం!



తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రెండోదశ విస్తరణకు 9 కారిడార్లకు డీపీఆర్‌లు రూపొందించి కేంద్రానికి పంపింది. మొదటిదశ స్వాధీనం తర్వాత అనుమతులు రాగానే పనులు మొదలవుతాయి. పాతబస్తీతో పాటు అన్ని కారిడార్లలోనూ ఏకకాలంలో విస్తరణ చేపట్టి, రియల్ ఎస్టేట్‌ను ప్రోత్సహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణ ప్రభుత్వం మెట్రో రెండోదశలో 9 కారిడార్లలో విస్తరణకు డీపీఆర్‌లు రూపొందించి కేంద్రం అనుమతి కోసం పంపించింది. మెట్రోరైలు ఫస్ట్ స్టేజ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ పూర్తికాగానే రెండోదశకు అనుమతి ఇవ్వనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అనుమతులు రాగానే మొదట పాతబస్తీలో విస్తరణ పనులు ప్రారంభించే అవకాశం ఉంది. ఒకేసారి అన్ని కారిడార్లలో పనులు మొదలు పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. విస్తరణ పనులు షురూ అయితే ఆ ఏరియాల్లో రియల్ ఎస్టేట్ కూడా ఊపందుకుంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. రెండోదశను ఏ, బి కేటగిరిలుగా విభజించి అన్ని ప్రాంతాలకు సర్కారు ప్రాధాన్యం ఇచ్చింది. పాతబస్తీలో భూసేకరణ ప్రక్రియ చివరిదశలో ఉండగా, మిగిలిన కారిడార్లలో భూసేకరణకు అయ్యే రూ.2,787 కోట్ల నిధుల మంజూరుకు రాష్ట్ర మంత్రిమండలి ఇప్పటికే ఆమోదం తెలిపింది.

**'ఏ' కేటగిరిలో ఐదు కారిడార్లు**

కారిడార్-4: నాగోల్-ఆరాంఘర్-శంషాబాద్ విమానాశ్రయం: 36.8 కి.మీ., అంచనా వ్యయం రూ.11,226 కోట్లు

కారిడార్-5: రాయదుర్గం- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్-కోకాపేట నియోపోలీస్: 11.6 కి.మీ., వ్యయం రూ.4,318 కోట్లు

కారిడార్-6: ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట: 7.5 కి.మీ., ఖర్చు రూ.2,741 కోట్లు

కారిడార్-7: మియాపూర్-పటాన్‌చెరు: 13.4 కి.మీ., వ్యయం రూ.4,107 కోట్లు

కారిడార్-8: ఎల్బీనగర్-హయత్‌నగర్: 7.1 కి.మీ., ఖర్చు రూ.1,877 కోట్లు

**'బి' కేటగిరిలో మూడు...**

కారిడార్-9: శంషాబాద్ విమానాశ్రయం-ఓఆర్ఆర్- ఫ్యూచర్‌సిటీ వరకు.. 39.6 కి.మీ., అంచనా వ్యయం రూ.7,168 కోట్లు

కారిడార్-10: జేబీఎస్- మేడ్చల్ వరకు 24.5 కి.మీ... వ్యయం రూ.6,946 కోట్లు

కారిడార్-11: జేబీఎస్-శామీర్‌పేట వరకు 22 కి.మీ., వ్యయం రూ.5,465 కోట్లు

రెండోదశ 'ఏ' కేటగిరిలో మొత్తం 76.4 కిలో మీటర్ల మెట్రో విస్తరణకు రూ.24,269 కోట్లు అంచనా. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా 18 శాతం రూ.4,230 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వాటా రూ.7,313 కోట్లు ఇవ్వనున్నాయి. 48 శాతం రూ.11,693 కోట్లు రుణాల ద్వారా, 4 శాతం రూ.1,033 కోట్లు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో సమకూర్చుకోనున్నాయి. రెండోదశ 'బి' కేటగిరిలో 86.1 కి.మీ. దూరానికి రూ.19,579 కోట్లు అవుతుందని అంచనా. ఇందులో కేంద్రం వాటా 18 శాతం రూ.3,524 కోట్లు. రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం అంటే రూ.5,874 కోట్లు. రుణాల ద్వారా 48 శాతం రూ.9,398 కోట్లు, పీపీపీలో 4 శాతం రూ.783 కోట్లుగా డీపీఆర్‌లో ప్రతిపాదించారు.

# హత్య చేసి.. అడవిలో దంపతుల మకాం..



వాళ్ళిద్దరూ స్నేహితులు.. ఏజెన్సీలో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే డబ్బు అవసరం వచ్చి స్నేహితుడి నుంచి డబ్బు తీసుకున్న మరో స్నేహితుడు. అయితే తీసుకున్న అప్పు తిరిగివ్వాలసి సదురు స్నేహితుడు తడడంతో అప్పు తీసుకున్న వ్యక్తికి ఆగ్రహం పుట్టుకొచ్చింది. అప్పు ఇచ్చిన వ్యక్తిని హత్య చేస్తే.. తీసుకున్న డబ్బు చెల్లించే పనిలేదనుకొని.. భార్యతో కలిసి స్నేహితుడిని హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ఓ ఇంట్లో వేసి ఇంటికి నిప్పంటించారు. హత్యను ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. అనంతరం అక్కడి నుంచి అడవిలోకి పారిపోయారు. పాడేరు ఏజెన్సీలోని.. ఓ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. పోలీసులను కలవర పెట్టింది. ఎందుకంటే ఓ ఇంట్లో ఓ వ్యక్తి దహనం అయ్యాడు. ఈ ఘటన ఈనెల 23న పాడేరు మండలం చింతలపాలెంలో జరిగింది. రామన్న అనే 73 ఏళ్ళ వృద్ధుడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తూ పాక ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అతనికి వంతల సోమన్న అనే వ్యక్తితో కొన్నాళ్లుగా స్నేహం ఉంది. గతంలో తన వ్యక్తిగత అవసరాల కోసం 5600 రూపాయలను రామన్న నుంచి సోమన్న తీసుకున్నాడు. అయితే పది రోజుల క్రితం సోమన్న తన భార్య దేవితో కలిసి రామన్న దగ్గరికి వెళ్లారు. రామన్న దగ్గర జీలిగ కళ్ళు ఉండడంతో దాన్ని తాగినందుకు దంపతులిద్దరూ చింతలపాలెం కు వెళ్లి రామన్నను పలకరించారు. అయితే గతంలో తీసుకున్న అప్పు చెల్లించాలని రామన్న సోమన్నను కోరాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ మొదలైంది. రామన్నను చంపేస్తే డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని సోమన్న భార్య పథకం వేసింది. ఈనెల 23న ఇద్దరు కలిసి రామన్న దగ్గరికి వెళ్లారు. ముందుగా రామన్న కొడుకు చిన్న బాబును సోమన్న తన వద్ద ఉన్న కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో చిన్నబాబు పరుగులు తీశాడు.

**ప్రమాద మరణంగా చిత్రీకరించేలా సజీవ దహనం**

జీలుగా చెట్టు వద్ద ఉన్న రామన్న తన కొడుకు పరుగులు పెడుతుండడం చూసి ఆపాడు.. తన కొడుకును ఎందుకు కొడుతున్నావ్ అంటూ సోమన్నను నిలదీసాడు రామన్న. దీంతో రామన్న పై విచక్షణ రహితంగా దాడి చేశాడు సోమన్న. దీంతో రామన్న అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అయితే హత్య కేసు తమపై రాకుండా ఉండేందుకు ఈ హత్యను ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు సోమన్న దంపతులు. గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన రామన్నను తీసుకెళ్లి అక్కడే ఉన్న అతని పాక ఇంట్లో పడేశారు. అనంతరం ఇంటికి నిప్పు పెట్టి అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో రామన్న ప్రాణం ఉండగానే మంటల్లో సజీవ దహనమై ఊపిరి వదిలాడు.

**నిందితులను పట్టించిన డ్రోన్**

విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే చంచలపాలెం గ్రామానికి చేరుకుని రామన్న తాటి ఇంటిని పరిశీలించారు. నిందితుల అడవిలోకి పారిపోయారనే సమాచారంతో వారి కోసం అడవుల్లో డ్రోన్ల సహాయంతో గాలించారు. నిందితులు రెండు మూడు రోజులపాటు ఆహారం లేక అడవుల్లోనే ఉండిపోయారు. ఎట్టకేలకు డ్రోన్ కెమెరాలకు చిక్కిపోయారు. గాల్లో డ్రోన్లు ఎగరడం గమనించిన ఇద్దరు నిందితులు దాన్ని నుంచి తప్పించుకునేందుకు పొదల్లోకి పారిపోయారు. కానీ అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు.

# సామాజిక సమానత్వ దిశగా ముందడుగు..


## చారిత్రాత్మక పట్టణంలో వీధుల పేర్ల మార్పు..!




చారిత్రాత్మక పట్టణంలో వీధుల పేర్లు మారుస్తూ మున్సిపల్ అధికారులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. సంవత్సరాలుగా కులాల పేర్లతో కొనసాగుతున్న పలు వీధుల పేర్లను మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఆదేశాల నేపథ్యంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బొబ్బిలి పట్టణంలోని మొత్తం పదకొండు వీధులకి కొత్త పేర్లు నిర్ణయించింది. కుల ఆధారిత పేర్లు ప్రభుత్వం నిషేధించడంతో పాటు మానవహక్కుల పరిరక్షణ దృష్ట్యా వాటిని మార్చడం అత్యవసరమని అధికారులు భావించారు. ఈ నేపథ్యంలో తొలి వార్డులోని చాకలి వీధికి నందెన్న వీధి అనే పేరు పెట్టగా, రెండో వార్డులో ఉన్న హరిజనవాడను ఇకపై ఆది ఆంధ్ర వీధిగా పిలవాలని నిర్ణయించారు. మూడో వార్డులో పెదచాకలి వీధికి బాపూజీ వీధి అనే కొత్త పేరు వర్తింపజేశారు. 3వ, 4వ వార్డుల పరిధిలోని ఆకులరెల్లి వీధిను ఆర్సీఎం వీధిగా మారుస్తూ తీర్మానం ఆమోదించారు. అలాగే ఆరో, ఏడో వార్డుల్లో ఉన్న చాకలి, వడ్డీ చాకలి వీధులను రెండిటినీ మంగిశెట్టి వీధిగా మార్చారు. పదో వార్డులోని హరిజనవాడకు భీమ్రావ్ వీధి పేరు ఖరారైంది. 12వ వార్డులోని చాకలి వీధి వెంగళరాయ వీధిగా, 24వ వార్డులోని పాత హరిజనవాడ మొకరా వీధిగా మారింది. అదే వార్డులోని మరో చాకలి వీధికి దేశమ్మ తల్లి వీధి అనే పేరు ఇచ్చారు. 30వ వార్డులోని పాకీ వీధి ఇక నుంచి చిక్కాల వీధిగా పిలవనున్నారు. ఈ మార్పులకు సంబంధించిన తీర్మానాలను బొబ్బిలి మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ తీర్మానాలను రాష్ట్ర ప్రభుత్వానికి, మానవహక్కుల కమిషన్‌కి నివేదన పంపినట్లు మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి వెల్లడించారు. ఈ నిర్ణయం బొబ్బిలిలో సామాజిక సమానత్వం, సమగ్రత, గౌరవ భావాల పెంపుదలకు దోహదం చేస్తుందనే అభిప్రాయం స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతోంది.

# ఏడాది తర్వాత కలిసిన భార్య..

## కాసేపటికే ఊహించని ట్విస్ట్ ఇచ్చిన భర్త.. ఏం చేశాడంటే?



భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగం చేసుకుంటున్నారు.. భార్య బెంగళూరు, భర్త నెల్లూరులో ఉంటున్నారు. వీరిద్దరి మధ్య కొంత కాలంగా గొడవలు ఉన్నాయి. మనస్పర్ధలు ఉన్నా అప్పుడప్పుడూ ఫోన్ లో మాట్లాడుకునేవారు. చాలా రోజుల తర్వాత బెంగళూరు నుంచి భార్య నెల్లూరు వచ్చింది. నెల్లూరు వచ్చిన భార్యను భర్త బస్ స్టేషన్‌కు వెళ్లి రిసీవ్ చేసుకున్నాడు. సీన్‌కట్‌చేస్తే ఇంటికి మాత్రం ఇద్దరిలో ఒక్కరే వెళ్లారు.. అసలు మార్గ మధ్యలో జరిగిందేంటో తెలిస్తే.. మీరు షాక్ అవ్వాల్సిందే. చాలా రోజుల తర్వాత బెంగళూరు నుంచి వచ్చిన భార్యను బస్టాప్ నుంచి పిక్ చేసుకున్న భార్య.. మార్గ మధ్యలోనే ఆమెను అతికిరాతకంగా హత్య చేసిన ఘటన నెల్లూరు జిల్లాలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. నెల్లూరు టౌన్ చిల్డ్రన్స్ పార్క్ ఏరియాకి చెందిన నందిని, శ్రీహరి అనే దంపతులు, ఉద్యోగ రీత్యా చెరో నగరంలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే వివాహబంధంలో మనస్పరదాలు రావడంతో వీరిద్దరూ గత కొంతకాలంగా విడివిడిగా ఉంటున్నారు. ఇద్దరి మధ్య మనస్పర్థలు ఉన్నప్పటికీ వీరు.. అప్పుడబ్బుడూ ఫోన్ చేసుకుంటూ, కలుస్తూ ఉండేవారు. అయితే భార్య నందిని బెంగళూరు నగరంలో ఉద్యోగం చేస్తూ ఉండేది. అయితే ఇటీవల ఇద్దరూ కలిసి ఓ నిర్ణయానికి వచ్చారు. జరిగిన గొడవలన్నీ మరిచిపోయి కలిసిమెలిసి జీవనం సాగించాలని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని భర్త శ్రీహరి నందినీకి ఫోన్లో నచ్చజెప్పి నెల్లూరుకి రప్పించాడు. ఆమెను రిసీవ్ చేసుకునేందుకు భర్త శ్రీహరే బస్టాండ్ కూడా వెళ్ళాడు. బస్సు నుంచి దిగిన నందినిని ప్రేమగా రిసీవ్ చేసుకున్నాడు. స్కూటర్‌పై ఎక్కించుకొని మార్గమధ్యంలో పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెను నిర్ధాక్షణంగా పొడిచి పొడిచి చంపాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని పరిశీలించి పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. శ్రీహరి భార్యను హత్య చేయడానికి వివాహేతర సంబంధమే కారణమై ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ ప్రజలకు గుడ్‌న్యూస్..

# రాష్ట్రవ్యాప్తంగా 24 గంటలు విద్యుత్..



ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భారీ శుభవార్త. రాష్ట్రంలో విద్యుత్ కోతలకు చెక్ పడనుంది. ఇక నుంచి కోతల్లేని కరెంట్ ప్రజలకు అందనుంది. త్వరలో రానున్న వేసవికాలంలో రాష్ట్రంలోని ప్రజలకు కోతల్లేకుండా నిరంతరం విద్యుత్ అందించేలా కూటమి ప్రభుత్వం మరో ముందుడుగు వేసింది. అదేంటంటే..? వేసవి వచ్చిందంటే చాలు.. కరెంట్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఎండ వేడి, ఉక్కబోత తట్టుకోలేక ప్రజలు ఇళ్లల్లో ఏసీల, కూలర్లు , ఫ్యాన్లు ఎక్కువగా వాడుతూ ఉంటారు. దీని వల్ల విద్యుత్ కోతలు సాధారణంగా ఉంటాయి. దీనిని అధిగమించేందుకు ఏపీ ప్రభుత్వం సరికొత్త ప్లాన్‌తో ముందుకు వెళ్తుంది. ప్రజలకు వేసవిలో అసలు కోతలు లేకుండా విద్యుత్ అందించేందుకు ఇప్పటినుంచే పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తుంది. ఆ వివరాలేంటో ఇప్పుడు చూద్దాం.

**కొత్త విద్యుత్ ప్రాజెక్టులకు శ్రీకారం**

విద్యుత్ కోతలు అనేవి లేకుండా ఉండాలంటే విద్యుత్ ఉత్పత్తి ఎక్కువగా ఉండాలి. దీంతో రాష్ట్రంలో ఉత్పత్తిని పెంచేందుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా కొత్త విద్యుత్ ప్రాజెక్టులను నిర్మిస్తోంది. రూ.6 వేల కోట్లతో కొత్త విద్యుత్ ప్రాజెక్టులకు నిర్మిస్తుండగా.. ప్రస్తుతం వీటి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు నెలల్లో ఈ ప్రాజెక్ట్‌ల పనులు పూర్తి చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. తాజాగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల విషయమై సచివాలయంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నెలల్లో పనులు వెంటనే పూర్తి చేసి కొత్త ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చేలా ప్రయత్నాలు చేయాలని సూచించారు. నిర్ణీత సమయంలో అన్నింటినీ కంప్లీట్ చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

**ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్**

ఏపీవ్యాప్తంగా ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను ఉద్ధమంగా తీర్చిదిద్దాలని అధికారులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. ఇప్పటికే ట్రాన్స్‌మిషన్ ఇబ్బందులను ఎదుర్కొనేందుకు జిల్లాల్లో కొత్త సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వీటిని నిర్ణీత సమయంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇక అమరావతిలో రాజధాని అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్న క్రమంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ విద్యుత్ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్‌తో పాటు ట్రాన్స్‌కో ఉన్నతాధికారుల పాల్గొన్నారు.

ఏపీలోని ఆ ఎయిర్‌పోర్టుకు

# అంతర్జాతీయ గుర్తింపు..

**ఐసీఏఓ కోడ్ VOVI కేటాయింపు!**



ఆంధ్రప్రదేశ్‌లోనేఇ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం మరో గనత సొంతం చేసుకుంది. ఎయిర్‌పోర్టుకు ఐసీఏఓ కోడ్ 'VOVI' గా అధికారికంగా కేటాయించడంతో ఆంధ్రప్రదేశ్ విమానయాన రంగం కొత్త దశలోకి అడుగుపెట్టింది. అల్లూరి సీతారామరాజు పేరుతో ప్రారంభంకానున్న ఈ విమానాశ్రయం ప్రపంచ విమాన మ్యాప్‌లో తన ప్రత్యేక స్థానాన్ని పొందింది. జనవరి 4, 2026న తొలి ట్రైల్ కమర్షియల్ ఫ్లైట్ భోగాపురం రన్‌వే పై దిగడంతో కీలక మైలు రాయి దాటిన ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు మరో ముందడుగు వేసింది. ఉత్తరాంధ్ర ప్రజలు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న బోగాపురం విమానాశ్రయం ప్రయాణీకుల రాకపోకలకు మాత్రమే కాకుండా, సరుకు రవాణా, లాజిస్టిక్స్ రంగాల అభివృద్ధికి కూడా దోహదపడేలా రూపుదిద్దుకుంది. 3.8 కిలోమీటర్ల పొడవైన రన్‌వే పై జరిగిన అన్ని పరీక్షలు విజయవంతమయ్యాయి. అన్ని సాంకేతిక తనిఖీలు సమయానికి పూర్తవుతున్నాయని సంబంధిత అధికారులు తెలియజేశారు. రూ. 4,700 కోట్ల వ్యయంతో నిర్మాణం జరుగుతున్న ఈ ప్రాజెక్ట్‌లో ఇప్పటివరకు సుమారు 93 శాతం పనులు పూర్తయ్యాయి. విశాఖపట్నం నుంచి 45 కిలోమీటర్ల దూరంలో విశాఖపట్నం--విజయనగరం సరిహద్దుల్లో ఉన్న ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్రలో రవాణా అవకాశాలను విస్తృతంగా పెంచనుంది. ఇప్పటికే ఈ ప్రాంతం చుట్టూ రియల్ ఎస్టేట్ రంగం గణనీయ ఉత్సాహం సంతరించుకుంది. వీఎంఆర్డీఏ ఆమోదం పొందిన అనేక ప్లాట్లు వెలువడడంతో పెట్టుబడిదారులు, స్థానిక వ్యాపార వేత్తలు పెద్ద ఎత్తున ముందుకొస్తున్నారు. రాబోయే నెలల్లో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశం ఉండటంతో పరిసర జిల్లాల్లో ఉపాధి, పరిశ్రమల వృద్ధికి ఇదే కీలక దశగా భావిస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడ వేల కోట్ల పెట్టుబడితో అనేక సంస్థలు దూకుడుగా నిర్మాణం జరుపుతున్నాయి. మరో నాలుగు నెలల్లో విమానాశ్రయ ప్రభుత్వం జరగనున్న నేపథ్యంలో అందుకు కావలసిన అన్ని అనుమతులు చకచకా వస్తున్నాయి. ఈ విమానాశ్రయం ప్రారంభం జరిగితే ఉత్తరాంధ్ర అభివృద్ధికి మరొక మైలురాయిగా నిలవనుంది.

## క్రీడా వాయిస్

### తిరువనంతపురంలో

# ఇషాన్ విధ్వంసం..

### టీ20 కెరీర్లో తొలి సెంచరీ నమోదు



తిరువనంతపురం వేదికగా జరుగుతున్న ఆఖరి టీ20లో టీమిండియా పరుగుల సునామీ సృష్టించింది. కివీస్ బౌలర్లను ఒక ఆట ఆడుకుంటూ ఇషాన్ కిషన్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సిక్సర్ల వర్షం కురిపించారు. ముఖ్యంగా ఇషాన్ కిషన్ తన టీ20 కెరీర్లో తొలి సెంచరీ చేశాడు. అలాగే కెప్టెన్ సూర్య 3000 పరుగుల రికార్డుతో మెరుపు హాఫ్ సెంచరీ సాధించడం మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం సాక్షిగా టీమిండియా ఓపెనర్ ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా విరుచుకుపడ్డాడు. కేవలం 42 బంతుల్లోనే శతక్కొట్టి తన కెరీర్‌లో తొలి అంతర్జాతీయ టీ20 సెంచరీని నమోదు చేశాడు. కివీస్ బౌలర్లను ఒక ఆట ఆడుకున్న ఇషాన్, గాలిలో సిక్సర్ల వర్షం కురిపిస్తూ మైదానాన్ని హోరెత్తించాడు. టీ20 వరల్డ్ కప్ 2026కు ముందు జరుగుతున్న ఆఖరి పోరులో టీమిండియా బ్యాటర్లు తమ విశ్వరూపాన్ని ప్రదర్శించారు. ముఖ్యంగా వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ తన బ్యాట్‌తో చరిత్ర సృష్టించాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలోనే లోకల్ స్టార్ సంజు శాంసన్ (6) వికెట్ కోల్పోవడం షాక్ ఇచ్చింది. అయితే, ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్ మాత్రం ఏమాత్రం తడబడకుండా కివీస్ బౌలింగ్‌ను చీల్చి చెండాడాడు. ఈ క్రమంలో కేవలం 42 బంతుల్లోనే 10 సిక్సర్లు, 6 ఫోర్లతో అద్భుతమైన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. సెంచరీ పూర్తి చేసిన వెంటనే భారీ షాట్‌కు ప్రయత్నించి అవుట్ అయినప్పటికీ, అప్పటికే భారత్‌కు ఒక భారీ స్కోరును అందించాడు. మరోవైపు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సైతం తన 360 డిగ్రీల బ్యాటింగ్‌తో అలరించాడు. కేవలం 26 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసిన సూర్య, ఓవరాల్‌గా 30 బంతుల్లో 63 పరుగులు (4 ఫోర్లు, 6 సిక్సర్లు) చేసి అవుట్ అయ్యాడు. ఇషాన్, సూర్య కలిసి మూడో వికెట్‌కు కేవలం 57 బంతుల్లోనే 137 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో సూర్యకుమార్ యాదవ్ అంతర్జాతీయ టీ20ల్లో అత్యంత వేగంగా 3000 పరుగుల మైలురాయిని దాటిన ఘనతను కూడా సొంతం చేసుకున్నాడు. వీరిద్దరి విధ్వంసంతో భారత జట్టు 17.3 ఓవర్లు ముగిసేసరికి 4 వికెట్ల నష్టానికి 233 పరుగులు చేసింది. కివీస్ స్పిన్నర్ ఈష్ సోధిని టార్గెట్ చేసిన ఇషాన్, ఒకే ఓవర్‌లో ఏకంగా 29 పరుగులు రాబట్టడం మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. పవర్‌ప్లేలో అభిషేక్ శర్మ (30) మెరుపులు కూడా జట్టుకు మంచి ఊపునిచ్చాయి. ప్రస్తుతం క్రీజులో హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్ ఉండటంతో టీమిండియా 250 పైచిలుకు స్కోరు సాధించే దిశగా దూసుకుపోతోంది. వరల్డ్ కప్‌కు ముందు ఇషాన్ కిషన్ ఇలాంటి మాస్ ఇన్నింగ్స్ ఆడటం జట్టు సెలెక్టర్లకు తీపి కబురు లాంటిదే.

# అబ్బా..ఏం బిల్డప్ సామీ.. జెర్సీ లాంచ్ రద్దు..

### ఇంతకు వరల్డ్ కప్ ఆడతారా లేదా?




టీ20 వరల్డ్ కప్ 2026 నిర్వహణకు భారత్, శ్రీలంక సిద్ధమవుతుండగా, పాకిస్థాన్ మాత్రం ప్రతి అడుగులోనూ సస్పెన్స్ కొనసాగిస్తోంది. పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ఇప్పటికే పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను కలిసి ఈ విషయంపై చర్చించారు. బంగ్లాదేశ్‌ను ఐసీసీ టోర్నీ నుంచి తొలగించి, వారి స్థానంలో స్కాట్లాండ్‌ను చేర్చడాన్ని పాక్ తీవ్రంగా నిరసిస్తోంది. టీ20 వరల్డ్ కప్ 2026 ప్రారంభానికి కేవలం వారం రోజుల సమయం మాత్రమే ఉన్న వేళ, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీసుకున్న ఒక సంచలన నిర్ణయం క్రీడా ప్రపంచంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. టోర్నీలో పాల్గొనడంపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వని పాక్, తాజాగా శనివారం జరగాల్సిన జట్టు జెర్సీ లాంచ్ ఈవెంట్‌ను హఠాత్తుగా రద్దు చేసింది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టీ20 మ్యాచ్ టాస్ తర్వాత ఈ జెర్సీని ఆవిష్కరించాల్సి ఉంది. అయితే ప్రభుత్వ విదేశీ వ్యవహారాల శాఖ నుంచి అనుమతి రాకపోవడంతో ఈ కార్యక్రమాన్ని నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామంతో పాక్ అసలు వరల్డ్ కప్ ఆడుతుందా? లేదా? అనే ఉత్కంఠ పరాకాష్టకు చేరుకుంది.టీ20 వరల్డ్ కప్ 2026 నిర్వహణకు భారత్, శ్రీలంక సిద్ధమవుతుండగా, పాకిస్థాన్ మాత్రం ప్రతి అడుగులోనూ సస్పెన్స్ కొనసాగిస్తోంది. పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ఇప్పటికే పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను కలిసి ఈ విషయంపై చర్చించారు. బంగ్లాదేశ్‌ను ఐసీసీ టోర్నీ నుంచి తొలగించి, వారి స్థానంలో స్కాట్లాండ్‌ను చేర్చడాన్ని పాక్ తీవ్రంగా నిరసిస్తోంది. బంగ్లాదేశ్‌కు మద్దతుగా తాము కూడా టోర్నీని బహిష్కరించాలని పాక్ ప్రభుత్వం తొలుత భావించినప్పటికీ, ఐసీసీ నుంచి వచ్చే భారీ జరిమానాలు, ఆంక్షల భయంతో వెనక్కి తగ్గినట్లు కనిపిస్తోంది. అయినప్పటికీ అధికారికంగా జెర్సీని లాంచ్ చేయకపోవడం వెనుక ఏదో బలమైన రాజకీయ వ్యూహం ఉందనే చర్చ జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం.. పాకిస్థాన్ జట్టు ఫిబ్రవరి 2న (సోమవారం) కొలంబోకు ప్రయాణించేందుకు విమాన టిక్కెట్లు బుక్ చేసుకుంది. అదే రోజు పాక్ ప్రభుత్వం తన తుది నిర్ణయాన్ని ప్రకటించనుంది. ఒకవేళ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే, జట్టు నేరుగా శ్రీలంకకు చేరుకుంటుంది. హైబ్రిడ్ మోడల్ ప్రకారం పాక్ తన గ్రూప్ మ్యాచ్‌లను శ్రీలంకలోనే ఆడాల్సి ఉంది. ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా భారత్-పాక్ మధ్య జరగాల్సిన మహా సమరంపై కూడా నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ మ్యాచ్‌ను బహిష్కరిస్తే ఐసీసీ వాణిజ్యపరంగా దెబ్బతింటుందని, తద్వారా తమ నిరసనను ప్రపంచానికి తెలియజేయవచ్చని పీసీబీలోని ఒక వర్గం భావిస్తోంది. మరోవైపు పాక్ వైఖరిని చూసి ఐస్లాండ్, ఉగాండా వంటి చిన్న దేశాల క్రికెట్ బోర్డులు సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నాయి. "మీరు రాకపోతే మేము రావడానికి సిద్ధంగా ఉన్నాం, మా పాస్‌పోర్టులు రెడీ" అంటూ ఉగాండా క్రికెట్ చేసిన పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఐసీసీ నిబంధనల ప్రకారం, ఒకవేళ పాకిస్థాన్ చివరి నిమిషంలో తప్పుకుంటే, వారిపై శాశ్వత నిషేధం విధించే అవకాశం కూడా ఉంది. దీనివల్ల పాక్ క్రికెట్ బోర్డుకు వచ్చే వార్షిక ఆదాయంలో సుమారు 34.5 మిలియన్ డాలర్ల గండి పడవచ్చు. మరి అన్ని కోల్పోయి పాక్ పంతం నెగ్గించుకుంటుందా? లేక సోమవారం నాటికి సర్దుకుంటుందో చూడాలి.

# ఇండియా పాక్ పోరుకు ముందు క్రికెట్ దేవుడి ఎంట్రీ..

### మాస్టర్ మైండ్ నుంచి మాస్టర్ ప్లాన్






అండర్-19 వరల్డ్ కప్ 2026లో మరో మహా సంగ్రామం జరగబోతోంది. గ్రూప్-2 నుంచి సెమీఫైనల్ బెర్తును ఖరారు చేసుకునేందుకు ఆదివారం భారత్, పాకిస్థాన్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ అత్యంత కీలకమైన మ్యాచ్‌కు ముందు భారత కుర్రాళ్లకు క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ రూపంలో ఒక గొప్ప బూస్టప్ లభించింది. అండర్-19 వరల్డ్ కప్ 2026లో మరో మహా సంగ్రామం జరగబోతోంది. గ్రూప్-2 నుంచి సెమీఫైనల్ బెర్తును ఖరారు చేసుకునేందుకు ఆదివారం భారత్, పాకిస్థాన్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ అత్యంత కీలకమైన మ్యాచ్‌కు ముందు భారత కుర్రాళ్లకు క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ రూపంలో ఒక గొప్ప బూస్టప్ లభించింది. పాకిస్థాన్‌తో తలపడబోయే ముందు ఒత్తిడిని ఎలా జయించాలో, విజయానికి కావాల్సిన మంత్రాలేంటో సచిన్ వీడియో కాల్ ద్వారా యువ ఆటగాళ్లకు దిశానిర్దేశం చేశారు. అండర్-19 వరల్డ్ కప్ సూపర్-6లో భాగంగా ఆదివారం భారత్, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి. ఇప్పటికే గ్రూప్-1 నుంచి ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్థాన్, గ్రూప్-2 నుంచి ఇంగ్లాండ్ సెమీఫైనల్‌కు చేరుకోగా.. మిగిలిన ఒక్క స్థానం కోసం భారత్, పాక్ మధ్య పోటీ నెలకొంది. ఈ హై-ప్రెషర్ గేమ్‌కు ముందు బీసీసీఐ ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ వీడియో కాల్ ద్వారా మన యువ ఆటగాళ్లతో ముచ్చటించారు. కేవలం బ్యాటింగ్ టెక్నిక్ మాత్రమే కాకుండా, మానసికంగా ఎంత దృఢంగా ఉండాలి, క్రమశిక్షణ, వినయం విజయానికి ఎంత ముఖ్యమో తన అనుభవాలను పంచుకున్నారు. భారత జట్టు ప్రస్తుతం 3 మ్యాచ్‌ల్లో 3 విజయాలతో 6 పాయింట్లతో టేబుల్‌లో రెండో స్థానంలో ఉంది. ం3.337 భారీ నెట్ రన్ రేట్ టీమిండియాకు అతిపెద్ద బలం. పాకిస్థాన్ 4 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. ఒకవేళ ఆదివారం పాక్ గెలిచినా.. నెట్ రన్ రేట్‌లో భారత్‌ను అధిగమించడం వారికి చాలా కష్టం. కాబట్టి భారత్ కేవలం మ్యాచ్ గెలిస్తే చాలు, అధికారికంగా సెమీస్ బెర్తు దక్కుతుంది. సుమారు నెల రోజుల క్రితమే ఆసియా కప్ ఫైనల్లో పాక్ చేతిలో భారత్ ఓడిపోయిన నేపథ్యంలో, ఆ పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలని వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రే వంటి హిట్టర్లు తహతహలాడుతున్నారు. సచిన్ తన మాటల్లో.. "గ్రౌండ్‌లో ప్రతి క్షణం ఏకాగ్రతతో ఉండటం ముఖ్యం. నైపుణ్యం ఉండటం ఒక ఎత్తు అయితే, దాన్ని క్రమశిక్షణతో ప్రదర్శించడం మరో ఎత్తు. భూమి మీద కాళ్ళు ఉంచి, వినయంగా ఉంటేనే క్రికెట్‌లో గొప్ప విజయాలు సాధించగలరు" అని కుర్రాళ్లకు హితబోధ చేశారు. సచిన్ వంటి లెజెండ్ నుంచి ఇలాంటి మాటలు వినడం తమకు వెలకట్టలేని అనుభవమని, ఇది తమ ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని యువ ఆటగాళ్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మ్యాచ్ ఫిబ్రవరి 1వ తేదీ (ఆదివారం) జింబాబ్వేలోని బులవాయో క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో జరగనుంది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1 గంటకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. మీరు ఈ పోరును స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్షంగా చూడవచ్చు. అలాగే జియోహాట్‌స్టార్ యాప్, వెబ్‌సైట్‌లో లైవ్ స్ట్రీమింగ్ అందుబాటులో ఉంటుంది. సెమీఫైనల్ బెర్తు కోసం జరుగుతున్న ఈ సమరంలో సచిన్ ఇచ్చిన గురుమంత్రం మన కుర్రాళ్లకు ఎంతవరకు ఉపయోగపడుతుందో చూడాలి.

# 5 మ్యాచ్‌లు, 46 పరుగులు.. సొంత గ్రౌండ్‌లోనూ అట్టర్ ఫ్లాప్..

### టీ20 ప్రపంచకప్ నుంచి శాంసన్ ఔట్..?




టీం ఇండియా వికెట్ కీపర్-బ్యాట్స్ మాన్ సంజు సామ్సన్ సిరీస్ చివరి మ్యాచ్ లోనూ అట్టర్ ఫ్లాప్ అయ్యాడు. తన సొంత మైదానంలో ఆడుతున్న అతను కేవలం 6 పరుగులు చేసి పెవిలియన్ కు చేరాడు. ఈ క్రమంలో వరుస అవకాశాలను వృథా చేసుకున్న అతను టీ20 ప్రపంచకప్ ప్లేయింగ్ 11 నుంచి తప్పుకునే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. భారత్ వర్సెస్ న్యూజిలాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా నేడు చివరి మ్యాచ్ తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ స్టేడియంలో జరిగింది. ఈ మ్యాచ్ సంజు సామ్సన్‌కు ప్రత్యేకమైనది. ఎందుకంటే, ఇది అతని సొంత మైదానంలో మొదటి అంతర్జాతీయ మ్యాచ్. కేరళ అభిమానులు తమ హీరోని చూడటానికి ఉత్సాహంగా వచ్చారు. కానీ సంజు ఆ సందర్భాన్ని చిరస్మరణీయంగా మార్చలేకపోయాడు. అయితే అతను అవుట్ అయిన తర్వాత, స్టేడియంలో అందరి హృదయాలను గెలుచుకున్న ఒక దృశ్యం ఆవిష్కృతమైంది.

**సంజు ఔట్ అయినప్పుడు చప్పట్లు ఎందుకు వచ్చాయంటే?**

ఇన్నింగ్స్ ప్రారంభించిన సంజు సామ్సన్ 6 బంతుల్లో 6 పరుగులు చేసి, కేవలం ఒక ఫోర్ మాత్రమే కొట్టి ఔటయ్యాడు. అతను పెవిలియన్ నుంచి బయటకు వెళ్లగానే స్టేడియం నిశ్శబ్దంగా మారింది. కానీ అభిమానులు స్టాండింగ్ ఒవేషన్ తో అతనికి చప్పట్లు కొట్టారు. అభిమానులు తమ స్థానిక కుర్రాడిని ఉత్సాహపరిచారు. అతను అందరి హృదయాలను గెలుచుకున్నాడు. అయితే, ఈ ప్రదర్శన సంజు స్థిరమైన పేలవమైన ఫామ్‌ను మరింత హైలైట్ చేసింది.

**వరుసగా 5 మ్యాచ్‌ల్లో పరాజయం..**

ఈ సిరీస్ అంతటా సంజు ప్రదర్శన చాలా నిరాశపరిచింది. అతను 5 ఇన్నింగ్స్‌లలో కేవలం 46 పరుగులు మాత్రమే చేశాడు. మొదటి మ్యాచ్‌లో 10 పరుగులు, రెండవ మ్యాచ్‌లో 6 పరుగులు, మూడవ మ్యాచ్‌లో మొదటి బంతికే అవుట్, నాల్గవ మ్యాచ్‌లో 24 పరుగులు, ఐదవ మ్యాచ్‌లో మరో 6 పరుగులు. ఈ రికార్డు ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో ఒక భారత ఓపెనర్ చేసిన అత్యల్ప స్కోరు రికార్డుగా మారింది. గతంలో సంజు ఈ రికార్డును కలిగి ఉన్నాడు. 2025లో ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల ం20 సిరీస్‌లో సంజు కేవలం 51 పరుగులు మాత్రమే చేశాడు. సంజు వరుసగా ఐదు పరాజయాలు టీం ఇండియాకు పెద్ద ఆందోళనగా మారాయి. 2026 టీ20 ప్రపంచ కప్ సమీపిస్తోంది. ఓపెనింగ్ స్లాట్‌లో స్థిరత్వం అవసరం. జట్టు యాజమాన్యం అతనికి నిరంతరం అవకాశాలు ఇస్తూనే ఉంది. కానీ, అతను భారీ స్కోర్లు చేయకపోవడం ప్రశ్నలను లేవనెత్తింది. ఇషాన్ కిషన్ మాత్రం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇది సంజు స్థానంపై చర్చను తీవ్రతరం చేస్తుంది. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ మరో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన తన మార్కును చూపించాడు.

# కివీస్‌తో ఆఖరి పోరు.. సూర్య ఖాతాలో భారీ రికార్డు..

### రోహిత్, విరాట్ సరసన చేరే అవకాశం



టీ20 ప్రపంచకప్ 2026 సమరానికి ముందు టీమిండియా ఆడుతున్న ఆఖరి పోరు కు రంగం సిద్ధమైంది. తిరువనంతపురం వేదికగా న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదో టీ20 మ్యాచ్, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు అత్యంత కీలకంగా మారింది. టీ20 ప్రపంచకప్ 2026 సమరానికి ముందు టీమిండియా ఆడుతున్న ఆఖరి పోరుకు రంగం సిద్ధమైంది. తిరువనంతపురం వేదికగా న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదో టీ20 మ్యాచ్, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు అత్యంత కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో సూర్య కేవలం మరో 33 పరుగులు చేస్తే, టీ20 అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో ఒక అరుదైన మైలురాయిని చేరుకుంటాడు. తద్వారా ప్రపంచ క్రికెట్‌లో నెంబర్ 12 ప్లేయర్‌గా రికార్డు సృష్టించే అవకాశం సూర్య ముందు ఉంది.టీ20 వరల్డ్ కప్ 2026 ప్రారంభానికి ముందు టీమిండియాకు ఇదే చివరి అంతర్జాతీయ టీ20 మ్యాచ్. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇప్పటివరకు 103 టీ20 మ్యాచ్‌ల్లో 97 ఇన్నింగ్స్‌లు ఆడి 2,967 పరుగులు చేశాడు. తిరువనంతపురంలో జరగనున్న ఆఖరి మ్యాచ్‌లో అతను మరో 33 పరుగులు చేస్తే, టీ20 ఫార్మాట్‌లో 3000 పరుగుల మైలురాయిని చేరుకున్న ప్రపంచంలోని 12వ ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు. ఈ ఘనత సాధించిన మూడో భారతీయ క్రికెటర్‌గా కూడా నిలుస్తాడు. గతంలో రోహిత్ శర్మ (4,231 పరుగులు), విరాట్ కోహ్లీ (4,188 పరుగులు) మాత్రమే భారత్ తరపున ఈ ఫీట్ సాధించారు. ప్రస్తుతం పాకిస్థాన్ స్టార్ బాబర్ ఆజం 4,453 పరుగులతో ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. కేవలం సూర్య మాత్రమే కాదు, న్యూజిలాండ్ ఆటగాళ్లు కూడా ఈ మ్యాచ్‌లో కొన్ని రికార్డులపై కన్నేశారు. గత మ్యాచ్‌లో అదరగొట్టిన కివీస్ ఓపెనర్ టిమ్ సీఫెర్ట్, టీ20ల్లో 2000 పరుగులు పూర్తి చేసుకోవడానికి 52 పరుగుల దూరంలో ఉన్నాడు. ఒకవేళ అతను ఈ ఘనత సాధిస్తే, ఈ మైలురాయిని చేరిన నాలుగో న్యూజిలాండ్ ప్లేయర్‌గా నిలుస్తాడు. ఇక బౌలింగ్ విభాగంలో ఈష్ సోధికి ఒక అద్భుత అవకాశం ఉంది. కివీస్ లెజెండరీ బౌలర్ టిమ్ సౌథీ పేరిట ఉన్న 164 వికెట్ల రికార్డును అధిగమించాలంటే సోధికి కేవలం మరో 3 వికెట్లు కావాలి. ఈ మ్యాచ్ కేవలం రికార్డుల కోసమే కాదు, వరల్డ్ కప్ ముందు టీమ్ కాంబినేషన్లను పరీక్షించుకోవడానికి కూడా భారత్‌కు ఒక గొప్ప అవకాశం. తిరువనంతపురంలోని పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశం ఉండటంతో సూర్యకుమార్ యాదవ్ తన ట్రేడ్ మార్క్ షాట్లతో విరుచుకుపడే అవకాశం ఉంది. వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీకి వెళ్లే ముందు కెప్టెన్ ఇలాంటి భారీ మైలురాయిని అందుకోవడం జట్టు ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుంది. ఒకవేళ సూర్య ఈ 33 పరుగులు చేస్తే, అతను అత్యంత వేగంగా (ఇన్నింగ్స్‌ల పరంగా) 3000 పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో కూడా చోటు సంపాదించే అవకాశం ఉంది.

సినీ వాయిస్ CINEMA

# పవన్ కళ్యాణ్‌తో క్రేజీ సినిమా..

## పైగా స్టార్ హీరోయిన్ చెల్లి.. ఈ అమ్మడు ఎవరో గుర్తుపట్టారా.?



ఆమె ఓ అందాల తార.. తెలుగులో సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది. ఆమె అక్క గ్లోబల్ స్టార్.. తెలుగులో ఏకంగా పవన్ కళ్యాణ్ తో సినిమా చేసి మెప్పించింది. కానీ ఆతర్వాత కనిపించకుండా పోయింది ఈ ముద్దుగుమ్మ. ఇంతకూ ఆమె ఎవరో గుర్తుపట్టారా.? సరే మీకోసం ఓ క్లూ.. గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా చెల్లి ఆమె.. ప్రియాంక చోప్రా చెల్లెలు కూడా టాలీవుడ్ లో తోప్ హీరోయిన్. ఆమె ఎవరో కాదు మీరా చోప్రా. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన బంగారం సినిమా సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమాతోనే తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్‌గా పరిచయం అయ్యింది మీరా చోప్రా. ఈ సినిమాతో టాలీవుడ్ లో ఫేమస్ అయ్యింది. రెండు దశాబ్దాల క్రితం ఇండస్ట్రీలో అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ ఇప్పటికీ సినిమాల్లో నటిస్తునే ఉంది. కానీ బ్యాక్ టూ బ్యాక్ కాకుండా ఆడపాదడపా చిత్రాల్లో నటిస్తుంది. ఏడాదికి ఒకటి అర చిత్రాల్లో నటిస్తుంది. కానీ సోషల్ మీడియాలో మాత్రం రెగ్యులర్ గా తన అందమైన ఫోటోస్ షేర్ చేస్తుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ నెట్టింట వైరలవుతున్నాయి. ఇండస్ట్రీలో అడుగుపెట్టి రెండు దశాబ్దాలు అవుతుంది. ఈతరం హీరోయిన్లకు ఏమాత్రం తగ్గకుండా ఇప్పటికీ అదే అందంతో నెట్టింట మాయ చేస్తుంది మీరా. బంగారం బ్యూటీ ఎంతో అందంగా ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్. కానీ ఈ బ్యూటీకి ఆఫర్స్ ఎందుకు రావడం లేదంటున్నారు ఫ్యాన్స్. తాజాగా మీరా చోప్రా ఫ్యాన్స్ అందరూ సర్ ప్రైజ్ అయ్యే విధంగా అందంగా కనిపిస్తూ నెట్టింట ఫోటోస్ షేర్ చేసింది. అందంతోపాటు ఫిజిక్ తోనూ కట్టిపడేస్తుంది మీరా. ప్రస్తుతం ఈ అమ్మడు షేర్ చేసిన పిక్స్ వైరలవుతున్నాయి.



# ఎర్ర చీరలో అందాల ముద్దుగుమ్మగా..

### అనుపమా బ్యూటిఫుల్ ఫొటోస్ !

అందాల చిన్నది అనుపమ పరమేశ్వరన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ మధ్య సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటున్న ఈ చిన్నది, తాజాగా రెడ్ కలర్ చీరలో తన అంద చందాలతో అందరినీ ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. మలయాళీ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఈ చిన్నది తన నటన, అందంతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుందింది. ఆఆ, మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి ఈ మూవీలో శ్రీ వల్లి పాత్రలో ప్రతి ఒక్కరి మనసు దోచుకుంది. ఇక ఈ మూవీ తర్వాత ఈ అమ్మడుకు వరసగా అవకాశాలు రావడంతో వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, మంచి ఫేమ్ సంపాదించుకుంది. చాలా సినిమాల్లో నటించినప్పటికీ, ఈ అమ్మడు మాత్రం స్టార్ హీరోయిన్‌గా సత్తా చాటలేకపోయింది. శతమానం భవతి మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ చిన్నది తర్వాత చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. ఈ సినిమాలన్నింటిలో చాలా పద్ధతిగా కనిపిస్తూ, ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో ఈ అమ్మడు చేసిన సినిమాలన్నీ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యాయి. ఒక పరదా మూవీ తప్ప అన్ని మంచి హిట్ ఇచ్చాయి. ఒకప్పుడు పద్ధతిగా సినిమాల్లో కనిపించిన ఈ అందాల ముద్దుగుమ్మ టిల్లు స్క్వేర్ సినిమాతో బోల్డ్ లుక్ మారింది. ఈ మూవీలో తన గ్లామర్‌తో ప్రతి ఒక్కరినీ కట్టిపడేసింది. లిల్లీ పాత్రలో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది తాజాగా రెడ్ కలర్ చీరలో తన అంద చందాలతో అందరినీ ఆకట్టుకుంది. ప్రతస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

### వివి వినాయక్ హీరోగా లాంచ్ అయిన

# శీనయ్య మూవీ ఎందుకు ఆగిపోయిందో తెలుసా..?




దర్శకుడు వి.వి. వినాయక్ సీనయ్య సినిమాతో నటుడిగా మారే ప్రయత్నం, ఆ ప్రాజెక్ట్ రద్దు వెనుక గల కారణాలను వివరించారు. చిత్ర పరిశ్రమలో డైరెక్టర్లపై ఫ్లాపుల ప్రభావం, ప్రేక్షకులలో వచ్చిన మార్పులను ఆయన చర్చించారు. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు సినిమా రంగానికి ఎలా శత్రువుగా మారాయో, వాటి ప్రభావంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. దర్శకుడు వి.వి. వినాయక్ ఓ ఇంటర్వ్యూలో తన వృత్తిపరమైన, వ్యక్తిగత ప్రయాణం గురించి, ముఖ్యంగా రద్దైన తన సీనయ్య చిత్రం, చిత్ర పరిశ్రమలోని ప్రస్తుత పోకడలు, ఓటీటీ ప్రభావంపై వివరణాత్మకంగా మాట్లాడారు. యాంకర్ రోషన్ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, తాను డైరెక్టర్ గానే కొనసాగాలని భావించానని, నటుడిగా మారాలనే కోరిక తనకు లేదని స్పష్టం చేశారు. అయితే, దిల్ రాజు ప్రొడక్షన్ లో సీనయ్య చిత్రంలో నటించే అవకాశం వచ్చినప్పుడు, తాను అంగీకరించడానికి ప్రధాన కారణం బరువు తగ్గడమేనని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కోసం ఒక సంవత్సరం పాటు జిమ్‌కు వెళ్లి కఠినమైన శిక్షణ తీసుకున్నానని, తన శరీరాకృతిని మెరుగుపరచుకోవడానికే అధిక ప్రాధాన్యత ఇచ్చానని వివరించారు. దురదృష్టవశాత్తు, కరోనా మహమ్మారి వ్యాప్తి, అలాగే కథపై తనకు, నిర్మాత దిల్ రాజుకు సంతృప్తి లేకపోవడం వల్ల ఈ ప్రాజెక్ట్ షూటింగ్ జరగకముందే రద్దైందని వినాయక్ వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ఓపెనింగ్ మాత్రమే జరిగిందని, షూటింగ్ జరగలేదని స్పష్టం చేశారు. చిత్ర పరిశ్రమలో సినిమా హిట్, ఫ్లాప్‌ల ప్రభావంపై వినాయక్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఒక సినిమా విజయవంతం అయితే దర్శకుడికి చాలా తక్కువ క్రెడిట్ ఇస్తారని, కానీ ఫ్లాప్ అయితే మాత్రం మొత్తం బాధ్యతను దర్శకుడిపైనే నెట్టేస్తారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చాలా దారుణమైన ధోరణి అని, ఒక సినిమా కథ నిర్మాణం అనేది అందరి సమిష్టి నిర్ణయమని, కేవలం దర్శకుడిని నిందించడం సరికాదని అన్నారు. ఒక డైరెక్టర్‌పై ఫ్లాప్‌లు చాలా తీవ్ర ప్రభావం చూపుతాయని, హీరోలకు ఉన్నంత వెసులుబాటు దర్శకులకు ఉండదని ఆయన పేర్కొన్నారు. గతంలో కె. రాఘవేంద్ర రావు వంటి దిగ్గజ దర్శకులకు కూడా వరుస ఫ్లాపులు వచ్చినా, ఇప్పుడున్నంత దారుణంగా వారిని విమర్శించేవారు కాదని, అప్పటి పరిస్థితులు వేరని వినాయక్ గుర్తు చేసుకున్నారు. తన 2018 చిత్రం ఇంటిలిజెంట్ ఫలితం కూడా తనను కొంతకాలం బాగా కలచివేసిందని ఆయన పంచుకున్నారు. ఆధునిక ప్రేక్షకుడి అభిరుచిలో వచ్చిన మార్పుల గురించి మాట్లాడుతూ, ప్రస్తుతం కథలో కంటెంట్ ఉంటేనే థియేటర్‌లకు ప్రేక్షకులు వస్తున్నారని వినాయక్ పేర్కొన్నారు. స్టార్ హీరోల సినిమాలు కూడా కథాబలం లేకపోతే ఆదరణ పొందడం లేదని, ఇది ఒక ఆరోగ్యకరమైన మార్పు అని అన్నారు. అయితే, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు సినిమా రంగానికి ఒక శత్రువు లాంటివని వినాయక్ అభిప్రాయపడ్డారు. ఇది కేవలం పెద్ద దర్శకులకు మాత్రమే కాదు, చిన్న, పెద్ద తేడా లేకుండా అందరికీ వర్తిస్తుందని అన్నారు. గతంలో నాటకానికి సినిమా ఎలా శత్రువో, సినిమాకు టీవీ ఎలా శత్రువో, ఇప్పుడు టీవీకి ఓటీటీ శత్రువుగా మారిందని ఆయన పోల్చారు. ప్రజలు ఎక్కడ పడితే అక్కడ, ఫోన్‌లలో తమకు నచ్చిన సినిమాలు చూస్తున్నారని, దీనివల్ల థియేటర్‌లకు వెళ్ళే అలవాటు తగ్గిందని అన్నారు. ఒక సినిమా థియేటర్‌లలో విడుదలైన కొద్ది వారాలకే ఓటీటీలో వస్తుంది కదా అనే ఆలోచన ప్రేక్షకుల మధ్య పెరిగిందని, ఇది థియేటర్లలో సినిమా కలెక్షన్లపై తీవ్ర ప్రభావం చూపుతుందని వినాయక్ అభిప్రాయపడ్డారు.




### అత్యంత తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కి

# వసూళ్ల సునామి సృష్టించిన టాప్-10 మూవీస్..

కథ బాగుంటే చాలు.. ఆదరించే విషయంలో ముందు ఉంటారు తెలుగు జనాలు. భాషా బేధాలు ఉండవు.. అందులో స్టార్ క్యాస్ట్ ఉన్నారా.. లేరా అనేది కూడా చూడరు. కంటెంట్ మాత్రమే తెలుగు ఆడియెన్స్‌కు ప్రధానం. ఈ కథనంలో తక్కువ బడ్జెట్‌తో భారీ వసూళ్లు సాధించిన పది భారతీయ చిత్రాల గురించి తెలుసుకుందాం... భారతీయ సినీ పరిశ్రమలో కొన్ని సినిమాలు తక్కువ బడ్జెట్‌తో కూడా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాలు సాధించి, భారీ వసూళ్లు రాబట్టాయి. అలాంటి పది చిత్రాల వివరాలు ఇక్కడ ఉన్నాయి. కమెడియన్ వేణు దర్శకత్వం వహించిన బలగం చిత్రం 1.5 కోట్ల బడ్జెట్‌తో రూపొంది, 27 కోట్ల కలెక్షన్లను సాధించింది. కన్నడ హారర్ కామెడీ ఫిల్మ్ సూ ఫ్రం సో 5.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి... 100 కోట్లకు పైగా వసూలు చేసింది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన నటించిన గీత గోవిందం 5 కోట్ల పెట్టుబడితో నిర్మితమై.. 120 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. చార్లీ 777 చిత్రం 20 కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుని.. 100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. వెంకటేష్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం 50 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి.. 250 కోట్ల కలెక్షన్లను అందుకుంది. వివాదాస్పద చిత్రం ద కాశ్మీర్ ఫైల్స్ కేవలం 15 కోట్ల బడ్జెట్‌తో నిర్మితమై... 300 కోట్లకు పైగా వసూళ్లను సాధించి సంచలనం సృష్టించింది. సాయి పల్లవి తొలి తెలుగు చిత్రం ఫిదా 13 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి 90 కోట్లు రాబట్టింది. విజయ్ దేవరకొండ టాక్సీవాలా 7 కోట్ల బడ్జెట్‌తో రాగా.. 42 కోట్లు వసూలు చేసింది. నాగశౌర్య, రష్మిక మందన చలో 3 కోట్ల బడ్జెట్‌తో 24 కోట్లు సాధించింది. తెలుగు హారర్ థ్రిల్లర్ మసూద 2 కోట్ల బడ్జెట్‌తో 12 కోట్లు వసూలు చేసింది. ఈ సినిమాలు తక్కువ బడ్జెట్‌తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుని, భారీ విజయాలను నమోదు చేశాయి.



VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com